అనుదినం... జనస్వరం


నవతెలంగాణ

గురువారం 31 -01-2019 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 33 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

కేంద్రం మోకాలడ్డు

జాతీయ గణాంక సంఘంలో ఇద్దరు సభ్యులు రాజీనామా



- ఉపాధి, ఉద్యోగాలపై 'ఎన్ఎస్ఎస్ఓ' నివేదికను అడ్డుకుంది : చైర్‌పర్సన్ మోహనన్
- గణాంక సంఘం స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసిన నిటి ఆయోగ్
- గత జీడీపీ గణాంకాలకు 'నిటి ఆయోగ్' సవరించటంపై ఆగ్రహం

న్యూఢిల్లీ: కేంద్ర అత్యున్నత దర్యాప్తు సంస్థ (సీబీఐ)లో ఇటీవల చోటుచేసుకున్న వివాదం మరవకముందే మరో అగ్ర సంస్థలో లుకలుకలు చోటుచేసుకున్నాయి. జాతీయ గణాంకాల సంఘాన్ని(ఎన్ఎస్‌సీ) ఇద్దరు స్వతంత్ర్య సభ్యులు వీడారు. ఎన్ఎస్‌సీ చైర్‌పర్సన్ పిసి.మోహనన్, మరో స్వతంత్ర సభ్యురాలు, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ ప్రొఫెసర్ జెవి.మీనాక్షిలు తమ పదవులకు రాజీనామా చేశారు. దేశంలో గతేడాది ఉద్యోగ, నిరుద్యోగ సమాచారంపై ఎన్ఎస్ఎస్ఓ ...9లో



కారుదే

పైచేయి అయినా..

ముగిసిన మూడో విడత పంచాయతీ పోలింగ్

- అత్యధికంగా యాదాద్రిలో 94.99 శాతం.. అత్యల్పంగా జగిత్యాలలో 77.70 శాతం పోలింగ్
- పుంజుకున్న ప్రతిపక్షాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామ పంచాయతీ ఎన్నికల పోరు ముగిసింది. మొత్తం మూడు విడతల్లో పోలింగ్ జరగ్గా మూడింటిలోను టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులే ఆధిక్యతను చాటుకున్నారు. కానీ అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పంచాయతీ ఎన్నికల్లో ప్రతిపక్షం పుంజుకున్నది. దాదాపు 40 శాతం పంచాయతీలు టీఆర్ఎస్ యేతర పక్షాల వశమయ్యాయి. మూడు విడతల్లో మొత్తం 11,549 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరిగాయి. తొలివిడతలో 4,470 పంచాయతీలకు నోటిఫికేషన్ ఇవ్వగా 769 గ్రామాల్లో సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 3,701 గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించారు. ఇక రెండో విడతలో 4,135 గ్రామాలకు ఎన్నికల నోటిఫికేషన్ ...9లో



మూడో విడత ఫలితాలు...

మద్దతు పార్టీ :	టీఆర్ఎస్	కాంగ్రెస్	సీపీఐ(ఎం)	సీపీఐ	టీడీపీ	బీజేపీ	ఇతరులు
	2377	901	20	19	12	56	472
మొత్తం	7616	2656	76	50	82	160	1791

ఓటింగ్ కేంద్రాల వద్ద ఇద్దరు మృతి వివరాలు 9లో

గ్రామ పాలనకు అపాయింటెడ్ డే ఫిబ్రవరి 2న ముహూర్తం వివరాలు 9లో

ఇక ఎక్కడైనా

నర్సుల సేవలు

ఒక రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేస్తే చాలు


9లో

నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

రాష్ట్రపతి ప్రసంగంతో ఉభయ సభలు షురూ..

వివరాలు 10లో

నాంపల్లి ఎగ్జిబిషన్‌లో


భారీ అగ్నిప్రమాదం

ఉవ్వెత్తున ఎగిసిపడ్డ మంటలు

- పరుగులు దీసిన సందర్శకులు
- షార్ట్ సర్క్యూట్ కారణంగా స్టాళ్లు బుగ్గి
- కోట్లల్లో నష్టం : వ్యాపారులు

నవతెలంగాణ- సిటీబ్యూరో/సుల్తాన్‌బజార్

హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్‌లో గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన నుమాయిష్‌లో బుధవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సుమారు 400 పైగా షాపులు కాలి బూడిదయ్యాయి. రూ.కోట్లల్లో ఆస్తినష్టం జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన స్టాళ్ల నిర్వాహకులు వారి వారి వస్తువులు కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ మంటలు భారీగా ఎగిసి పడడంతో అవన్నీ వదిలేసి పరుగులు తీశారు. నుమాయిష్‌ను సందర్శించటానికి బుధవారం సుమారు 20వేలమంది వచ్చారు. మంటలు చూసి అందరూ ఒక్కసారిగా పరుగులు పెట్టడంతో స్వల్ప తోపులాట జరిగింది. దీంతో పలువురు కింద పడి గాయపడ్డారు. విషయం తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బంది 4 ఫైరింజన్లతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదు. దీంతో వెంటనే మరో 16 ఫైరింజన్లు తెప్పించారు. నుమాయిష్‌లో ఎక్కువగా రేకులు, చెక్కలు, ప్లాస్టిక్ వస్తువులు, తడకలు, బట్టలతో షాపులు ఏర్పాటు చేయడంతో మంటలు వాటికి అంటుకుని పెద్ద ఎత్తున వ్యాపించాయి. ఇక్క ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాళ్ల వద్ద గ్యాస్ సిలిండర్లు ఉండడంతో మంటలకు అవి ...9లో



భారత్‌లో మతహింసకుట్ర..?

మతతత్వ విధానాలతో బీజేపీ ఎన్నికలకు వెళితే..

- అమెరికా నిఘా వర్గాల నివేదిక



వాషింగ్టన్ : ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో ఎన్డీయే విధానాలు మత ఉద్రిక్తతలను పెంచాయనీ, బీజేపీ మళ్లీ మతాన్ని అడ్డుపెట్టుకొని లోక్‌సభ ఎన్నికలకు వెళితే భారత్‌లో పెద్ద ఎత్తున మత హింస చోటుచేసుకుంటుందనీ అమెరికా నిఘా విభాగం హెచ్చరించింది. దక్షిణాసియా దేశాలపై రూపొందించిన నివేదికలో ఈ విషయాల్ని అమెరికా నిఘా విభాగం డైరెక్టర్ డానియల్ కోట్స్ పేర్కొన్నారు. ఈ నివేదకను తాజాగా అమెరికా కాంగ్రెస్‌కు ఆయన సమర్పించారు. గూఢచర్యంపై ఏర్పడ్డ సెనెట్ సెలక్ట్ కమిటీ ముందు వాదనలు వినిపించారు.

ఈ సందర్భంగా ఆయన, నరేంద్రమోడీ హయాంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మత ఉద్రిక్తతలు పెరిగాయన్నారు. తమ మద్దతుదారులను క్రియాశీలం చేయడం కోసం బీజేపీ హింసను ప్రేరేపించే సాధనంగా మతాన్ని ముందుకు తెస్తారని అన్నారు. పాక్-భారత్ సంబంధాలు ఉద్రిక్తంగా మారాయన్నారు. ఈ రెండు దేశాల్లోనూ అణ్వాయుధ కార్యక్రమాలు పెరుగుతున్న నేపథ్యంలో దక్షిణాసియాలో అణు భద్రతకు సంబంధించిన ఘటన చోటుచేసుకునే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. "దక్షిణాసియా దేశాలకు ముందు ముందు మరిన్ని సవాళ్లు ఎదురుకాబోతున్నాయి. జులై, 2019లో ఆఫ్ఘనిస్తాన్ అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్నాయి. మరోవైపు పెద్ద ఎత్తున దాడులు జరపడానికి తాలిబాన్లు సిద్ధంగా ఉన్నారు"అని నివేదిక పేర్కొన్నది.

చందా కొచ్చర్

దోషే!

విచారణలో తేల్చిన శ్రీకృష్ణ కమిటీ..

వివరాలు 10లో

ప్రణయ్ మళ్లీ పుట్టాడు : అమృత

మగబిడ్డకు జననం


(ఫైల్)

నవతెలంగాణ-మిర్యాలగూడ

కుమారుడి రూపంలో ప్రణయ్ మళ్లీ పుట్టాడని అమృత ఆనందం వ్యక్తం చేసింది. గతేడాది నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో కులదురహంకార హత్యకు బలైన ప్రణయ్ భార్య అమృత మగబిడ్డకు జన్మనిచ్చింది. హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో బుధవారం మగశిశువుకు జన్మనివ్వగా తల్లీబిడ్డలిద్దరూ క్షేమంగా ఉన్నారు. కాగా గతేడాది సెప్టెంబర్ 14న ప్రణయ్ కుల దురహంకార హత్యకు గురయ్యాడు. అప్పటికే అమృత నాలుగు నెలల గర్భవతి. అమృత తండ్రి తిరునగరు మారుతిరావు ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడు. అతనితో పాటు నిందితులందరిపై పీడీ యాక్టు నమోదు చేయగా వారు ప్రస్తుతం వరంగల్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. గతేడాది జనవరి 30న అమృత-ప్రణయ్‌లు హైదరాబాద్‌లోని ఆర్యసమాజ్‌లో ప్రేమవివాహం చేసుకున్నారు. వివాహ వార్షికోత్సవంరోజే మగబిడ్డ జన్మించడంతో కుటుంబ సభ్యుల్లో ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

రియల్ గిరాకీ..



భారీగా పెరిగిన ఆదాయం

రంగారెడ్డిలో అత్యధికంగా 1226 కోట్లు

- 29 శాతం అధికం
- నోట్ల రద్దు, నగదుపై ఆంక్షలతో
- స్థిరాస్తి వ్యాపారం వైపు మొగ్గు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిస్థాయిలో పుంజుకున్నది. రెండేండ్ల కిందటితో పోలిస్తే ఇప్పుడు ఇది అనూహ్యంగా దూసుకుపోతున్నది. మారుమూల పల్లెల్లో భూముల ధరలతోపాటు నగర శివార్లల్లో ప్లాట్ల రేట్లు కూడా భారీగా పెరుగుతున్నాయి. రాజకీయ సుస్థిరత, పెద్దనోట్ల రద్దుతో ఇందులో వెలుగులు వచ్చాయి. మరోవైపు దేశ, విదేశీ ఐటీ కంపెనీ, నివాస పరిశ్రమలు వస్తుండటంతో ఈ రంగానికి జవసత్వాలు చేకూరాయి. రాష్ట్రంలోని ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో భారీస్థాయిలో రియల్‌ఎస్టేట్ పెరిగింది. సాధారణ ప్లాట్ల అమ్మకాలతోపాటు, అపార్ట్‌మెంట్లల్లోని ఫ్లాట్ల వ్యాపారం నగర శివార్లల్లో ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న కోంగరకలాన్‌లో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, లాజిస్టిక్ పార్కు, అమెజాన్ తదితర బహుళజాతి సంస్థల రాకతో రియల్ వ్యాపారం ఊపందుకుంది. వేతన జీవులు, అల్పాదాయ వర్గాలు, చిరువ్యాపారులు తమ స్తోమతకు తగ్గట్టుగా శివార్లల్లో ఇండ్ల స్థలాలు, భూములు కొనుగోలు చేస్తుండటంతో రియల్ బిజినెస్ వేగంగా సాగుతున్నది. ఎన్ఆర్ఐలు సైతం ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో భూముల కొనుగోళ్లకు ప్రాధాన్యతను ఇస్తుండటంతో ఎకరా స్థలం కోట్లు పలుకుతున్నది. ఆయాప్రాంతాల్లో చదరపు గజం 50వేలకు చేరుకుంది. ముఖ్యంగా గండిపేట, నార్సింగి, మంచిరేవుల, మణికొండ, మోకిల, హైదర్షాకోట్, ...9లో

జీహెచ్ఎంసీలో భారీ స్కామ్!

బోగస్ వేలిముద్రలతో కార్మికుల హాజరువేస్తున్న శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు

- 9 మంది నుంచి 84 ఫింగర్ ప్రింట్స్ స్వాధీనం
- యూట్యూబ్‌లో చూసి సింథటిక్ ఫింగర్ ప్రింట్స్ తయారీ
- తెరవెనుక పెద్దల హస్తంపై ఆరా

వివరాలు 9లో

మోడీలా కులరాజకీయాలు చేయను..!

- యూపీలో బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు

లక్నో: 'నేను ప్రధాని మోడీలా కుల రాజకీయాలు చేయను'.. ఇవేవో ప్రతిపక్షపార్టీకి చెందిన నాయకుడు చేసిన వ్యాఖ్యలు అనుకుంటే పొరపాటే. మోడీపై సొంత పార్టీకి చెందిన యూపీ ఎమ్మెల్యేనే ఈ వ్యాఖ్యలు చేశారు. సొంత నియోజకవర్గంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సదరు ఎమ్మెల్యే ప్రజల ముందే ఈ విధంగా స్పందించారు. అనంతరం దీనికి సంబంధించిన వీడియో కాస్తా వైరల్ కావడంతో వార్త వెలుగులోకి వచ్చింది. అయితే తాను మాత్రం ఆ వ్యాఖ్యలు చేయలేదని, ఇది ప్రత్యర్థుల కుట్ర అని ఆ ఎమ్మెల్యే తెలిపారు. అలీఘర్ ఎమ్మెల్యే రాజ్‌వీర్ సింగ్ దైలర్.. జబల్‌పూర్‌లో నియోజకవర్గ ప్రజలకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అక్కడి ప్రజలనుద్దేశిస్తూ రాజ్‌వీర్ మాట్లాడుతూ.. 'నేను ప్రధాని మోడీలాగా కుల రాజకీయాలు చేయను. ప్రజలు హిందువా లేదా ముస్లిమా అనేది నేను చూడను. బీజేపీ అధికారంలోకి వస్తే కష్టాలు ఎదుర్కోవల్సి వస్తుందని ముస్లింలు భావిస్తారు. కానీ, కుల, మతాలకతీతంగా ప్రతిఒక్కరూ బీజేపీకి సమానమే' అని అన్నారు. అనంతరం ఈ వీడియో ఇంటర్నెట్‌లో చక్కర్లు కొట్టింది. అయితే మోడీపై తాను ఆ వ్యాఖ్యలు తాను చేయలేదని, కుట్రలో భాగంగా ప్రత్యర్థులెవరో వీడియోను ఎడిట్ చేశారని అనంతరం సదరు ఎమ్మెల్యే వివరణ ఇచ్చుకున్నారు.

ఆనంద్‌తేల్తుంబ్డే కస్టోడియల్ విచారణ కోరుతున్న పోలీసులు

ముంబయి : భీమా కోరేగావ్ అల్లర్ల కేసులో అరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ ఆనంద్ తేల్‌తుంబ్డేను కస్టోడియల్ విచారణకు తీసుకోవాలని పుణే పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసులో రాబట్టిన కీలక ఆధారాల వివరాలను చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యూఏపీఏ) ప్రత్యేక కోర్టుకు పోలీసులు మంగళవారం సమర్పించారు. లభించిన కీలక ఆధారాలపై సమగ్ర దర్యాప్తు జరపాలంటే తేల్‌తుంబ్డే కస్టోడియల్ విచారణ అత్యంత ఆవశ్యకమని పోలీసులు ఈ సందర్భంగా తెలిపారు. భీమా కోరేగావ్ యుద్ధం 200వ వార్షికోత్సవం సందర్భంగా గతేడాది జనవరి 1న అల్లర్లు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినందునే అల్లర్లు తలెత్తాయని పేర్కొంటూ తేల్‌తుంబ్డేతో పాటు పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పవర్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులపై చిన్నచూపు

- 18 శాతం నిధులనే మంజూరు చేసిన వైనం

న్యూఢిల్లీ : విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా ఉండేందుకు తీసుకొచ్చిన పవర్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టు(పీటీపీ)లపై కేంద్రం చిన్నచూపు చూస్తోంది. ఈ ప్రాజెక్టులకు రూ.10,894 కోట్లను కేటాయించగా.. ఇప్పటివరకు రూ.1984 కోట్లను(18 శాతం) మాత్రమే మంజూరు చేయడం గమనార్హం. పవర్ సిస్టం డెవలప్‌మెంట్ ఫండ్(పీఎస్‌డీఎఫ్) కింద ప్రస్తుతం దేశంలో 117 పీటీపీలు నడుస్తున్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా, గ్రిడ్ ఓల్టేజీని మెరుగుపరిచేందుకుగాను వీటిని ఏర్పాటు చేశారు. కాగా.. 2015 ప్రారంభంలో మంజూరైన పీటీపీలకు వాటికి కేటాయించిన నిధుల్లో 30 శాతం మాత్రమే అందినట్టు నేషనల్ పవర్ కమిటీ పరిశీలనలో తేలింది.

ఎస్సీ, ఎస్టీ చట్ట సవరణలపై స్టే కు 'సుప్రీం' నో

న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ చట్టంలో సవరణలపై స్టే జారీ చేసేందుకు సుప్రీంకోర్టు మరోసారి నిరాకరించింది. ఈ చట్టం కింద నిందితులకు ముందస్తు బెయిల్‌ను నిరాకరించడాన్ని తిరిగి చట్టంలో చేరుస్తూ తీసుకువచ్చిన సవరణలపై స్టే విధించాలన్న అప్పీల్‌ను నిలిపివేయలేమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ చట్టానికి చేసిన మార్పులపై విచారణ చేపట్టాలని న్యాయవాది వికాస్ సింగ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ యు యు లలిత్ ధర్మాసనం స్పందిస్తూ.. ఎస్సీ, ఎస్టీ చట్టంపై సుప్రీంకోర్టు గతంలో వెలువరించిన తీర్పుపై రివ్యూ పిటిషన్‌తో పాటు అన్ని అంశాలపై వచ్చే నెల 19న విచారణ చేపడతామని తెలిపింది.

మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

'జై జవాన్.. జై కిసాన్.. జై సంవిధాన్..' నినాదాల హోరు

- దద్దరిల్లిన జంతర్‌మంతర్ ధర్నా చౌక్
- తొమ్మిదిరోజుల నిరసనలు షురూ
- తొలి రోజు మాజీ సైనికోద్యోగుల ఆందోళన
- హన్నన్ మొల్లా, జిగ్నేశ్ మెవాని హాజరు



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

దేశాన్ని తిరోగమనంలోకి తీసుకెళ్తున్న ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఆలిండియా కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా రైతులు, సైనికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు పలు సామాజిక, ప్రజాస్వామ్య సంఘాలు, రాజకీయ పార్టీలు సంయుక్తంగా తలపెట్టిన ఆందోళనా కార్యక్రమాలు దేశరాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం ప్రారంభమయ్యాయి.

తొమ్మిది రోజుల కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు మాజీ సైనికోద్యోగుల సంఘం నాయకులు రిటైర్డ్ మేజర్ సాబ్బీర్ సింగ్ ఆధ్వర్యాన ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ ధర్నాకు రైతు సంఘం నాయకులు హన్నన్ మొల్లా, దళిత నేత, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మెవానీ హాజరయ్యారు. ఒకవైపు అన్నదాతలు తమ సమస్యలపై గొంతెత్తుతుంటే, మరోవైపు రైతాంగ ఉద్యమాలను పక్కదోవపట్టించేందుకు సంఘపరివార్ కుట్రలు పన్నుతుందని వారు విమర్శించారు. రామమందిరం, శబరిమల అంశాలపై మనోభావాలను అడ్డంపెట్టుకొని ప్రజలను రెచ్చగొట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. 2014 ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైన మోడీ సర్కారు రామమందిరాన్ని ఎన్నికల ఎజెండాగా వినియోగించుకుంటుందని విమర్శించారు. అయితే, తమకు మాత్రం రైతుల సమస్యలే ఎన్నికల ఎజెండా అని వివరించారు.

మోడీ ప్రభుత్వాన్ని నమ్ముకున్న ఏ వర్గమూ నేడు సంతోషంగా లేదని రిటైర్డ్ మేజర్ సాబీర్ సింగ్ చెప్పారు.. జై జవాన్, జై కిసాన్... జై సంవిధాన్ నినాద స్ఫూర్తితో తాము ఉద్యమంలోకి వచ్చామన్నారు. దేశంలో నేడు రైతులు, సైనికులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైనికోద్యోగులకు వన్ ర్యాంక్ వన్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సైన్యంలో ఖాళీగా ఉన్న 7.5 లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. రక్షణ రంగంలో కుంభకోణాలకు తావు ఇవ్వకూడదని సూచించారు.

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

- జనవరి 31న ఆదివాసీ, దళిత సంఘాల ఆందోళన. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం నిర్వీర్యంపై నిరసన.
- ఫిబ్రవరి 1న రైతులు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా.
- ఫిబ్రవరి 2న చిట్‌ఫండ్ స్కాం బాధితుల హర్తాళ్.
- ఫిబ్రవరి 3న పౌర సమాజం కార్యకర్తల నిరసన.
- ఫిబ్రవరి 4న ఆధార్‌తో నిఘాకు నిరసనగా, పర్యావరణ పరిరక్షణ కార్యకర్తల ధర్నా.
- ఫిబ్రవరి 5న మహిళా రిజర్వేషన్ బిల్లుపై మహిళా సంఘాల పోరాటం
- ఫిబ్రవరి 6న విద్యా రంగ సమస్యలపై విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల పోరు.
- ఫిబ్రవరి 7న రాజ్యాంగ సంస్థలపై దాడికి నిరసనగా రాజకీయ పార్టీలతో ఆందోళన.

అయ్యో ..బాపూ...!

- జాతిపిత బొమ్మను కాల్చిన హిందూ మహాసభ సెక్రెటరీ



లక్నో: గాంధీ వర్ధంతి రోజున ఆయనకు ఘోర అవమానం జరిగింది. ఉత్తరప్రదేశ్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న అఖిల భారత హిందూ మహాసభ జాతీయ సెక్రెటరీ పూజా షకున్ పాండే.. గాంధీ చిత్రపటాన్ని పిస్తోల్‌తో కాల్చి పైశాచిక ఆనందం పొందడమే గాక స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. ఈ ఘటన యూపీలోని అలీగఢ్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. అఖిల భారత హిందూ మహాసభ ప్రతీయేటా గాంధీ వర్ధంతిని 'శౌర్య దివాస్ లేదా అమరుల దినం'గా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా, బుధవారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గాంధీ బొమ్మను పూజా పాండే పిస్తోల్‌తో కాల్చారు. అలా కాల్చగానే ఆయన బొమ్మ నుంచి రక్తం కారేలా ఏర్పాటు చేశారు. దీన్ని చూసి పాండేతో పాటు అక్కడున్న వారంతా పైశాచిక ఆనందం పొందారు. అంతేగాక, నాథూరాం గాడ్సే చిత్రపటానికి పూలమాల వేసి స్వీట్లు పంచారు. అనంతరం మహాత్ముడి హత్యోదంతాన్ని ప్రదర్శించారు. కాగా, ఈ ఘటనపై గాంధేయ వాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'భూగర్భ మైనింగ్'లో మహిళలకూ అనుమతి

- కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ నిర్ణయం

న్యూఢిల్లీ: అండర్ గ్రౌండ్(భూగర్భ) కోల్ మైనింగ్ పనులకు మహిళలకూ అనుమతినివ్వాలని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు మైనింగ్ నిబంధనల్లో అవసరమైన సవరణలు తీసుకురానున్నది. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం.. భూగర్భ బొగ్గు గనుల్లో పని చేసేందుకు మహిళలకు అనుమతి లేదు. కానీ, తనిఖీల నిమిత్తం బొగ్గు గనుల్లోకి వెళ్లేందుకు కొందరు మహిళా అధికారులకు అనుమతి ఉన్నది. కాగా.. భూగర్భ బొగ్గు గనుల్లో మహిళలను పని చేసేందుకు(పగలు మాత్రమే) అనుమతినివ్వాలని కార్మిక శాఖ నిర్ణయం తీసుకున్నది. అంతేకాక ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల్లో మహిళలను ఇక నుంచి షిఫ్టుల వారీగా(రాత్రయినా, పగలయినా) పని చేసేందుకు అవకాశమివ్వాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల్లో మహిళలు పగటి సమయాల్లో మాత్రమే పని చేస్తున్నారు. కార్మిక శాఖ తీసుకున్న తాజా నిర్ణయం కొద్దిరోజుల్లో అమల్లోకి రానున్నదని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. మహిళలకు ఎక్కువ ఉపాధి అవకాశాలు కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. కోల్ ఇండియాలో ప్రస్తుతం దాదాపు 3 లక్షల మంది పని చేస్తుండగా.. వీరిలో మహిళలు 15 నుంచి 20 శాతం మధ్యే ఉన్నారని చెప్పారు. బొగ్గు మైనింగ్‌లో పని చేస్తున్న మహిళల్లో కారుణ్య నియామకాలు, భూమి కోల్పోవడం ద్వారా ఉద్యోగాలు పొందిన వారే ఎక్కువ శాతం మంది ఉన్నారని ఓ కోల్ కంపెనీ అధికారి ఒకరు వెల్లడించారు.

ఈడబ్ల్యూఎస్ కోటాపై ప్రజాభిప్రాయం కోరండి

- హెచ్‌ఆర్డీకి న్యాయమంత్రిత్వ శాఖ సూచన

న్యూఢిల్లీ: ప్రయివేటు విద్యాసంస్థల్లో ఈడబ్ల్యూఎస్ కోటాపై ప్రజాభిప్రాయం కోరాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి(హెచ్‌ఆర్డీ) మంత్రిత్వశాఖకు న్యాయమంత్రిత్వ శాఖ సూచించింది. మరోపక్క, ఎన్డీయే హయాంలో పార్లమెంటు సమావేశాలు ఫిబ్రవరి 13తో ముగియనున్నాయి. దీనితో అగ్రవర్ణ పేదల ఓట్లకు గాలం వేస్తూ లోక్‌సభ ఎన్నికల ముందు మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన 'కోటా' అస్త్రం ముందుకెళ్లడం కష్టతరంగా మారింది. ఈ ఏడాది ప్రయివేటుతో సహా అన్ని సంస్థల్లో 10శాతం ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేస్తామని కేంద్ర మానవవనరుల అభివృద్ధి(హెచ్‌ఆర్డీ) మంత్రి ప్రకాశ్ జవదేకర్ ఇటీవల ప్రకటన చేసిన విషయ తెలిసిందే. అనంతరం దీనికి సంబంధించిన డ్రాఫ్టు బిల్లును వెనువెంటనే న్యాయమంత్రిత్వ శాఖకు హెచ్‌ఆర్డీ పంపింది. అయితే ప్రస్తుత పరిస్థితులు చూస్తే మాత్రం కేంద్రం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ బిల్లుకు స్పీడు బ్రేకర్లు పడేలా కనిపిస్తున్నాయి. హెచ్‌ఆర్డీ పంపిన డ్రాఫ్టు బిల్లులో న్యాయమంత్రిత్వశాఖ ఎలాంటి న్యాయపరమైన ప్రశ్నలను లేవనెత్తలేదు. కానీ ఆ బిల్లును ప్రజాక్షేత్రంలో ఉంచి వారి నుంచి అభిప్రాయాలు కోరాలని హెచ్‌ఆర్డీకి న్యాయమంత్రిత్వ శాఖ సూచించింది. అనంతరం ఈ బిల్లు విషయంలో ముందుకెళ్లాలని సూచించింది. కానీ, ఈ విషయంలో సంబంధిత మంత్రిత్వ శాఖ మాత్రం తుది నిర్ణయాన్ని తీసుకోలేదని విశ్వసనీయ సమాచారం. మరోపక్క, ఎన్డీయే హయాంలో చివరి పార్లమెంటు సమావేశాలు ఫిబ్రవరి 13న ముగియనున్నాయి. దీంతో ఈ బిల్లును పార్లమెంటు ముందుకు తీసుకెళ్లడం విషయంలో మరింత జాప్యం జరిగే అవకాశం కనిపిస్తున్నది.



మదురోకు చైనా మద్దతు

కరాకస్ : వెనెజులా అధ్యక్షుడు మదురోకు చైనా బాసటగా నిలిచింది. వెనెజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ప్రతిపక్ష నేత గైడోను అధ్యక్ష పీఠంపై కూర్చొండబెట్టాలని అగ్రరాజ్యం పావులు కదుపుతోంది. అమెరికా తీరు పట్ల ఇప్పటికే మదురో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని ట్రంప్ సర్కార్ ప్రయత్నించినట్టయితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అమెరికా చర్యలను రష్యా, చైనా దేశాలు ఖండించాయి. మదురోకు మద్దతుగా నిలిచాయి. దక్షిణ అమెరికా దేశమైన వెనెజులాతో చైనాకు బలమైన ద్వైపాక్షిక సంబంధాలున్నాయి. వెనెజులాలోని పలు పరిశ్రమల స్థాపనకు చైనా ఆర్థికంగా సహకరించింది. చమురు సంస్థలకు చైనా నుంచి భారీ మొత్తంలో రుణాలు అందుతున్నాయి. చైనా నుంచి ఆయుధాలను వెనెజులా సరఫరా చేసుకుంటున్నది. అంతేగాకుండా, రష్యా కూడా మదురో సర్కార్‌కు సంపూర్ణ మద్దతిస్తుండటంతో చైనా అండదండలు వెనెజులాకు ఉన్నాయి.

కెన్యాలో హై అలర్ట్

- సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం

నైరోబీ : కెన్యాలో హై అలర్ట్ ప్రకటించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు పోలీస్ అధికారులు తెలిపారు. ఉగ్రవాదుల కదలికలున్న ప్రాంతాల్లో ముమ్మర కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, రద్దీ ప్రదేశాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈనెల17న నైరోబీలోని ఓ హోటల్ కాంప్లెక్స్ ఆవరణలో ఆత్మాహుతి దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 21 మంది మృతి చెందారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు అల్‌షాబాబ్ ఉగ్రసంస్థ ప్రకటించుకుంది. ఆత్మాహుతి దాడి జరిగిన అనంతరం స్థానిక ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ ఘటన జరిగిన పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ప్రాణభయంతో ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది.

థాయ్‌లో మూతపడ్డ విద్యాసంస్థలు

- విష వాయువులు వ్యాపించడంతో అప్రమత్తమైన ప్రభుత్వం

బ్యాంకాక్ : థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లోని 437 పాఠశాలలు బుధవారం మూత పడ్డాయి. నగరంలో విషవాయువులు ఒక్కసారిగా వ్యాపించడంతో అప్రమత్త మైన ప్రభుత్వం ఆరు రోజులు సెల వులు ప్రకటించింది. పలు ఫౌండేషన్స్ చిన్నారులకు మాస్కులు పంపిణీ చేశారు. వాతావరణ కాలుష్యం కారణంగా విష వాయువులు వ్యాపిస్తు న్నాయని ప్రధాని ప్రయూత్ ఛాన్‌ఓచా తెలిపారు. కాలుష్య నియంత్రణ కోసం తాము చేపడుతున్న చర్యలు విఫలమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకాక్‌లో విష వాయువుల వ్యాప్తి కారణంగా చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురయ్యే ప్రమాదముందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇండ్ల నుంచి బయటకు పంపించొద్దని కోరారు.

దక్షిణాఫ్రికాలో ప్రయివేటు వ్యతిరేక జ్వాలలు

పబ్లిక్ సంస్థలను నాశనం చేయొద్దని డిమాండ్

ప్రిటోరియా : దక్షిణ ఆఫ్రికాలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు భగ్గుమన్నాయి. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న సంస్థలను ప్రయివేటీకరించనున్నట్టు ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నేషనల్ యూనియన్ ఆఫ్ మెటల్‌వర్కర్స్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా (నమ్‌సా), నేషనల్ యూనియన్ ఆఫ్ మైన్‌వర్కర్స్ (నమ్) కదం తొక్కారు. ప్రభుత్వ తీరును ఎండగట్టారు.



ప్రభుత్వం ప్రయివేట్ సెక్టర్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్లకార్డులు, బ్యానర్లు చేబూని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. వివాదాస్పదంగా మారిన ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ (ఐపీపీ) కార్యక్రమాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.సోషలిస్ట్ రివల్యూషనరీ వర్కర్స్ పార్టీ నమ్‌సా సభ్యుల నిరసన కార్యక్రమాలకు మద్దతుగా నిలిచింది. ఈ సందర్భంగా నమ్‌సా జనరల్ సెక్రటరీ ఇర్విన్ జిమ్ మాట్లాడారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా ప్రధానంగా మెటల్, వస్త్ర పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

యూనియన్స్‌తో ఎలాంటి సంప్రదింపులు చేయకుండా ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇర్విన్ తెలిపారు. ప్రభుత్వం తక్షణమే ఐపీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పునరుత్పాదక శక్తివనరులకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం ద్వారా ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదముందని అన్నారు. ప్రయివేట్ సంస్థలు లాభాపేక్షతో కార్మికుల అక్రమ తొలగింపులకు పాల్పడే ప్రమాదముందన్నారు.

ఫిలిప్పీన్స్ మసీదుపై గ్రెనేడ్ దాడి

ఇద్దరు మృతి, మరో నలుగురికి తీవ్ర గాయాలు



మనీలా : ఫిలిప్పీన్స్‌లోని ఓ మసీదుపై బుధవారం గ్రెనేడ్ దాడి జరిగింది. ఈ దాడిలో ఇద్దరు మృతి చెందారు. మరో నలుగురికి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకోలేదు. ఈ ఘటన జరిగిన ప్రాంతంలో అబూ సయ్యఫ్ ఉగ్రసంస్థ కార్యకలాపాలు అధికంగా ఉన్నాయి. ఈసంస్థకు చెందిన సభ్యులే ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటారని పోలీస్ అధికారులు అనుమానిస్తున్నారు. రీజినల్ మిలిటరీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ గెర్రీ బెసానా తెలిపిన వివరాల ప్రకారం...క్రైస్తవుల జనాభా అధికంగా ఉన్న జాంబోగా నగరంలోని మసీదుపై గ్రెనేడ్ దాడి జరిగింది.

ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్టే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు అమానవీయ చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు.

ఉగ్రసంస్థలపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, మూడురోజుల కిందట సమీప ద్వీపంలోని చర్చి వద్ద జరిగిన జంట పేలుళ్లలో 27 మంది మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నటు ఐఎస్ ప్రకటించుకుంది.

పాలస్తీనా ప్రధాని హమ్దల్లా రాజీనామా



జెరూసలేమ్ : పాలస్తీనా ప్రధాని హమ్దల్లా తన పదవికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు మంత్రివర్గ సభ్యులు కూడా తమ పదవులకు రాజీనామాలు చేశారు. వీరందరి రాజీనామాలను అధ్యక్షుడు మొహ్మద్ అబ్బాస్ బుధవారం ఆమోదించారు. సెంట్రల్ కమిటీ ఆఫ్ ఫతాహ్ గ్రూప్ ప్రతిపాదనల మేరకు ప్రధాని పదవి నుంచి తప్పుకున్నట్టు హమ్దల్లా తెలిపారు.

మంచుగడ్డలా మారిన అమెరికా

- ఉత్తర మిన్నెసోటా, డకోటాల్లో -50 డిగ్రీలు?

మిన్నెసోటా: అమెరికాలో చలి తీవ్రత ప్రమాదకర స్థాయికి పెరిగిపోయింది. హిమపాతం కారణంగా మిన్నెసోటాలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆర్కిటిక్ నుంచి వీస్తున్న చలి కారణంగా చాలా చోట్ల ఉష్ణోగ్రతలు సున్నా డిగ్రీల కంటే కిందకు పడిపోయాయి. రహదారులు మంచుతో కూరుకుపోయాయి. విస్కాన్సిన్ ప్రాంతంలో చలి తీవ్రత మరింత తీవ్రంగా ఉంది. ఇటీవలి కాలంలో ఇదే అత్యంత తీవ్రమైన హిమపాతమని స్థానికులు చెబుతున్నారు. దాదాపు తొమ్మిది కోట్ల మంది ప్రజలు చలితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరిలో దాదాపు 2.5 కోట్ల మంది ప్రజలు -20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలో జీవిస్తున్నారని అమెరికా జాతీయ వాతారణ సేవల సంస్థ వెల్లడించింది. ఉత్తర మిన్నెసోటా, డకో టాల్లో -50 డిగ్రీలు, ఇల్లీనాయిస్, గ్రేట్ లేక్స్, మిన్నె పోలీస్, డెట్రాయిట్, షికాగో తదితర ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యంత తీవ్రమైన హిమపాతం కారణంగా అమెరికాలో పలు సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు వెయ్యి విమానాలను రద్దు చేశారు. పోస్టల్ సర్వీసులు నిలిచిపోయాయి. పాఠశాలలను మూసివేశారు. యునివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్, యునివర్సిటీ ఆఫ్ మిన్నెసోటాలు తరగతు లను రద్దు చేశాయి. షికాగోలు 1985 జనవరి 20వ తేదీన -27 డిగ్రీలు నమోదైంది.

ఉత్తర భారత్‌లో చలి పంజా

ఉత్తర భారతదేశంలో చలి తీవ్రత అధికంగా ఉంది. ఆర్కిటిక్ నుంచి వీస్తున్న చలి గాలుల కార ణంగా చాలా చోట్ల ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రాజస్థాన్‌లోని చూరూ ప్రాంతంలో మంగళవారం -1.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. వెస్టర్లీ శీతల పవనాలు బలహీనపడ్డాయి. దీని ప్రభావం కార ణంగా ఆర్కిటిక్ సర్కిల్ నుంచి ఐరోపా, అమెరికా దేశాలకు చలి తీవ్రత ఎక్కువగా ఉన్నదని ఐఎండీ చీఫ్ శివానంద పాయ్ తెలిపారు. హిమాలయ పర్వత ప్రాంతాలకు పశ్చిమ దిశలోని ప్రాంతాల్లో మంచు తీవ్రత అధికంగా ఉన్నది. దీని ప్రభావంతో బుధవారం జమ్ము కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో మంచు అధికంగా కురిసింది. హిమాలయా లకు ఉత్తర దిశలో ఉన్న మైదానాల్లో పలు చోట్ల వర్షపాతం నమోదయ్యే అవకాశముందని ఐఎండీ తెలిపింది.

రాష్ట్ర పథకాలపై అవగాహన

- ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న
- ఐఏఎస్ ఐపీఎస్ ఐఎఫ్ఎస్ అధికారులు హాజరు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న కేంద్ర సర్వీసుల అధికారులకు రాష్ట్రంలో అమలు జరుగుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల శిక్షణా సంస్థ (డీఓపీటీ), మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు పాల్గొన్నారు. ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా బుధవారం జలసౌధలో జరిగిన కార్యక్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ కార్యక్రమాలపై సంబంధిత శాఖల ఇంజనీర్లు ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాగునీటి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్‌రాజ్ , ముఖ్యమంతి ఓఎస్డి శ్రీధర్‌రావు దేశ్‌పాండే, కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీర్ ఇన్ చీఫ్ హరిరామ్, మైనర్ ఇర్రిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్యామ్ సుందర్, మిషన్ భగీరథ సలహాదారు జగన్‌మోహన్, కాళేశ్వరం ప్రాజెక్ట్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. డీఓపీటీ తరపున హాజరయినా వారిలో రాజస్థాన్ నుంచి ఐఏఎస్ అధికారులు రాజేష్ శర్మ,, ఆ రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ కాంతిలాల్ ఉమాప్ , కేంద్ర హెూమ్ మంత్రిత్వ శాఖకు చెందిన మురళీధర్, కేంద్ర ఆర్థిక శాఖ నుంచి కుసుమ్ పద్మనాభన్, సుధా రాజగోపాలన్, తెలంగాణ నుంచి ఐఎఫ్ఎస్ అధికారి శివాని డోగ్రా, రాష్ట్ర అటవీ అకాడమీ నుంచి డిప్యూటీ డైరెక్టర్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు. మొదట సీఎం ఓస్డీ శ్రీధర్‌రావు దేశ్ పాండే ఆహ్వానం పలికి రాష్ట్ర అధికారులను పరిచయం చేశారు. కాళేశ్వరం ఇంజనీర్ ఇన్ చీఫ్ హరిరామ్ ఈ ప్రాజెక్టు లక్ష్యాలను, సాంకేతిక వివరాలను మ్యాప్ ద్వారా తెలిపారు. ప్రత్యక్ష ప్రసారాల ద్వారా హైదరాబాద్ నుంచే ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్న విధానాన్ని వివరించారు. ఆ తర్వాత డ్రోన్ కెమెరాలతో ప్రాజెక్టు పనుల వీడియో రికార్డింగ్‌ను వారికి చూపించారు. రెండు సంవత్సరాలలో ప్రాజెక్ట్ మొదటి లింక్ పనుల్లో 95% ప్రగతిని సాధించామని చెప్పారు. జూన్ 2019 నాటికి గోదావరి నుంచి నీటిని పంపింగ్ చేయడానికి పూర్తి స్థాయిలో సిద్ధం అవుతున్నామన్నారు. . ఏప్రిల్ 30 నాటికే పనులు పూర్తి చేసి మే నెలలో అన్ని పరీక్షలు పూర్తి చేసిన తర్వాత జూన్‌లో నీటిని ఎత్తిపోయడానికి కార్యాచరణతో ముందుకు పోతున్నామని వివరించారు. అనంతరం మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్యామ్ సుందర్ మిషన్ కాకతీయపై ప్రెజెంటేషన్ ఇచ్చారు. మిషన్ కాకతీయ లక్ష్యాలను వివరించారు. నాలుగు దశల్లో సాధించి విజయాలను వివరించారు. నాలుగు దశల్లో 8741.80 కోట్ల అంచనా వ్యయంతో , 21.39 లక్షల ఎకరాలను స్థిరీకరించే లక్ష్యంతో 27,653 చెరువుల పునరుద్దరణ పనులు చేపట్టామని, అందులో 20,192 చెరువుల పునరుద్దరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ చెరువుల కింద సుమారు 13.80 లక్షల ఎకరాలను స్థిరీకరించినట్టు చెప్పారు. మిషన్ భగీరథ కన్సల్టెంట్, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ జగన్ మోహన్ మిషన్ భగీరథ గురించి వివరించారు. మూడేండ్లలో సుమారు 25 వేల గ్రామాలకు ఇంటింటికి నల్ల ద్వారా నీరందించే ఈ బ హత్తర కార్యక్రమం పూర్తి కావచ్చిందని గణాంకాలతో, చిత్రాలతో వివరించారు. ఈ మార్చి నెలాఖరుకు మిషన్ భగీరథ పూర్తి స్థాయిలో నీరందిస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాలతో ప్రజలకు మేలు జరుగుతుందని, రాజస్థాన్ లో కూడా ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడానికి తాము కషి చేస్తామని, వీటి అధ్యాయ నానికి అధికారులను పంపుతామని ఆ రాష్ట్ర అధికారి రాజేశ్ శర్మ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల పట్ల కేంద్ర సర్వీసుతల అధికారులు సంత ప్తిని వ్యక్తం చేశారు.

జాతిపితకు ప్రముఖుల నివాళి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పలువురు ప్రముఖులు గాంధీజీ సమాధివద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్ బాపుఘాట్ వద్ద శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, హెూం శాఖ మంత్రి మహమూద్ అలీ, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని నివాళులు అర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ప్రభుత్వ మ్యూజిక్, డ్యాన్స్ కాలేజీ బందం బాపూజీకి ప్రియమైన భజన గీతాలను ఆలపించారు. హిందు, ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ద మతాలకు సంబంధించిన పవిత్ర గ్రంధాల నుండి మత పెద్దలు పఠించిన ప్రవచనాలను ప్రముఖులు ఆలకించారు.

హైకోర్టు సీజేతో బీసీ కమిషన్ చైర్మెన్ సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మెన్ బీఎస్ రాములు బుధవారం హైకోర్టు చీఫ్ జస్టిస్ రాధాకృష్ణ న్‌తో సమావేశమయ్యారు. హైకోర్టులోని చీఫ్ జస్టిస్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో ఇంగ్లీషు, తెలుగు భాషలలో ప్రచురించిన పలు బీసీ కమిషన్ల నివేదికలను, గ్రంథాలను ఆయనకు చైర్మెన్ అందజేశారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ రాష్ట్ర బీసీ కమిషన్ రిజర్వేషన్ల పెంపుదలకు సిఫారసు చేస్తు ప్రభుత్వానికి గతంలో సమర్పించిన తొలి నివేదికలోని పలు అంశాలను సీజే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే రాష్ట్రంలో అమలులో ఉన్న రిజర్వేషన్ల తీరుతెన్నులను, దేశంలో బీసీ రిజర్వేషన్లకు ప్రామాణికంగా నిల్చిన పలు కమిషన్ల సిఫార్సులపై చర్చించినట్టు చైర్మెన్ రాములు తెలిపారు. కమిషన్ ప్రచురించిన 'బీసీ నోట్ బుక్' ఇంగ్లీష్ తొలిపతితో పాటుగా, ఎన్.కె.మురళీధర్ రావు, జస్టిస్ ఒ.చిన్నప్పరెడ్డి నివేదికల తెలుగు తొలి ప్రతులను, పలు గ్రంథాలను అందజేశారు.

జనశక్తి నేత అమర్‌కు మాతృవియోగం

- పలువురి సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనశక్తి నేత అమర్ మాతృమూర్తి కూర మల్లమ్మ బుధవారం వేములవాడలో కన్నుమూశారు. ఆమె వయస్సు 95 సంవత్సరాలు. అమర్ ఆమె చిన్న కుమారుడు కాగా.. రాజన్న పెద్ద కుమారుడు. వీరిద్దరూ సీపీఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉన్నారు. వీరుగాక ఆమెకు ఇద్దరు అమ్మాయిలు కూడా ఉన్నారు. అరుణోదయ సమాఖ్య విమలక్క మల్లమ్మకు స్వయానా కోడలు. మల్లమ్మ మరణంపట్ల ప్రొఫెసర్ రమా మేల్కొటే, మాన్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ వర్గీస్ తెక్‌నాథ్ తదితరులు సంతాపం తెలిపారు. ఆమె అంత్యక్రియలను గురువారం వేములవాడలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

సంపాదకీయం

మాట వినకపోతే...

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా అన్నట్టు ఉంది హెచ్‌ఎండీఏ కమిషనర్ బదిలీ వ్యవహారం. మాట వినకపోతే శంకరగిరి మాన్యాలే అన్న తరహాలో వేటు వేసింది సర్కారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం క్యాబినెట్ ఏర్పాటు చేయకుండానే పాలన సాగిస్తున్నారనే విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. తాజా పరిణామం తాము ఆడింది ఆటా పాడింది పాటగా సాగుతున్నదనడానికి ప్రత్యక్ష సాక్ష్యం. పార్టీ వ్యవహారమైనా, పరిపాలన సంగతైనా తమ కనుసన్నల్లో జరగాలని గులాబీ సర్కారు భావిస్తున్నది. తమకు సహకరించడం లేదనే నెపంతో బడా పారిశ్రామికవేత్త, ప్రభుత్వ పెద్దలకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న వ్యక్తి అఖిల భారత సర్వీస్ అధికారులతో ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారన్న అభిప్రాయాలూ ఉన్నాయి. మాట వినలేదనీ, తమకు అడ్డొచ్చాడనీ ప్రభుత్వ పెద్దల సహకారంతో హెచ్‌ఎండీఏ కమిషనర్ జనార్థన్‌రెడ్డిపై బదిలీ వేటు వేయించడం రాజ్యాంగపరంగా ఒక అధికారి నిర్వహిస్తున్న బాధ్యతలను భంగపరచడమే. సాధారణంగా టెండర్లు పిలిచినా, వేలం వేసినా తుది నిర్ణయం ప్రభుత్వ నిబంధనలకు లోబడే ఉంటుంది. ఏదైనా తేడా వస్తే సంబంధిత టెండర్లను గానీ, వేలాన్నయినా రద్దుచేసే అధికారం సర్కారుకు ఉంటుంది. ఆ మేరకు ఆయా శాఖలకు బాధ్యులుగా ఉండే ఉన్నతాధికారు (హెచ్‌వోడీ)లకు అధికారాలుంటాయి. ప్రభుత్వానికి నష్టం జరుగుతున్నదని, సమస్యలు ఉత్పన్నమవుతాయని భావిస్తే ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆయా పనులను లేదా టెండర్లను అనుమతించరాదు. హెచ్‌ఎండీఏ వ్యవహారంలో అదే జరిగింది.

తమ అవసరాలను నెరవేర్చని అధికారులు, ఉన్నతాధికారులెవరినైనా అప్రధాన స్థానాలకు పంపడం ద్వారా అఖిల భారత సర్వీస్ అధికారులను దారికి తెచ్చుకోవాలనే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం కనిపిస్తుండటం ఆందోళనకరం.

సివిల్ సర్వీస్ అధికారులు ప్రజల కోసం పనిచేయాలి. నిరంతరం ప్రభుత్వ, సంక్షేమ కార్యక్రమాలను సమాజానికి చేరువ చేసేలా ప్రయత్నించాలి. అదే సందర్భంలో ప్రభుత్వ ఆస్తులు, భూములు, ప్రజాధనం వృధా కాకుండా చూడాల్సిన బాధ్యతా వారిదే. అందుకే సివిల్ సర్వీస్ కమిషన్ వారికి విస్తృతాధికారాలు కట్టబెట్టింది. అయితే రాష్ట్రంలో గత ఐదేండ్లుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, అఖిల భారత సర్వీస్(ఐఏఎస్) అధికారులకు ఆందోళన కలిగిస్తున్నాయి. బాధ్యతలు లేదా విధుల నిర్వహణ సందర్భంగా నిబంధనలూ మార్గదర్శకాలూ పాటించాల్సిన, అమలుచేయాల్సిన ఉన్నతాధికారులను స్వార్థరాజకీయాలు, అవసరాల కోసం బదిలీ పేర బలి చేస్తుండటం ఈ సర్కారు హయాంలో తరచూ చూస్తూనే ఉన్నాం. నగర శివారు ప్రాంతాలైన కోకాపేటలోని 166 ఎకరాల భూమిని 2006-08 కాలపరిధిలో గోల్డ్‌మైన్ పేర హెచ్‌ఎండీఏ వేలం వేసింది. ఈ భూమికి అప్పట్లో ఎకరాకు రూ.5.50 కోట్ల నుంచి 13కోట్ల మేర ధర పలికింది. ఇప్పుడా భూములు ఎకరాకు రూ.30 కోట్లపైనే ఉందని అధికారుల అంచనా. ఐతే ఆ భూములు తమ వారసత్వమని ఒక వ్యక్తి ప్రభుత్వాన్ని ఆశ్రయించడంతో అసలు వివాదం మొదలైంది. వేలంలో కొనుగోలు చేసిన వారికి ఇంతవరకూ భూములను రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో తాము చెల్లించిన



డబ్బులను తమకు వాపసివ్వాలని కొందరు కోరుతున్నారు. మరికొంతమంది 2006-08లో ఉన్న మార్కెట్ రేటుకే రిజిస్ట్రేషన్ చేయాలని పట్టుబడుతున్నారు. ఇందుకు కమిషనర్ జనార్థన్‌రెడ్డి అంగీకరించలేదు. చెల్లించిన డబ్బుల మేరకే ఆనాటి రేటుకు భూమి రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పడంతో సమస్య ముదిరింది. దీంతో సదరు ఐఏఎస్‌ను ఆ పెద్దమనిషి జోక్యంతోనే బదిలీ చేశారు. ఆపైన మరెక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా ఆయన అడ్డుకున్నట్టు ఆరోపణలూ ఉన్నాయి. ఇది ఇటీవల కేంద్రంలో చోటు చేసుకున్న పరిణామాలను గుర్తుకు తెస్తున్నది. అదే బాటలో రాష్ట్రం నడుస్తున్నది.

తాజాగా సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మను ప్రధాని మోడీ నేతృత్వంలోని బీజేపీ సర్కారు ఎంత అవమానకరంగా ఇంటికి పంపిందో అందరికీ తెలిసిందే. ఈ తరహా బదిలీలు ఇటీవల పరిపాటయ్యాయి. అనుకూలురకు మంచి పోస్టింగులివ్వడం, మాట వినని వారిని లూప్‌లైన్‌లో పెట్టడం గులాబీ ప్రభుత్వానికి కూడా రివాజైంది. బదిలీలతోపాటు అఖిల భారత సర్వీసు అధికారులపై అనవసర వ్యాఖ్యలు చేయడం, అసభ్యంగా ప్రవర్తిస్తుండటం తదితర సంఘటనలూ చోటుచేసుకున్నాయి. గతంలో మహబూబాబాద్ కలెక్టర్‌గా పనిచేసిన ప్రీతీమీనా పట్ల ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ప్రవర్తన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయినా ఆయనపై ఎలాంటి చర్యా లేదు. రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న బీఆర్ మీనా ఆయా విషయాల్లో మాట వినలేదనే కారణంతో ఆయన్నూ పక్కన పెట్టేశారు. భూపాలపల్లిలో కలెక్టర్‌గా పనిచేసిన ఆకునూరు మురళిపైనా కొరడా ఝుళిపించి పురావస్తుశాఖకు బదిలీ చేసారు. ముందస్తు ఎన్నికల్లో సూర్యాపేటలో ప్రతిపక్షాలకు సహకరించారనే ఆరోపణలతో అక్కడి కలెక్టర్ సురేంద్రమోహన్‌ను ఇటీవల తప్పించారు. ఈ విషయమై అఖిల భారత సర్వీస్ అధికారుల అసోసియేషన్ కినుక వహించింది. ఎప్పటికప్పుడు తన అభ్యంతరాలను సర్కారు దృష్టికి తెస్తున్నా, సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. తమ అవసరాలను నెరవేర్చని అధికారులు, ఉన్నతాధికారులెవరినైనా అప్రధాన స్థానాలకు పంపడం ద్వారా అఖిల భారత సర్వీస్ అధికారులను దారికి తెచ్చుకోవాలనే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం కనిపిస్తుండటం ఆందోళనకరం.

కుహనా శాస్త్ర విజ్ఞానం... వలసవాద వారసత్వం



కొండూరి వీరయ్య

కేంద్రంలో బీజేపీ అధికారానికి వచ్చిన నాటి నుంచీ శాస్త్ర విజ్ఞాన రంగంలో భారతీయుల కృషిపేరుతో కుహనా శాస్త్ర విజ్ఞానం విచ్చలవిడిగా ప్రచారమవుతోంది. పదేండ్ల క్రితం పత్రికల్లో భారతీయ శాస్త్రవేత్తల కృషి గురించి వచ్చిన వార్తలకు, నేడు వస్తున్న వార్తలకు మధ్య తేడా గమనిస్తే దేశంలో శాస్త్ర విజ్ఞానం, శాస్త్రీయ ఆలోచనా కోణం ఎంతగా వెనకపట్టు పట్టిందో అర్థమవుతుంది. పదేండ్ల క్రితం యూరప్‌లో లార్జ్ హాడ్రన్ కొల్లైడర్ (విశ్వసృష్టి రహస్యాలు ఛేదించేందుకు జరుగుతున్న ప్రయోగం)లో భారతీయ శాస్త్రవేత్తల పాత్ర గురించి భారతీయ పత్రికలు విశ్లేషణలు ప్రచురించాయి. శాస్త్ర విజ్ఞానానికి సంబంధించి అమెరికా ఆంక్షలు అధిగమించి మరీ భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) క్రయోజనిక్ ఇంజన్ తయారు చేయడంలో భారతీయ శాస్త్రవేత్తల మేధో సామర్థ్యం చూసి ప్రపంచం అబ్బురపడింది. ఇప్పుడు దీనికి భిన్నంగా 'కుండ'పోతలే టెస్ట్‌ట్యూబ్ శిశువులంటున్న కుహనా శాస్త్రవేత్తలను చూస్తున్నాం. ప్రపంచం చూడని యుద్ధ విమానాలు రావణుడి వద్ద ఉన్నాయని కుహనా మేధావులు నిస్సిగ్గుగా ప్రకటించటం ఆధునిక భారతీయ శాస్త్రవేత్తలు తలదించుకునేలా చేస్తోంది.

భారతదేశాన్ని ప్రపంచం గుర్తించదగిన శక్తిగా మార్చాలంటే ఆధునిక శాస్త్రవిజ్ఞానం ప్రజలందరికీ అందుబాటులోకి తేవటం, శాస్త్రీయ ఆలోచన సార్వత్రికం చేయటం తక్షణ అవసరం. కేంద్రంలో బీజేపీ పరిపాలన ఈ రెండు లక్ష్యాల సాధనకు అవరోధం. నిజమైన దేశభక్తుల ముందున్న కర్తవ్యం సుస్పష్టమే.

దీనికి ఆజ్యం పోసింది స్వయంగా ప్రధాని మోడీయే అనటంలో సందేహం లేదు. 2015లో జరిగిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో వినాయకుని జననం నాటి భారతంలోనే ప్లాస్టిక్ సర్జరీ అమల్లో ఉందని తెలియజేస్తోందని ఉపన్యసించారు. రాజును మించిన రాజభక్తులున్న దేశం మనది. కనుక ఆయన వెనకే వందలాదిమంది కుహనా శాస్త్రవేత్తలు బయల్దేరారు. వీరి ఉపన్యాసాలు వింటుంటే 1986లో మా పొరుగు గ్రామంలో జరిగిన సంఘటన గుర్తుకొస్తోంది. అప్పట్లో మేమంతా బళ్లో ఉన్నాం. ఊళ్లో గుప్పుమన్న వార్త ఇంటర్వెల్ సమయానికి బళ్లోకి వచ్చింది. పొరుగూర్లో ఓ గుడి ఉంది. గుడి ముందు రాగి చెట్టు వేప చెట్టు పెనవేసుకుని పెరిగాయి. పల్లెటూరి అనుభవం ఉన్న ప్రతివారికీ ఇది ఏమంత పెద్ద ఆశ్చర్యకరమైన సంఘటన కాదు. అయితే ఈ చెట్ల ద్వయం పాలు కారుస్తోంది అన్నది ఆ పుకారు. అంతే.... మండలంలో సగం ఊళ్ల నుంచి జనం అక్కడ ప్రత్యక్షమయ్యారు. భారతీయ శాస్త్ర విజ్ఞాన మహాసభలో పోగైన వారిని, వారి వ్యాఖ్యలను చూస్తే మూడు దశాబ్దాల క్రితం మా పొరుగూర్లో గుంపులు గుంపులుగా వెళ్లిన పామర జనానికీ వీరికీ తేడా లేదని అర్థమవుతోంది.

ఈ కుహనా శాస్త్రవిజ్ఞానం నిర్దిష్ట రాజకీయ లక్ష్యంతో సాగుతున్న ప్రచారం. అభివృద్ధి కోసం ఆరాటపడే అన్ని దేశాల్లో చోటు చేసుకున్న పరిణామమే. భారతదేశంలో సైతం మేధో ప్రతిభ ఆ దశ దాటి ముందుకు వచ్చింది. కానీ పాలకవర్గం ప్రజలను మాత్రం ఆ దశలోనే ఉంచాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది. ఈ ప్రయత్నానికి ఆధునిక మూలాలు వలసవాదంతో పాటు భారతదేశంలో ప్రవేశించాయి క్రైస్తవ మిషినరీలు. వీటితో పాటే సాధారణ జనానికీ పరిచయమైంది తర్కం. దీంతో ఓ వైపు మిషినరీల ప్రభావాన్ని తట్టుకుని హిందూమతాన్ని కాపాడుకునే ప్రయత్నంలో అనేకమంది సంఘ సంస్కర్తలు ముందుకొచ్చారు. వివేకానంద, రామకృష్ణ పరమహంస, రాజారామ్మోహన రాయ్, దయానంద సరస్వతి, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వంటి వారు ఈ కోవకు చెందిన వారే. వీరి రచనల సారాంశం సనాతన చాంధస హిందూమతంలో సాధారణ తర్క విరుద్ధమైన విషయాలను తిరస్కరించటం ద్వారా ప్రజలకు తిరిగి హిందూమతంపై విశ్వాసం పెంపొందించడమే.. ఈ ప్రయత్నాలే తర్వాతి కాలంలో పెద్ద పెద్ద పీఠాలుగా, హిందూ ప్రచార వేదికలుగా చలామణి అవుతున్నాయి.

ఈ సమయంలోనే మరో ముఖ్యమైన ప్రయత్నం జరిగింది. వలసవాద పాలకులు భారతీయులను సమర్థవంతంగా పరిపాలించాలంటే భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను అర్థం చేసుకోవాల్సిన అవసరమొచ్చింది. కానీ ఇవన్నీ సంస్కృతంలో ఉన్నాయి. మనకు తెలీనిదంతా దైవమే అనుకోవటం తేలికైన పరిష్కారం. ఈ క్రమంలో పాశ్చాత్యులు ప్రాచ్య నాగరికతలను అర్థం చేసుకోవటానికి ఆయా దేశాల్లో పెద్ద పెద్ద సొసైటీలు ఏర్పాటు చేసి నిధులు కేటాయించారు. ఈ విధంగా 18వ శతాబ్దం చివరల్లో ఏర్పాటైన ఏషియాటిక్ సొసైటీ నడిపిన పత్రికలు, అందులోని వ్యాసాలు గమనిస్తే ఒక దేశాన్ని జయించటానికి వచ్చినప్పుడు సామ్రాజ్యవాదులు ఆ దేశపు సమాజాన్ని అర్థం చేసుకోవటానికి ఎంతగా ప్రయత్నిస్తారో మనం తెలుసుకోవచ్చు. ప్రాచీన మధ్యయుగాల్లో లౌకిక విజ్ఞానం, అలౌకిక విజ్ఞానం రెండూ మతం ముసుగులోనే చలామణీ అయ్యేవి.

భారతదేశంలో వరాహమిహరుడు, ఆర్యభట్టు ఉన్నట్టే పాశ్చాత్య సంస్కృతిలో టోలమీ ఉన్నాడు. ఖగోళ శాస్త్రం పేరుతో టోలమీ అప్పటి వరకు అంతరిక్షం గురించి పాశ్చాత్య సమాజంలో ఉన్న అభిప్రాయాలను, అంచనాలను క్రోడీకరించి గ్రంథస్తం చేశాడు. అంతకు పూర్వం క్రీస్తు పూర్వం 700 సంవత్సరం నాటికి పాశ్చాత్య సమాజంలోనూ ఖగోళాన్ని పన్నెండు రాశులుగా విభజించి ఒక్కో రాశికి ఒక్కో గుర్తు కేటాయించారు. ఆ గుర్తులన్నీ కుడిఎడంగా నేటికీ చలామణీ అవుతూనే ఉన్నాయి. ఆశ్చర్యమేమిటంటే రాశులకు కేటాయించిన గుర్తులన్నీ ప్రకృతిలో అత్యంత మౌలిక దశలో కనిపించే జంతువులు, వస్తువులే. ఈ విషయాన్ని మర్చిపోయి నాటికే ఆధునిక కాలెండర్ గురించి తెలుసునని మురిసిపోతే పాశ్చాత్య సమాజాలు శాస్త్రవిజ్ఞాన మార్గంలో ప్రగతి సాధించేవి కావు. అయితే పాశ్చాత్య సమాజాల పరిణామంలో కీలక పాత్ర పోషించింది తర్కం. ప్రశ్న. హేతువు. క్రీస్తు పూర్వం లౌకిక అలౌకిక విజ్ఞానాలు విడదీయరానంత పెనవేసుకున్నాయి. వాటిని విడదీసేందుకు పాటించిన ప్రమాణమే తర్కం. వాద, ప్రతివాదాలు. గ్రీకు నాగరికతలో వాదప్రతివాదాలకు సోక్రటీస్‌కు మధ్య ఉన్న సంబంధాన్ని వేరు చేయలేం. ఆ విధంగా ప్రశ్నను ప్రోత్సహించిన పాశ్చాత్య సమాజాలు విజ్ఞాన శిఖరాలుగా పురోగమించాయి.

భారతదేశంలో సైతం ఈ విధంగా లౌకిక, అలౌకిక జ్ఞానాన్ని వేరు చేసేందుకు లార్డ్ కారన్ వాలీస్ వైస్రాయిగా ఉన్నప్పుడే ఓ ప్రయత్నం మొదలైంది. అప్పట్లో సంస్కృత భాష కేవలం బ్రాహ్మణుల గుత్తసొత్తు. సోకాల్డ్ హిందూమత గ్రంథాలన్నీ సంస్కృత భాషలోనే ఉండేవి. దీంతో ఏది లౌకిక జ్ఞానం ఏది అలౌకిక జ్ఞానం అన్నది నిర్ధారించుకునేందుకు వలస పాలకులకు ఈ మేధావులే శరణ్యమయ్యారు. ఈ విధంగా భారతీయ సమాజాన్ని వలసపాలకులు అదుపాజ్ఞల్లో పెట్టుకోవటానికి తొలిసాయమందించింది మేధో పాలకవర్గమే. ముందే చెప్పుకున్నట్టు క్రైస్తవ మిషినరీల ప్రవేశంతో పలువురు



సంఘ సంస్కర్తలు హిందూమతాన్ని సంస్కరించే పనిలో పడ్డారు. ఈ సంఘ సంస్కర్తలే భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో భారతీయ పునరుజ్జీవనోద్యమ పితామహులుగా గుర్తింపు పొందారు.

మరోవైపున వలసవాదులతో పాటు పరిపాలనలో భాగస్వాములైన బ్రాహ్మణవర్గం లౌకిక అలౌకిక జ్ఞానాలను వేరుచేసే పనిలో వలస పాలకులకు సహాయం చేయసాగింది. మధ్యయుగాల చివరిదశ వరకు భారతీయ వాఙ్మయం శృతిపరంపరపై ఆధారపడి ఉంది. అంటే ప్రాచీన ఇటలీ, గ్రీసుల్లో లాగా లిపి ఆధారిత సాహిత్యం కాదు. ఒక తరం మరో తరానికి, ఆ తరం తర్వాతి తరానికి చెప్పుకుంటూ (వాక్కు ద్వారా) రావటమే ప్రాచీన భారత వాఙ్మయం (దీన్నే వేదవాఙ్మయం అని కూడా పిలుస్తున్నారు) కొనసాగింపునకు మౌలిక ఆధారంగా ఉండేది. ఈ పరిస్థితుల్లో వీటన్నింటిలో ఏముందో తెలుసుకునే ప్రయత్నంలో మాక్స్ ముల్లర్ వంటి పాశ్చాత్య మేధావులు చివరకు సంస్కృతం నేర్చుకుని తాళపత్ర గ్రంథాలు చదవటానికి సైతం సిద్ధమయ్యారు. ఈ విధంగా వలసపాలకుల అవసరాల కోసం లౌకిక అలౌకిక జ్ఞానాన్ని వేరు చేసే క్రమంలోనే ప్రాచీన భారత చరిత్రలో ఆధారాలు ఉన్నవీ లేనివీ భారతీయతగా చలామణీ చేసే అవకాశం వచ్చింది. అన్నీ వేదాల్లోనే ఉన్నాయని నిరూపించే ప్రయత్నం ఈ క్రమంలో ముందుకొచ్చిందే. ఈ విధంగా చరిత్ర రచన గుర్రానికి ముందు బండి కట్టి నడిపించే దిశలో సాగింది. రానురాను బ్రిటిష్ పాలకవర్గం సంపూర్ణ బూర్జువావర్గంగా ఎదిగింది. ఈస్టిండియా కంపెనీ స్థానంలో ఏకంగా బ్రిటన్ వలసాధిపతిగా ముందుకొచ్చింది. పాలితులను అజ్ఞానంలో ఉంచటమే పాలకుల వర్గ ప్రయోజనాలు కాపాడుకునే ఏకైక మంత్రం. భారతీయులను సనాతన అజ్ఞానంలో మగ్గేలా చూడటమే ఆధునిక బ్రిటన్ పాలకవర్గానికి ప్రయోజనకారిగా కనిపించింది. దీంతో అలౌకిక జ్ఞానం కాస్తా లౌకిక జ్ఞానం ముద్ర వేసుకుని వీధుల్లోకి వచ్చింది. కుహనా శాస్త్ర విజ్ఞానమే అసలైన శాస్త్ర విజ్ఞానంగా చలామణీ అవటం ప్రారంభమైంది.

నాడు వలసవాద పాలకవర్గం తన ప్రయోజనాలు కాపాడుకోవటానికి కుహనా శాస్త్రవిజ్ఞానమే నిజమైన భారతీయ శాస్త్ర విజ్ఞానమని భ్రమలు కల్పించింది. నేటి పాలకవర్గ పార్టీకి మాతృక అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నాడు కారన్‌వాలీస్ హయాంలో పాలకవర్గంలో అంతర్భాగమైన బ్రాహ్మణవర్గానికి నిజమైన ప్రతినిధి. తన లక్ష్యాలు నెరవేరాలంటే ఈ దేశంలో ప్రశ్న, హేతువు, తర్కం మిగిలి ఉండకూడదు. ఈ మూడు ఆరెస్సెస్ ప్రేరేపిత భారతీయతకు, హిందూత్వ పరిరక్షణకు ప్రథమ శత్రువులు. అందుకే భారతీయ సమాజంలో ఈ మూడు - తర్కం, ప్రశ్న, హేతువు-లకు తావు లేకుండా చేసే పనిలో నిమగ్నమై ఉన్నాయి. అందులో భాగమే నాటి వలసవాదం తరహాలో కుహనా శాస్త్ర విజ్ఞానమే అసలైన శాస్త్ర విజ్ఞానంగా ప్రచారం చేయటం. పాశ్చాత్య శాస్త్ర విజ్ఞానంలో ఉన్న న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని వరాహమిహిరుడికి ఆపాదించటం, అణువిస్ఫోటనాన్ని భగవద్గీతలో కూర్చటం, కోపర్నికస్ కన్నా ముందే సూర్యుడిని నవగ్రహాధిపతిని చేసి ప్రధాన దేవాలయాల ముందు దిష్టిబొమ్మలుగా నిలబెట్టడం, వేదవ్యాసుడి మెదడులో టెస్ట్‌ట్యూబ్ బేబీల గురించిన ఆలోచనను కుక్కటం, నిన్న మొన్నటి వరకు హిందువులను సమీకరించటానికి విలన్ అవతారంలో చూపబడిన రావణుడు ఏకంగా వైమానిక పరిజ్ఞానం కలిగిన మేధావిగా మారటం యావత్తూ వలసవాద వారసత్వంతో మొదలైన కుహనా శాస్త్ర విజ్ఞానానికి ఆధునిక పునాది కల్పించటమే. ఇదే సమయంలో భారతీయ పాలకవర్గం తన వర్గ ప్రయోజనాలు కాపాడుకోవటానికి రాఫెల్ యుద్ధ విమానాలు కావాలంటూనే ప్రజలను మాత్రం ఊహాజనితమైన రావణ విమానాల గొప్పలు చెప్పుకుని మురిసిపొమ్మంటోంది. వలసవాదానికి అత్యంత నమ్మదగిన మిత్రులు సావర్కార్, గోల్వాల్కర్. వీరిద్దరి శిష్యపరంపరలో ఎదిగి వచ్చిన ఆరెస్సెస్ పర్యవేక్షణలో పరిపాలన సాగించే బీజేపీ నుంచి ఇంతకన్నా గొప్పగా ఏమీ ఆశించలేం. భారతదేశాన్ని ప్రపంచం గుర్తించదగిన శక్తిగా మార్చాలంటే ఆధునిక శాస్త్రవిజ్ఞానం ప్రజలందరికీ అందుబాటులోకి తేవటం, శాస్త్రీయ ఆలోచన సార్వత్రికం చేయటం తక్షణ అవసరం. కేంద్రంలో బీజేపీ పరిపాలన ఈ రెండు లక్ష్యాల సాధనకు అవరోధం. నిజమైన దేశభక్తుల ముందున్న కర్తవ్యం సుస్పష్టమే.

సెల్: 9871794037

మెయిల్ @ నవతెలంగాణ



మెకిరి దామోదర్

వన రక్షణే.. మన రక్షణ..!

అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగి ఏడాదిలో సుమారు 47,478 ఎకరాల (19.124 హెక్టార్లు) అటవీ దహనం జరుగుతోంది. తెలంగాణలోని మొత్తం అటవీ విస్తీర్ణంలో ఇది 0-7శాతం. ఇవి ఎస్.ఎన్.పీ.పీ. మోడీస్ ఉపగ్రహాలకు చిక్కిన గణాంకాలు మాత్రమే. దీని పరిధిలోనికి రాని ప్రమాదాలను లెక్కలో తీసుకుంటే రెట్టింపుగావచ్చు. గత కొన్నేండ్లుగా అడవిలో అగ్నిప్రమాదాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ పరిణామాలు ఇటు అటవీశాఖ అధికారులను, అటు పర్యావరణ ప్రేమికులను కలవర పరుస్తున్నాయి. కారణాలు పరిశీలిస్తే వాహనాల్లో అడవి ప్రాంతాల్లోని రహదారులపై వెళ్లేవారు, గొర్రెల కాపరులు, బీడి, సిగరేట్ తాగి పడేయడం, వంటలు చేసుకొని మంటలను సరిగా ఆర్పకుండా వెళ్ళిపోవడం, ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన అడవిలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ మానవ తప్పిదాలకు తోడు స్మగ్లర్ల స్వార్థ ధనార్జనల వలన మరింత తీవ్ర నష్టం జరుగుతోంది. ఈ ప్రమాదాలు ఆకులు రాలే కాలంలో ఎక్కువగా జరుగుతున్నాయి. అడవిలో ఏ కొంచెం నిర్లక్ష్యంగా వ్యవహరించి నిప్పు పడేసినా ఎకరాలకు, ఎకరాల అడవికాలిపోతుంది. ఈ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అడవిలోని 1106 కంపార్టుమెంట్లలోనే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నట్టు అటవి శాఖ గుర్తించింది. భూభాగంలో 33శాతం పచ్చదనం ఉన్నప్పుడే అక్కడ పర్యావరణం సమతుల్యంగా ఉంటుందని పర్యావరణ శాస్త్రవేత్తలంటున్నారు. కానీ మన తెలంగాణ రాష్ట్ర భూభాగంలో 24శాతమే అటవీ భూమి ఉందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి కానీ, వాస్తవానికి పచ్చదనం 12శాతం కూడాలేదనే ఈ పరిణామాలు విషాదకరం. ఇలాగే అడవులు అన్యాక్రాంతమైతే... స్మగ్లర్ల, కబ్జా దారుల, స్వార్థ మానవ తప్పిదాలకు అధికారుల నిర్లక్ష్యం తోడైతే భవిష్యత్తు తరాలు పర్యావరణ సమస్యలతో విపరీత కాలుష్య ముప్పులో పడకతప్పదు.

అడవులను నరికే కలప స్మగ్లర్లను కట్టడి చేస్తూ అడవులకు వెళ్ళేదారుల్లో పెద్ద సంఖ్యలో చెక్ పోస్టులు పెట్టాలి. సాయుధ పోలీసు పహారా పెంచాలి. ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయాలి. జిల్లా కలెక్టర్, ఎస్.పీ., డీ.ఎఫ్.ఓలు సంయుక్తంగా అటవీ సంరక్షణ కార్యాచరణకు పూనుకోవాలి. కొత్త చట్టాలకు తోడు ఉన్న చట్టాల కొరడా ఝుళిపించి కఠినంగా వ్యవహరించాలి. రాజకీయ జోక్యాన్ని అరికట్టాలి. అడవుల పరిరక్షణ, చెట్ల పెంపకం, సామాజిక అడవుల పెంపకం చేపట్టాలి. మరోవైపు అడవిలో అగ్ని ప్రమాదాల వలన జరిగే నష్టాన్ని అరికట్టాలి. గత ఐదేండ్లలో 90 వేల అగ్ని ప్రమాదాలు జరిగినట్లు తెలుస్తున్నది. తరుచూ ప్రమాదాలు జరిగే కంపార్ట్‌మెంట్లు 1,106, అడవికి దగ్గరున్న నివాస ప్రాంతాలు 1,279, అడవి రహదారులు 2,530. ఈ ప్రాంతాల్లో అటవీశాఖ ప్రత్యేక దృష్టి పెట్టి ప్రమాదాల నివారణ చేయవలసి ఉంది. తెలంగాణ రాష్ట్ర అటవీ విస్తీర్ణం 26 లక్షల హెక్టార్లు. అటవి బీట్లు 3115, కంపార్ట్‌మెంట్లు 9,790 (9 చ.కి.మీ.కి ఒక్కటి చొప్పున). మొత్తం ఉద్యోగాలు సుమారు రెండు వేల పైచిలుకు. అడవి దగ్గరి నివాస ప్రాంతాలు 16176, అటవీ రహదారులు 10633గా ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ ప్రాంతాల్లోనే గత ఐదేండ్లలో అగ్ని ప్రమాదాలు మొత్తం 90,423 జరిగినట్టుగా గుర్తించారు. అగ్ని ప్రమాదాల రేటు పెరుగుతున్నట్టుగా తెలుస్తున్నది. దీని నివారణకు ప్రజలను చైతన్య పరచాలి. 90శాతానికిపైగా మానవ తప్పిదాల వల్ల జరిగే ఈ ప్రమాదాలను అరికట్టాలి. రాబోవు ముప్పును దృష్టిలో ఉంచుకొని ప్రజలు, ప్రభుత్వము అటవీ రక్షణ బాధ్యతగా భావించాలి. అడవిని కాపాడాలి, అడవిని పునరుద్ధరించాలి అనే నినాదంతో ముందుకు వెళ్లాల్సి ఉంది. భూమంతా పచ్చటి చెట్లతో కలకలలాడాలి. అడవిలో అగ్ని కారుచిచ్చులా మారి అటవీ దహనం జరగకుండా జాగ్రత్త పడాలి. గోదావరి, కృష్ణా నదీతీర అటవీ ప్రాంతాల్ని, రహదారుల్లో ఇప్పపువ్వు, బీడి ఆకు, తేనె సేకరించేవారు, పశువుల తిరిగే దారులున్న చోట ఫైర్ లైన్లు ఏర్పాటు చేయాలి. అటవీ సమీప గ్రామీణ ప్రజలకు చట్టాలు వివరిస్తూ, వన సందర్శకులకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలి. వన సంరక్షణే మన సంరక్షణగా భావితరాల మంచి భవిష్యత్తుకు, పర్యావరణ పరిరక్షణకు మనమే బాధ్యులమని గుర్తెరిగి వ్యవహరించాలి. అడవులను రక్షించక పోవడం వలన ఓజోన్ పొర దెబ్బతినడం, అనావృష్టి, వరదలు లాంటి అనేక విపరీత పరిణామాలకు దారితీ స్తుంది. విషవాయువులను పీల్చి, ప్రాణవాయువును పంచే వృక్షాలను పెంచుదాం అనే సోయి మనలో రావాలి. ముందు తరాలను రాబోయే పెనుముప్పునుండి తప్పించకపోతే అందుకు మనమే బాధ్యులమౌతాం.

సెల్: 9573666650


ఆపదమొక్కుల రిజర్వేషన్లు!



నాగటి నారాయణ

విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో పది శాతం సీట్లను అగ్రకులాల్లోని పేదలకు రిజర్వ్ చేయడం మోడీ ప్రభుత్వ ఆపదమొక్కులకు అద్దం పడుతోంది. నరేంద్రమోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ సైద్ధాంతిక నేపథ్యం (ఆరెస్సెస్) ఎస్సీ ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఆ పార్టీకి చెందిన పెద్దలు తరచుగా రిజర్వేషన్లను సమీక్షించాలని, రద్దు చేయాలని బహిరంగంగా ప్రకటనలు చేసిన విషయం తెలిసిందే. రిజర్వేషన్ల వలన ప్రతిభ (మెరిట్)కు నష్టం జరుగుతోందని వాపోయే వారిలో అత్యధికులు ఆ పార్టీకి చెందిన వారేననేది సహజం. కానీ వాటికి జతగా అదనంగా మరో పదిశాతం అగ్రకులాల్లోని ఆర్థికంగా వెనకబడిన వారికి రిజర్వ్ చేయడం, అది కూడా లోక్‌సభ ఎన్నికలకు ముందు హడావుడిగా చట్టం తీసుకురావడం అందుకేనని అర్థమవుతోంది. ఈ రిజర్వేషన్ల గురించి 2014 ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రకటించిన మ్యానిఫెస్టోలో లేదనే విషయం గమనార్హం. గతేడాది నవంబరులో ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలు, ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో పెరుగుతున్న వ్యతిరేకత, అంతకుముందు నుంచే దేశవ్యాప్తంగా దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల్లో అలుముకుంటున్న అలజడికి తోడు యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ఆందోళన చెందిన మోడీ ప్రభుత్వం ఈ ఆకస్మిక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

సామాజిక తరగతుల రిజర్వేషన్లను కదిలించలేమనే అసహనంతో పాటు యువత అసంతృప్తిని బుజ్జగించే ఎత్తుగడతోనే "ఎకనమికల్లీ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యుఎస్)" రిజర్వేషన్ పేరుతో రాజ్యాంగ సవరణకు పాల్పడింది. ఇది అమలయ్యేది కాదనీ, న్యాయస్థానాల్లో నిలువదనీ చాలామంది రాజ్యాంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు. అంతేకాదు కొన్ని రాష్ట్రాల్లో ఇది కొత్త సమస్యలు సష్టిస్తుంది. ఉదాహరణకు తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం అగ్రకులాల మొత్తం జనాభానే పదిశాతం ఉన్నందున అందరికీ రిజర్వేషన్ వర్తించే అవకాశం వస్తే, యాభైరెండు శాతం వున్న బీసీల సంగతి ఏమిటనే సమస్య ఉత్పన్నమవుతోంది. ఇది దేశవ్యాప్త సమస్యగా విస్తరించే అవకాశమూ వుంది. ఈ రిజర్వేషన్లు ఆర్థిక ప్రాతిపదికన వ్యక్తులకు ఉపయోగపడేవే కావడం వలన జాట్లు, పటీదార్లు, మరాఠాలు, కాపులు వంటి ఆయా తరగతుల డిమాండ్లను సంతృప్తి పరిచలేక పోవచ్చు. అయినా లేని ఉద్యోగాల కోసం రిజర్వేషన్లు ఎందుకనే సందేహాలూ బహిరంగమే. 2014 నుంచి 2018 వరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 75,231 పోస్టులు తగ్గిపోయినట్టు బడ్జెట్ పత్రాల ద్వారా తెలుస్తోంది. నోట్లరద్దు వంటి చారిత్రక తప్పిదాల వలన ఉద్యోగ అవకాశాలు భారీగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. గతేడాది కాలంలోనే కోటి పది లక్షల ఉద్యోగాలు గల్లంతై, నిరుద్యోగిత రేటు 7.4శాతంకి చేరినట్టు కార్మిక ఉపాధి శాఖ నివేదికలు తెలియజేస్తున్నాయి. అసలు ఉద్యోగాలు ఎన్ని ఉన్నాయో లేవో తెలియజేసే డేటా మోడీ ప్రభుత్వం యివ్వలేక పోతోందని మురళీ మనోహర్ జోషి నేతత్వంలోని పార్లమెంటరీ ఎస్టిమేట్స్ కమిటీ ఆక్షేపించింది. నిరుద్యోగం తారాస్థాయికి చేరుతున్నట్టు చెప్పిన 2016-17 ఇండియన్ లేబర్ బ్యూరో సర్వే రిపోర్టును కూడా యింతవరకు అధికారికంగా ప్రకటించలేదు. ఉద్యోగాలు లేకపోయినా



రిజర్వేషన్లు యిస్తే జనరల్ కేటగిరీలోని యువత సంతోషిస్తారని, ఎన్నికల సమయంలో తమకు మద్దతుగా నిలుస్తారని మోడీ ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ రిజర్వేషన్లు అమలవుతాయనే నమ్మకం కలిగించటం కోసమే కేంద్ర మానవ వనరుల మంత్రి ప్రకాష్ జవదేకర్ పెద్ద ఎత్తున హడావిడి చేస్తున్నారు. వచ్చే ఫిబ్రవరి ఒకటి నుంచి జారీ అయ్యే కేంద్ర ప్రభుత్వ శాఖల ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లలో చేర్చాలని సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ ఉత్తర్వులు యిచ్చింది. విశ్వ విద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో వచ్చే విద్యాసంవత్సరం 2019-20 నుంచే అమల్లోకి వస్తాయని, అందుకోసం అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేసుకోవాలని ఆదేశాలు యిచ్చేశారు. 10శాతం కోటా అమలు కోసం 25శాతం సీట్లు పెంచాల్సి ఉంటుందని, తద్వారా దేశంలోని మొత్తం 900యూనివర్సిటీలు, 40వేల కాలేజీల్లో 9.28లక్షల సీట్లు అందుబాటులోకి వస్తాయని అంటున్నారు. ఇందుకు రూ.4000 కోట్లు అదనంగా ఖర్చవుతుందని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. ప్రయివేట్ రంగంలోని యానివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలు కూడా విధిగా అమలు చేయాలని ఆదేశించారు. కానీ, 10శాతం కోటా సీట్లలో చేరే విద్యార్థుల ఫీజులు ఎవరు చెల్లిస్తారనే విషయంలో ఎవరూ ఏమీ చెప్పటం లేదు. ప్రయివేట్ స్కూళ్లలోని సీట్లలో 25శాతం వరకు ఈడబ్ల్యుఎస్ కుటుంబాల పిల్లలకు ఉచితంగా చదువు చెప్పాలనే విద్యాహక్కు చట్టం నిబంధన అమలు కావటం లేదనే అనుభవాన్ని గుర్తించాలి. ఇంజనీరింగ్ కాలేజీల్లో యిప్పటికే యాభై శాతం సీట్లు ఖాళీగా వుంటుండగా మరో 25శాతం సీట్లు పెంచి ఏమి చేయాలని యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నవి. నిధుల లేమితో కనాకష్టంగా నెట్టుకొస్తున్న ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలు కూడా కోటా అమలుకు అవసరమైన అదనపు వసతులు, లైబ్రరీలు, లేబొరేటరీలు వగైరా సమకూర్చే పరిస్థితుల్లో లేవు. 35శాతం ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా వున్నట్టు ప్రకాష్ జవదేకరే చెబుతున్నారు. కానీ యాభైశాతం ఫ్యాకల్టీతోనే ప్రభుత్వ విద్యాసంస్థలు పనిచేస్తున్నట్టు అధ్యాపకుల సంఘాలు ఆరోపిస్తున్నవి. ఈ పరిస్థితుల్లో అదనంగా విద్యార్థులను చేర్చుకుంటే ఉన్నత విద్యాసంస్థల్లో విద్య మరింత నాసిరకంగా తయారవుతుందనీ, ప్రపంచంతో పోటీపడే శక్తిసామర్థ్యాలు ఉడిగిపోతాయనీ విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేదరికాన్ని, ఆర్థిక బలహీనతను ఆర్థిక విధానాలతోనే అధిగమించగలం తప్ప రిజర్వేషన్ల ద్వారా సాధ్యం కాదని ప్రపంచ ప్రసిద్ధ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ చెప్పారు. సామాజిక తరగతుల కోసం ఉద్దేశించిన రిజర్వేషన్లు సామాజిక న్యాయం కోసమేనని, అవి పరిమిత సంఖ్యలోనే ఉండాలని అంబేద్కర్ చెప్పినట్టు తెలుస్తోంది. రిజర్వేషన్లు యాభై శాతంకి మించకూడదనే సుప్రీంకోర్టు ఆంక్షను కేంద్ర ప్రభుత్వమే ఉల్లంఘించింది. ఇప్పుడు 60శాతం అయింది, అంతటితో ఆగుతుందనే గ్యారంటీ కూడా లేదు. రిజర్వేషన్లను అతిగా ఆరాధించడం కులతత్వాన్ని ప్రోత్సహించడమే అవుతుంది. వాటి వలన అణగారిన కులాల్లో కొద్దిమందికి ఉద్యోగాలు వచ్చి ఉండవచ్చునేమో గాని ఆయా కులాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందింది లేదు. ఏదేమైనా అగ్రకులాల్లోని ఆర్థిక బలహీన కుటుంబాలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించడం ముఖ్యమైన పరిణామమే. దీని వలన ఎంత మందికి ఉద్యోగాలు వస్తాయో తెలియదు కానీ సామాజిక తరగతుల రిజర్వేషన్ల పట్ల వ్యతిరేకత కొంత సద్దుమణిగే అవకాశం కలుగుతుంది. ఈ పరిణామం వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఏ మేరకు లాభిస్తుందో చెప్పలేం కానీ భవిష్యత్తులో ఉద్యోగాల కోసం పెరిగే ఉద్యమాలకు ఆయుధంగా పనిచేయగలదు.

సెల్: 9490300577



ఐదు రోజుల కిందటే... గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నాం. ఆ గణతంత్రానికి కారణమైన వాళ్లను మాత్రం మరిచిపోతున్నాం. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణనాడు అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాలన్న అవగాహన లేనివారనేకమంది. అలాంటిది రాజ్యాంగ నిర్మాణంలో పాలు పంచుకున్న మహిళలను, అందులోనూ దళిత మహిళలను గుర్తుంచుకోవడం అసాధ్యం. కానీ అలాంటి అసాధ్యురాలు దాక్షాయణి వేలాయుధన్. రాజ్యాంగ అసెంబ్లీలోని మొట్టమొదటి ఏకైక దళిత మహిళా సభ్యురాలు. ఆనాటి రాజ్యాంగ అసెంబ్లీలో ఉన్న 15 మంది మహిళలో చిన్న వయస్కురాలు ఆవిడే. రాజ్యాంగ నిర్మాణంలో తనవంతు పాత్ర పోషించారు.

దళిత మహిళలకు మార్గదర్శి...

1912, జులై 4న ములవుకాడ్‌లో పులయ జాతిలో పుట్టింది. వీరిది కేరళలో మొదటిసారి నివసించిన తెగ. ట్రావెంకోర్, కొచ్చి సంస్థానాల్లో జాతి వివక్షను ఎదుర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో తిరగకూడదు. బళ్లలోకి ప్రవేశం లేదు. ఆసుపత్రులు సైతం అంటరానివారిగానే చూశాయి. కుల వివక్షను ప్రత్యక్షంగా అనుభవించారు. దాక్షాయని తల్లి మణి అభ్యుదయ భావాలు కలిగిన మహిళ. తల్లి నుంచి స్ఫూర్తి పొందిన దాక్షాయని ముక్కుసూటి మనిషి. తన అభిప్రాయాలు నిర్మొహమాటంగా చెప్పేవారు.

డిగ్రీ పట్టా అందుకున్న మొదటి దళిత మహిళ...

ప్రభుత్వ పాఠశాలకు వెళ్లిన మొట్టమొదటి దళిత మహిళ. ఆ తరువాత దళితులకు మార్గం సుగమం అయ్యింది. స్కూలింగ్ తరువాత... ఎర్నాకులంలోని మహారాజా కాలేజీలో చేరారు. ఆ క్లాసులో ఏకైక మహిళా విద్యార్థిని. రసాయన శాస్త్రంలో డిగ్రీ చేస్తున్న సమయంలోనూ వివక్షను ఎదుర్కొన్నారు. ప్రొఫెసర్ అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి. దాంతో పరిశోధనలను ఆమె దూరం నుంచే చూడవలసి వచ్చేది. అయినా మంచి మార్కులతో డిగ్రీ పట్టా పొందారు. తరువాత మద్రాసు యూనివర్సిటీలో టీచర్ ట్రైనింగ్ కోర్సులో చేరారు. పూర్తి కాగానే త్రిస్సూరు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరారు. తరువాత త్రిపునిథురలోని హైస్కూల్‌కు బదిలీ అయ్యింది. అక్కడంతా అగ్రకుల ఆధిపత్యం. ఓసారి నడుచుకుంటూ వెళ్తుండగా నాయర్ మహిళ రోడ్డులో వెళుతున్నది. అదేమో ఇరుకైన తోవ. అటు, ఇటు పొలాలు.



సాధారణంగా అగ్రకులాల వాళ్లు ఎదురొస్తే దళితులు పక్కకు తప్పుకోవాలని ఆంక్ష. కానీ ఆమె పక్కకు తప్పుకోలేదు. అంత తొందరగా ఉంటే... రోడ్డు దిగి పొలాల్లోంచి నడుచుకుంటూ వెళ్లమని చెప్పింది. అలాగే నాయర్ మహిళ రోడ్డు దిగి వెళ్లిపోయింది.

క్రియాశీల రాజకీయాల్లోకి...

దాక్షాయనికి దగ్గరి బంధువు కాల్లచమూరి కృష్ణాది ఆసన్ పండిట్ కరుప్పన్, టికెకృష్ణ మీనన్ వంటివారు 1913లో పౌరహక్కుల పోరాటాన్ని ప్రారంభించారు. అందులో భాగస్వామి అయ్యారు. కేపీ వల్లనం ప్రారంభించిన పులయ మహాజన సభలో చేరారు. అణగారిన కులాలపై వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. సభలు నిర్వహించడానికి అనుమతులు లేకపోయినా... వెంబనాడ్ సరస్సులో సభ జరిపి చరిత్ర సృష్టించారు. దళిత నాయకుడు రామన్ కెలన్‌ను 1940లో వివాహం చేసుకున్నారు. తరువాత కొచ్చిన్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌ఉ నామినేట్ అయ్యారు. ఆ కౌన్సిల్ మొదటి సమావేశంలోనూ వివక్ష మీద అనర్ఘలంగా మాట్లాడారు. 1946లో ఆవిడ రాజ్యాంగ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలక భూమిక పోషించారు. తరువాత నెమ్మదిగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. దళితుల అభివృద్ధికి పాటుపడ్డారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలన్నది సామెత. ఆమె తల్లిగా తన బాధ్యతను ఏనాడూ మరువలేదు. తన ధైర్యం, అరుదైన వ్యక్తిత్వంతో పిల్లలపైన ముద్ర వేశారు. 'నా మెనుస్ట్రుయేషన్ ప్రారంభమైనప్పుడు.. నాకు తొమ్మిదేళ్లే. స్త్రీ దేహాన్ని గీసి... శరీరంలో ఏం జరుగుతుందో వివరించారు. అంతేకాదు.. శానిటరీ నాప్‌కిన్స్ తీసుకురమ్మని మా నాన్నకు చెప్పారు' అని ఆమె కూతురు మీరా పంచుకుంది. ప్రతి విషయంలో ఎంత తెలివిడితో వ్యవహరిస్తారు, ఎంత సెన్సిటివ్‌గా ఉంటారనడానికి ఉదాహరణ. ఆ తరువాత ఆమె ఢిల్లీలో మహిళా పారిశుధ్య కార్మికుల కోసం పనిచేశారు. మహిళా జాగృతి పరిషత్ ఏర్పాటు చేశారు. దాక్షాయని వేలాయుధన్... దళిత కమ్యూనిటీ కేకాదు... దేశానికి అందించిన సేవ మరువలేనిది. ❄

సూప్స్ అండ్ స్టార్టర్స్

చల్లటి వాతావరణం అనగానే అందరూ వేడివేడిగా ఏమైనా తినాలనిపిస్తుంది. వెంటనే రెస్టారెంట్స్‌కి పరుగెడతారు. అలా కాకుండా ఇంట్లోనే రెస్టారెంట్‌ను రుచిని పొందొచ్చు. అసలే శీతాకాలం. నాన్‌వెజ్ అయితే అంత తొందరగా జీర్ణమవ్వదు. అందుకే వెజ్జీ స్టార్టర్స్... హెల్దీ సూప్స్ ఈ వారం మీకోసం!



బేబీ కార్న్ స్టార్టర్స్ ...

కావల్సిన పదార్థాలు : బేబీకార్న్– 15, పెరుగు – సగం కప్పు, జీలకర్ర– రెండు చెంచాలు, ఉప్పు–రుచికి తగినంత, మైదా– 1/2కప్పు, మొక్కజొన్న పిండి – సగం కప్పు, నిమ్మరసం –అరచెంచా, కారం –అరచెంచా, నూనె – వేయించడానికి సరిపడా

తయారీ విధానం:

ముందుగా బేబీ కార్న్ శుభ్రంగా కడిగి రెండు పొడవు ముక్కల్లా చేసుకోవాలి. ఓ గిన్నెలో సగం దాకా నీళ్ళు పోసి అందులో ఈ బేబీకార్న్ ముక్కలు వేసి స్టౌ మీద పెట్టాలి . నీళ్ళు కొద్దిగా వేడి అయ్యాక బేబీకార్న్ ముక్కల్ని వేయాలి. నీళ్ల మరిగాక దింపి బేబీకార్న్‌ని వేడినీటిలోనే ఉంచి పక్కకు పెట్టాలి. ఐదునిముషాలయ్యాక నీటిని వంపేయాలి. ఓ గిన్నెలో పెరుగు, తగినంత ఉప్పు, చెంచా జీలకర్రపొడి తీసుకొని బాగా కలపాలి. ఇందులో బేబీకార్న్‌ని వేసి వాటిని పెరుగు బాగా పట్టేలా కలిని ఒక గంట సేపు అలాగే ఫ్రిజ్ లో ఉంచాలి. ఆలోపు మైదా, మొక్కజొన్నపిండి, మిగిలిన జీలకర్రపొడి, కారం, మరికొంచెం ఉప్పు, నిమ్మరసం ఓ గిన్నెలో తీసుకొని నీళ్ళు పోసుకుంటూ చిక్కని పిండిలా కలుపుకోవాలి. ఇప్పుడు ఫ్రిజ్ లో ఉంచిన బేబీకార్న్‌ని తీసి మైదా మిశ్రమంలో ముంచి కాగుతున్న నూనెలో వేయాలి. అన్ని వైపులా ఎర్రగా వేగిన తర్వాత పక్కకు తీసేయాలి. కచెప్‌తో వేడి వేడిగా తింటే రుచికరంగా ఉంటాయి.

పాలకూర, స్వీట్ కార్న్ సూప్

కావల్సిన పదార్థాలు :

స్వీట్‌కార్న్ – రెండు కప్పులు, వెల్లుల్లి తరుగు – టేబుల్‌స్పూను, ఉప్పు – తగినంత, మిరియాలపొడి – రుచికి సరిపడా, పాలకూర తరుగు – కప్పు, నూనె – రెండు చెంచాలు, క్రీం – కొద్దిగా.

తయారీ విధానం :

పొయ్యిమీద బాణలి పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక వెల్లుల్లి తరుగు వేయించాలి. నిమిషమయ్యాక స్వీట్‌కార్న్ వేసి వేయించాలి. అవి కాస్త వేగాక నాలుగు కప్పుల నీళ్లు పోసి మంట పెంచాలి. అవి మరుగుతున్నప్పుడు తగినంత ఉప్పూ, మిరియాలపొడీ వేసి దింపేయాలి. ఆ నీళ్ల వేడి తగ్గాక స్వీట్‌కార్న్‌ని మిక్సీలో తీసుకుని మెత్తని గుజ్జులా చేసుకోవాలి. దీన్ని మళ్లీ నీళ్లలో వేసి పొయ్యిమీద పెట్టాలి. రెండు నిమిషాల తరవాత పాలకూర తరుగు వేసి మంట తగ్గించాలి. కాస్త ఉడికాక దింపేసి క్రీం వేస్తే చాలు.



చికెన్ టిక్కా

కావల్సిన పదార్థాలు :

ఎముకల్లేని చికెన్ ముక్కలు – అరకేజీ, సెనగపిండి – ఒకటిన్నర టేబుల్‌స్పూను, పెరుగు – కప్పు, కారం – చెంచా, మిరియాలపొడి, గరంమసాలా – అరచెంచా చొప్పున, పసుపు – పావుచెంచా, ఉప్పు – తగినంత, ధనియాలపొడి – అరచెంచా, కసూరీమేథీ – ముప్పావుచెంచా, నిమ్మరసం – టేబుల్‌స్పూను, బిర్యానీ మసాలా – అరచెంచా.

తయారీ విధానం :

పైన సిద్ధంచేసుకున్న పదార్థాలన్నింటినీ ఓ గిన్నెలోకి తీసుకుని అన్నింటినీ బాగా కలపాలి. ఈ గిన్నెను ఫ్రిజ్‌లో అరగంట నుంచి గంట ఉంచాలి. తరవాత ఇవతలకు తీసి ఇనుప చువ్వలకు గుచ్చి నిప్పులమీద కాల్చుకోవాలి.





రాజ్మా, చిక్కుడు గింజల సూప్

కావల్సిన పదార్థాలు :

రాజ్మా – కప్పు, చిక్కుడు గింజలు – కప్పు, టొమాటోలు – రెండు, ఎండుమిర్చి – రెండు, ఉల్లిపాయ – ఒకటి, నిమ్మరసం – రెండు చెంచాలు, వేయించిన జీలకర్ర పొడి – చెంచా, కొత్తిమీర తరుగు – రెండు చెంచాలు, నూనె – రెండు చెంచాలు, ఉప్పు–తగినంత.

తయారీ విధానం :

రాజ్మా గింజల్ని పన్నెండు గంటలపాటు నానబెట్టుకోవాలి. తరవాత ఉప్పు వేసి కుక్కర్‌లో చిక్కుడు గింజలతో సహా ఐదారు కూతలు వచ్చేవరకూ ఉడికించుకుని తీసుకోవాలి. చల్లారాక ఆ రెండింటినీ ముద్దలా చేసుకోవాలి. అడుగు మందంగా ఉన్న గిన్నెను పొయ్యిమీద పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక ఎండుమిర్చీ, ఉల్లిపాయ, టొమాటో ముక్కలు వేసి వేయించాలి. అన్నీ బాగా వేగాక రాజ్మా ముద్ద, రెండు కప్పుల నీళ్లు పోసి చిక్కగా అయ్యేవరకూ ఉడికించుకోవాలి. తరవాత జీలకర్రపొడీ, నిమ్మరసం, మరికొంచెం ఉప్పు వేయాలి. ఇది కాస్త చిక్కగా అవుతున్నప్పుడు కొత్తిమీర తరుగు వేసి దింపేయాలి.

మునగాకు సూప్

కావల్సిన పదార్థాలు :

మునగాకు – కప్పు, బంగాళాదుంప చిన్నది, క్యారెట్ – ఒక్కోటి చొప్పున, బిర్యానీ ఆకు – ఒకటి, మిరియాలు – నాలుగైదు, అల్లంముక్క – అంగుళం, ఉప్పు – రుచికి సరిపడా, మిరియాల పొడి – పావుచెంచా, క్రీం టేబుల్‌స్పూను.

తయారీ విధానం :

మునగాకును శుభ్రంగా కడిగి వెడల్పాటి గిన్నెలోకి తీసుకుని బంగాళాదుంప ముక్కలు, క్యారెట్ ముక్కలు, బిర్యానీ ఆకు, మిరియాలు, అల్లం వేసి మరీ మెత్తగా కాకుండా ఉడికించాలి. చల్లారాక మిక్సీలో గుజ్జులా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమాన్ని వడకట్టి మళ్లీ పొయ్యిమీద పెట్టి ఒక పొంగు వచ్చేదాకా ఉంచాలి. ఇప్పుడు సరిపడా ఉప్పు, మిరియాలపొడి కలిపి దింపేయాలి. తీసుకునే ముందు క్రీంతో అలంకరించుకుంటే సరిపోతుంది. నోరూరించే మునగాకు సూప్ సిద్ధం.



సహజ శుభ్రత...



మార్కెటింగ్ పుణ్యమా అని ఇప్పుడు ప్రతి ఇంట్లో రకరకాల ఫ్లోర్ క్లీనర్స్ వాడేస్తున్నారు. వీటిలో ఉండే స్ట్రాంగ్ కెమికల్స్ వల్ల ఫ్లోర్ శుభ్రంగా ఉండటం మాటేమో కానీ, రకరకాల జబ్బులు వస్తాయని హెచ్చరిస్తున్నారు. వీటితో కేన్సర్‌లాంటి తీవ్రమైన సమస్యలూ వస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే మనమే ఓ ఫ్లోర్ క్లీనర్‌ని తయారుచేసుకుంటే ఏడాదికి రెండు మూడు వేలు ఆదా అవడంతో పాటు ఆరోగ్యానికి కూడా మంచిది. కెమికల్ క్లీనర్స్‌తో పోల్చుకుంటే వీటివల్ల లాభాలు కూడా ఎక్కువే!

- నేచురల్ ఫ్లోర్ క్లీనర్ కోసం పటిక, ఉప్పు, కర్పూరం బిళ్లలు ఉంటే సరిపోతుంది. పటిక ఫ్లోర్ మీద ఉండే చిన్న చిన్న క్రిములను చంపే యాంటిబయాటిక్‌లా పనిచేస్తుంది. ముఖ్యంగా ఇంట్లో పసిపిల్లలు ఉన్నవారు పటికతో ఫ్లోర్ శుభ్రం చేస్తే, పిల్లలకి ఎలాంటి అలెర్జీలు రాకుండా ఉంటాయి.
- ఉప్పుతో మార్బుల్ ఫ్లోరింగ్ తళతళలాడిపోతుంది. చీమలు, చిమట్లు నేల మీద పాకకుండా చేస్తుంది.
- కర్పూరం ఓ గొప్ప రిపెల్లంట్‌గా పనిచేస్తుంది. దీంతో ఈగలు, దోమలు, బొద్దింకలు అంత త్వరగా ఇంట్లో రావు. పైగా కర్పూరం వల్ల మంచి వాసన కూడా వస్తుంది.

ఈ పదార్థాలన్నీ నీటిలో వేసి అవి కరిగిపోయేదాకా ఉంచాలి. తర్వాత వాటిని కాస్త సర్ఫ్, ఫినాయిల్ కలిపిన నీళ్లలో కలిపి ఫ్లోర్ క్లీన్ చేసుకోవాలి. ఒకటి రెండు సార్లు ఈ హోమ్ మేడ్ క్లీనర్ వాడి చూడండి. ఆ తర్వాత ఇంక మీరు కెమికల్స్ జోలికి పోనేపోరు. ❄




బయటకు వెళ్లేటప్పుడు...

శీతాకాలంలోనూ మెరిసిపోయే చర్మం కావాలని ఎవరికుండదు. కానీ అందుకు మార్గాలే తెలియవు. అలాంటివారు ఈ సూపర్ టిప్స్ పాటిస్తే మెరిసిపోవచ్చు.

- బయటకు వెళ్లేటప్పుడు ముఖం తాజాగా ఉండేందుకు..ట్యాన్ దూరం చేసుకొనేందుకు పూల రసాలతో తయారయ్యే లోషన్స్ వాడితే ఇన్‌స్టెంట్ ఫలితాలను పొందవచ్చు. ఫ్లవర్ బేస్డ్ లోషన్స్‌లో కూడా అనేక రకాలు ఉన్నాయి. అందులో గులాబీ, మల్లె, మందారం లాంటి వాటితో తయారయ్యే లోషన్స్‌ను వాడడం బెస్ట్.
- ప్రతిరోజూ గ్లిజరిన్‌తో కలిసిన రోజ్‌వాటర్‌తో మొహాన్ని కడుక్కోవడమే బెస్ట్. మొహాన్ని కడుక్కుంటున్నప్పుడు ఏ సబ్బు పెడితే ఆ సబ్బు వాడకుండా సున్నిపిండి కాని బేబీ సోప్ కాని వాడాలి.
- ఉదయాన్నే లేచి నానబెట్టిన బాదం పలుకులు పది తిని ఆ వెంటనే ఒక గ్లాసుడు గోరువెచ్చని నీటిలో రెండు టీస్పూన్ల తేనెని కలిపి తాగెయ్యండి.
- ఇవన్నీ చేసి ముఖం ఒక్కటే బాగుంటే సరా... అందమైన ఫిగర్ కూడా అవసరమే మరి. రెగ్యులర్‌గా యోగా చేస్తూ..కొన్ని ఆసనాలను ప్రత్యేకంగా చేయడం వలన అందమైన శరీరాక తిని.. సౌందర్యాన్ని పెంచుకోవచ్చు.
- అందమైన శరీరాక తి కావాలంటే తీసుకొనే డైట్ చాలా ముఖ్యం. మీల్స్ మెనూలో ఉడకబెట్టిన కూరగాయలు, పండ్లతో పాటు బ్రౌన్ రైస్‌కు స్థానం కల్పించాలి. ❄

ఈ లక్షణాలున్నాయా?

పురుషులతో పోలిస్తే మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత ఎక్కువగా ఉంటుంది. అయితే చాలామంది మహిళలు ఆ విషయాన్ని గుర్తించరు. సమస్యలు తీవ్రమై, డాక్టర్ దగ్గరకు వెళ్లాక గానీ కళ్లు తెరవరు. అలా కాకుండా ముందే దాన్ని కనిపెడితే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అసలు హార్మోనల్ ఇంబాలెన్స్ ఉందని ఎలా కనిపెట్టాలి? సింపుల్... ఈ లక్షణాలు కనిపిస్తే హార్మోన్లు రెడ్ సిగ్నల్ ఇస్తున్నట్టే.



- ప్రతి నెలా పీరియడ్స్ ఒకే సమయానికి రావాలి. అలా కాకుండా అటూ ఇటూ అవుతున్నా, అసలు రాకపోతున్నా ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ హార్మోన్ల అసమతుల్యత ఏర్పడినట్టే. దీన్ని కనుక నిర్లక్ష్యం చేస్తే పీసీఓడీ సమస్య పరిగెత్తుకు వస్తుంది.
- నిద్ర పట్టడం పోవడం కూడా హార్మోనల్ అసమతుల్యతకి సూచనే.
- మొటిమలు అందానికి సంబంధించిన సమస్య అనుకుంటారు చాలామంది. కానీ హార్మోన్ల అసమతుల్యతకీ మొటిమలకూ సంబంధం ఉందని తెలుసా? మొటిమలు వచ్చి ఎంతకీ తగ్గడం లేదంటే హార్మోన్ల సమస్య ఉందని అర్థం చేసుకోవచ్చు. ఆయిల్ గ్లాండ్స్ ఎక్కువ పని చేసి ఆ సమస్య ఏర్పడి ఉండొచ్చు.
- హార్మోన్లు సరిగ్గా పని చేయకపోతే మెదడు మీద ఆ ప్రభావం పడుతుంది. కాబట్టి ఆలోచనల్లో గందరగోళం, మతిమరుపు వంటి ఇబ్బందులు వస్తే ఓసారి చెకప్ చేయించుకోవడం మంచిది.
- పీరియడ్స్ సమయంలో అంతకు ముందు లేని విధంగా కడుపునొప్పి, వికారం కనిపిస్తుంటే హార్మోన్ల పనితీరులో తేడా వచ్చినట్టే.
- ఉన్నట్టుండి బరువు పెరిగిపోవడం, హఠాత్తుగా సన్నబడిపోవడం జరుగుతుంటే థైరాయిడ్ పరీక్ష చేయించుకోవడం మంచిది.
- డిప్రెషన్, ఊరకూరకే మూడ్ మారిపోవడం వంటివి కూడా ఈస్ట్రోజన్ హార్మోన్ అసమతుల్యత వల్ల జరగవచ్చు. మెదడులో విడుదలయ్యే సెరెటోనిన్, డోపమైన్ లాంటి హార్మోన్లను ఈస్ట్రోజన్ ప్రభావితం చేయడం వల్ల ఈ సమస్యలు వస్తాయి.
- హార్మోనల్ అసమతుల్యత కారణంగా యోని పొడి బారడం, బ్రెస్ట్ చర్మపు పొరలు పలచబడటం లేదా మందంగా అవడం వంటివి కూడా జరుగుతాయి. సిస్టులు, గడ్డలు ఏర్పడతాయి. ❄

ఛానళ్ల వెనుక ఎవరున్నారో తెలుసుకోండి

అప్పుడే వార్తల్లోని వాస్తవాలు బయటకు... ● న్యూస్ రీడర్లు.. యాంకర్లను తెలుసుకుంటే సరిపోదు

ప్రముఖ పాత్రికేయురాలు సీమా ముస్తఫా

- సెలబ్రిటీలు కాదు.. సామాన్యుల కోసం ఆలోచించాలని పాత్రికేయులకు సూచన



మాట్లాడుతున్న సీమా ముస్తఫా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'టీవీ ప్రేక్షకుల్లో చాలా మంది న్యూస్ రీడర్లను, యాంకర్లను సులభంగా గుర్తు పట్టేస్తుంటారు. కానీ ఇదొక్కటే సరిపోదు. ఆయా ఛానళ్లను ఎవరు నడిపిస్తున్నారు..? వాటి వెనుక ఎవరెవరి డబ్బు ఉంది...? అనే విషయాలను కూడా తెలుసుకోవాలి...' అని ప్రముఖ పాత్రికేయురాలు, ద సిటిజన్ డిజిటల్ న్యూస్ పేపర్ చీఫ్ ఎడిటర్ సీమా ముస్తఫా వ్యాఖ్యానించారు. అలా తెలుసుకున్నప్పుడే ఆయా ఛానళ్లు ప్రసారం చేసే వార్తలు, కథనాల్లోని వాస్తవికత బయటపడుతుందని వివరించారు.

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లో 'మీడియా-అహింస' అనే అంశంపై ముస్తఫా స్మారకోపన్యాసం చేశారు. సర్వోదయ ఇంటర్నేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం అంతర్జాతీయ పత్రికల నుంచి స్థానిక పత్రికల వరకూ సెలబ్రెటీలకే అధిక ప్రాధాన్యతనిస్తున్నాయని తెలిపారు. వాస్తవానికి పత్రికలు ఉండాల్సింది సామాన్యుల పక్షం తప్ప సంపన్నుల వైపు కాదని వ్యాఖ్యానించారు. పాత్రికేయులు సైతం ఇదే కోణంలో ఆలోచించాలని సూచించారు. తమ డిమాండ్ల సాధన కోసం లక్షలాది మంది శ్రామికులు, కార్మికులు ఇటీవల ఢిల్లీలో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు.. కానీ మన పత్రికలు ఆ వార్తను సింగిల్ కాలమ్‌లో కూడా ప్రచురించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య సంగ్రామం సమయంలో అనేక పత్రికలు జాతిని జాగృతం చేశాయని తెలిపారు. సమాజ హితం కోసం నిర్భీతిగా, నిక్కచ్చిగా వార్తలను రాయాలంటూ గాంధీజీ ఆనాడు ప్రబోధించారని చెప్పారు. పత్రికలనేవి డబ్బు సంపాదనకు మార్గాలు కాకూడదు.. అవి సామాన్యుల మెదళ్లను ప్రభావితం చేయాలంటూ ఆయన సూచించేవారని గుర్తుచేశారు. జాతీయ, ప్రాంతీయ పత్రికలతోపాటు ఇతర అన్ని పత్రికల్లోని తప్పొప్పులకు ప్రధాన సంపాదకుడే బాధ్యత వహించాల్సి ఉంటుందని ముస్తఫా ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ సూత్రం కేవలం జనరల్ పేజీలకే పరిమితం కాదని.. జిల్లా, రీజియన్ పేజీలకు కూడా వర్తిస్తుందని ఆమె చెప్పారు. ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే మాధ్యమాల్లో పత్రికలు అతి ముఖ్యమైనవని తెలిపారు. అందువల్ల ప్రతి పేజీలోని ప్రతి వాక్యాన్ని క్షుణ్ణంగా చదివిన తర్వాతే ప్రచురించాలని సూచించారు. లేదంటే పాఠకులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. వార్తలను రాసేటప్పుడు విలేకరులు, ప్రచురించేటప్పుడు సంపాదకులు నిక్కచ్చిగా వ్యవహరించాలని సూచించారు.

ఇందుకు నిజాయితీతోపాటు ధైర్యం కూడా కావాలని అన్నారు. కార్పొరేట్ శక్తుల ఆధిపత్యంలో మీడియా నలిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ఇలాంటివన్నీ ఊకదంపుడు ఉపన్యాసాలుగా మిగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఎందరో ప్రముఖ పాత్రికేయులు మీడియా హౌస్‌ల నుంచి బయటకొస్తున్నారని తెలిపారు. అయితే సామాజిక మాధ్యమాలు, వెబ్ ఛానళ్లు, పత్రికల ద్వారా వారు తాము అనుకున్నది సాధిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజలే కేంద్రంగా, వారి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వార్తలు రాయటం ద్వారా పాత్రికేయులు తమ వృత్తికి న్యాయం చేయాలని ఆమె సూచించారు.

కోయిలకొండను విడదీయొద్దు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు

- ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రతినిధి

మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిలకొండ మండలాన్ని విడదీసి కొత్తగా ఏర్పాటు చేయబోయే నారాయణపేటలో జిల్లాలో వీలినం చేసి భావితరాలను బాధపెట్టొదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అన్నారు. ఈ మేరకు ఆయన సీఎం కేసీఆర్‌కు బుధవారం బహిరంగ లేఖ రాశారు. అనంతరం కోయిలకొండ మండలం కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాను ప్రభుత్వం రెండు జిల్లాలుగా విభజించాలని చూస్తోందనీ, దానికి ఎలాంటి అభ్యంతరమూ లేదనీ అన్నారు. కానీ ప్రజల మనోభావాలకు విరుద్ధంగా, బలవంతంగా కోయిలకొండ మండలాన్ని నారయణపేటలో విలీనం చేయొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. కోయిలకొండకు, నారాయణపేటకు 65 కిలోమీటర్ల దూరం ఉంటుందనీ, ప్రభుత్వ కార్యాలయాలకు, ఇతర పనులకు జిల్లా కేంద్రానికి రావాలంటే దూర భారం పెరుగుతుందనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న మహబూబ్‌నగర్ జిల్లాకు 20 కిలోమీటర్ల దూరంలోనే ఉందనీ తెలిపారు. రైతులకు, వ్యాపారస్తులకు, విద్యార్థులకు, వైద్యానికి మహబూబ్‌నగర్ జిల్లానే ఉపయోగకరమన్నారు.

కేంద్ర విధానాలను వ్యతిరేకిస్తూ 1, 2 తేదీల్లో నిరసనలు

తెలంగాణ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 1, 2 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకట్రాములు బుధవారం సంయుక్తంగా పిలుపునిచ్చారు. రైతు వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారంలో బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7 వరకు దేశవ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాల్లో భాగంగా 1,2 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా దిష్టిబొమ్మ దగ్ధం, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర ఇస్తామని ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. ఐదేండ్లు పూర్తయినా అమలుకు నోచుకోలేదని తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా కంపెనీలకే ఉపయోగపడిందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా రైతులు ఆందోళనకు దిగినా కేంద్రం పట్టించుకోలేదని తెలిపారు.ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించాలి


- ఉత్పత్తి, ఉత్పాదకత పెంపొందించాలి: నాబార్డు వార్షిక రుణ ప్రణాళిక సదస్సులో జోషి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యవసాయ రంగంలో పెట్టుబడులు తగ్గించే ప్రయత్నం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెంపొందించినట్టయితే రైతుల ఆదాయం రెట్టింపు సాధ్యమవుతుందని చెప్పారు. నాబార్డు 2019-20 వార్షిక రుణ ప్రణాళికను ఆయన ఆవిష్కరించారు నాబార్డ్ రాష్ట్ర రుణ ప్రణాళిక సదస్సు బుధవారం హైదరాబాద్ హోటల్ మ్యారియెట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఆదాయం రెట్టింపుకు అన్ని విధాలుగా కృషి చేయాలని కోరారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నాబార్డు సీజీఎం విజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయం అనుబంధ రంగాల కోసం రూ.61,457 కోట్లు కేటాయించామని చెప్పారు. నిల్వ, మార్కెటింగ్, భూమి అభివద్ధి, భూసార పరిరక్షణ, ఇతర వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పనకు రూ.2318 కోట్లు కేటాయించామని వివరించారు. వ్యవసాయ సహాయ కార్యకలాపాలు, ఫుడ్, ఆగ్రో ప్రాసెసింగ్ కోసం రూ.7189 కోట్లు కేటాయించిట్టు తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన, ఎగుమతులు, విద్యా, గహ నిర్మాణం, సంప్రదాయేతర ఇంధన వనరులు, సామాజిక మౌలిక వసతులు, ఇతర కార్యక్రమాలకు రూ.1008 కోట్లు కేటాయించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ ఛైర్మన్ రవీంద్రరావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్ధసారథి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకష్ణారావు, ఆంధ్రాబ్యాంక్ ఈడీ ఏకే రావత్, ఆర్బీఐ జీఎం సుందరం శంకర్, ఎస్ఎల్ బీసీ జీఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు యూజీసీ వేతనాలు వర్తింపు

- ప్రభుత్వానికి ఉన్నత విద్యామండలి నివేదిక



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ, ఎయిడెడ్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఏడో వేతన సవరణ కమిషన్ సిఫారసుల ప్రకారం వేతనాలు వర్తింపచేయాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్ఈ) నిర్ణయించింది. ఈ మేరకు యూజీసీ ఏడో వేతన సవరణ కమిషన్ సిఫారసుల అమలుపై నియమించిన రూపొందించిన నివేదికను విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రాను బుధవారం సచివాలయంలో ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు కలిసి అందజేశారు. విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, రిటైర్ అయిన వారికి ఆరోగ్య పథకం అమలు చేయాలని సూచించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో రిటైర్డ్ అధ్యాపకుల పింఛన్‌ను సవరించాలని కోరారు. విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు 20 శాతం వేతనాలు పెరగనున్నట్టు సమాచారం. ఎయిడెడ్ కాలేజీల్లో 200 మంది, డిగ్రీ కాలేజీల్లో 1,419 మంది, విశ్వవిద్యాలయాల్లో 1,231 మంది పనిచేస్తున్నారు. ఏడో వేతన సవరణ కమిషన్ సిఫారసులు అమలు చేయడానికి రూ.200 కోట్లు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని కమిటీ అంచనా వేసినట్టు సమాచారం. 2016, జనవరి ఒకటి నుంచి యూజీసీ ఏడో వేతన కమిటీ సిఫారసుల ప్రకారం పెరిగిన వేతనాలు అమలు చేయాల్సి ఉంటుంది. పెరిగే వేతనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాలి. ఈ ఏడాది, మార్చి 31 నాటికి పెరిగిన వేతనాలు అధ్యాపకులకు అమలు చేయాలి.

పూర్థిసాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలి : నిజాముద్దీన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కాకుండా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలని టీపీసీసీ డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో మిగులు బడ్జెట్ ఉందంటూనే ప్రజాధనాన్ని దుబారా చేస్తున్నారని విమర్శించింది. బుధవారం గాంధీభవన్‌లో పార్టీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్ విలేకరులతో మాట్లాడారు. లక్ష కోట్ల ఆదాయం పెరిగితే ఏటా వేలకోట్ల లోటు బడ్జెట్ ఎందుకు ఉందని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు.

ప్రజాస్వామ్యాన్ని టీఆర్ఎస్ ఖూనీ చేసింది : అద్దంకి దయాకర్

ఎన్నికల్లో టీఆర్ఎస్ అనేక అక్రమాలకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ చెప్పారు. ముందస్తు ఎన్నికల్లో ఈవీఎంలు గెలిచాయని, ప్రజ లు మాత్రం ఓడారని చెప్పారు. వీవీ ప్యాట్లను లెక్కిం చాలని డిమాండ్ చేశారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

- వరంగల్ జిల్లా పర్వతగిరి మోడల్ స్కూల్‌లో ఘటన



నవతెలంగాణ-పర్వతగిరి

పదో తరగతి విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరెసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి మోడల్ స్కూల్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సీహెచ్ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మడ్డి వెంకటేశ్వర్లు-రాణి దంపతుల కుమార్తె ప్రసన్న (15) స్థానిక మోడల్ పాఠశాలలో పదో తరగతి చదువుతూ అదే పాఠశాలకు చెందిన వసతిగృహంలో ఉంటోంది. బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో హాస్టల్ గదిలోకి వెళ్లి మంచంపై కుర్చీ వేసుకుని ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుంది. గమనించిన సిబ్బంది ప్రసన్నను ఆస్పత్రికి తీసుకెళ్తుండగానే పరిస్థితి విషమించి మృతి చెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. విద్యార్థిని తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీవీప్యాట్ల లెక్కింపునకు హైకోర్టు ఆదేశాలు



హైదరాబాద్: ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రెల్ (వివి ప్యాట్)లను లెక్కింపునకు ఆదేశాలివ్వాలనే రిట్ పిటిషన్లను విచారించిన హైకోర్టు కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. వీవీ ప్యాట్‌లను లెక్కించాలన్న పిటిషనర్ అభ్యర్థనలపై వివరణ ఇవ్వాలని కేంద్ర ఎన్నిక సంఘానికి బుధవారం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఈసీకి నోటీసులు జారీ చేసింది.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేసి టీఆర్ఎస్ అభ్యర్థులపై ఓటమిపాలైన ఎన్.పద్మావతిరెడ్డి, అద్దంకి దయాకర్, బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిన మల్‌రెడ్డి రంగారెడ్డిలు దాఖలు చేసిన వ్యాజ్యాలను హైకోర్టు విచారించింది.

కోదాడ నుంచి పద్మావతిరెడ్డి పోటీ చేశారని, ఇక్కడ అభ్యర్థి అయిన ఆమెకు తెలియకుండానే యూనిట్లను మార్చేశారని న్యాయవాది వాదించారు. వీవీ ప్యాట్ స్లిప్‌ల ముద్రణ కాలం స్వలమేనని, 45 రోజుల్లోనే అవి చెరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే కోర్టు స్పందించకపోతే తమ గోడకు ఫలితం ఉండదన్నారు. తుంగతుర్తి నుంచి అద్దంకి దయాకర్ పోటీ చేశారని, ఇక్కడ 18 ఈవీఎంలు పనితీరు బాగోలేదని, ఈవీఎంలు సరిగ్గా పనిచేయనప్పుడు వీవీ ప్యాట్‌లను లెక్కించాలని, ఈమేరకు చేయాలన్న తమ అభ్యర్థనను ఎన్నికల అధికారులు పట్టించుకోలేదని ఆయన లాయర్ వాదించారు.

వీవీ ప్యాట్ ముద్రణలు చెరిగిపోవని, అయిదేండ్లు ఉంటాయని ఈసీ న్యాయవాది అవినాశ్ దేశాయ్ చెప్పారు. ఎన్నికల ఫలితాలపై అభ్యంతరాల్ని ఎలక్షన్ పిటిషన్లుగా వేసుకోవాలేగానీ రిట్ పిటిషన్లు వేయడానికి వీల్లేదని చెప్పారు. వాదనల అనంతరం హైకోర్టు.. ఈసీ తమ వాదనలతో ఫిబ్రవరి 7లోగా కౌంటర్లు వేయాలని, వాటిని అందుకున్న పిటిషనర్లు తమ జవాబులను అదే నెల 14 నాటికి తెలియజేయాలని ఇరుపక్షాలను ఆదేశించింది. విచారణ ఫిబ్రవరి 14కి వాయిదా పడింది.

కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మాజీ మంత్రి డీకే అరుణ, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ. రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ అభ్యర్థులుగా ఓడిపోయిన కె.శ్రీనివాస్ గౌడ్, దాసోజు శ్రవణ్ కుమార్, బి.పవన్‌కుమార్, లక్ష్మణ్‌కుమార్, కాసాని జ్ఞానేశ్వర్‌లు కూడా హైకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే.

ఎలైట్ బార్ల జీవోకు వ్యతిరేకంగా పిల్ డిస్మిస్

ఉన్నత శ్రేణి బార్‌లు (ఎలైట్ బార్‌లు) ఏర్పాటుకు వీలు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాల్ చేసిన పిల్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోమని, ఇందులో ప్రజాప్రయోజనం ఏమీ లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన డివిజన్ బెంచ్ తోసిపుచ్చింది. ప్రభుత్వ విధాన నిర్ణయంలో జోక్యం చేసుకోబోమని ప్రకటించింది. వరంగల్‌కు చెందిన రాజనాల శ్రీహరి దాఖలు చేసిన పిల్‌ను బెంచ్ ముందుకు విచారణకు వచ్చింది. ఇది పిల్ ఎలా అవుతుందో స్పష్టం చేయాలని పిటిషనర్‌ను బెంచ్ ప్రశ్నించింది. జీవో 223 ద్వారా ఎలైట్ బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, హైదరాబాద్ నగరంలో మూడు ఎలైట్ బార్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిందని, ఇది బార్ అండ్ రెస్టారెంట్లకు అదనమని పిటిషనర్ వివరించారు. ఎలైట్ బార్లలకు ఏటా లైసెన్స్‌ల కోసం బిడ్డింగ్‌లు ఉండవని, ఒకసారి అనుమతి ఇస్తే సంవత్సరాల కొద్దీ అనుమతి ఉంటుందని, వార్షిక ఫీ మాత్రమే పెంపు ఉంటుందని చెప్పారు. జీవోను కొట్టేయాలన్న అభ్యర్థనను ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ పిల్ వెనుక ఇతర బార్ల యజమానులు ఉండవచ్చునని ఆరోపించింది. అన్ని వసతులతో ఎలైట్ బార్లు ఉంటే నష్టమేమీ లేదని చెప్పింది. వాదనల అనంతరం పిల్‌ను హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు చెప్పింది.

పీహెచ్‌డీ స్కాలర్ల స్టైపెండ్ 20 శాతం పెంపు


- జేఆర్ఎఫ్ రూ.31 వేలు, ఎస్ఆర్ఎఫ్ 35 వేలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థుల స్టైపెండ్‌ను కేంద్ర ప్రభుత్వం 20 శాతం పెంచింది. ఈ మేరకు శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మనోజ్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్) నెలకు చెల్లించే స్టైపెండ్‌ను రూ.25 వేల నుంచి రూ.31 వేలకు పొడిగించారు. సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (ఎస్ఆర్ఎఫ్) నెలకు చెల్లించే స్టైపెండ్‌ను రూ.28 వేల నుంచి రూ.35 వేలకు పెంచారు. అంటే జేఆర్ఎఫ్‌నకు రూ.6 వేలు, ఎస్ఆర్ఎఫ్‌నకు 7 వేల చొప్పున స్టైపెండ్ పెరిగింది. జేఆర్ఎఫ్ స్టైపెండ్‌ను 2014లో, ఎస్ఆర్ఎఫ్ స్టైపెండ్‌ను 2010లో సవరణ చేసిన విషయం తెలిసిందే. పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థుల స్టైపెండ్ పెంచడంతో దేశవ్యాప్తంగా సుమారు 1.25 లక్షల మంది లబ్ధిపొందనున్నారు. పెరిగిన స్టైపెండ్ ఈనెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. నేషనల్ ఎలిజబులిటీ టెస్ట్ (నెట్), సీఎస్ఐఆర్, యూజీసీ నెట్, గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్) ద్వారా పీహెచ్‌డీ పరిశోధనకు ఎంపికైన విద్యార్థులకు పెరిగిన స్టైపెండ్ వర్తించనుంది.

రైతులను నాశనం చేసింది కాంగ్రెస్, బీజేపీలే

- తెలంగాణను దిక్సూచిగా మార్చింది కేసీఆర్ : గుత్తా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతులను నాశనం చేసింది కాంగెస్, బీజేపీ పార్టీలేనని రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షులు గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో జాతీయ, ప్రాంతీయ పార్టీలు ప్రధానంగా రైతులపై దృష్టిపెట్టాయని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఎవరూ, ఏనాడూ ఊహించని విదంగా సీఎం కేసీఆర్ దేశ రైతాంగానికి తెలంగాణను దిక్సూచిలా మార్చారని చెప్పారు. రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ సౌకర్యం కల్పించింది ఒక్క తెలంగాణ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. సాగు నీరు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు.

అడవుల రక్షణ పేరుతో గిరిజన హక్కులను కాలరాయొద్దు : గిరిజన సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అడవుల రక్షణపేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందిస్తున్న మార్గదర్శకాలు గిరిజన హక్కులు, చట్టాలకు లోబడి ఉండాలని తెలంగాణ గిరిజన సంఘం సూచించింది. కొత్త చట్టాలతో గిరిజన హక్కులను కాలరాయొద్దని హెచ్చరించింది. బుధవారం ఈమేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధీరావత్ రవినాయక్, మూడావత్ ధర్మనాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. అడవులను, అటవీ సంపదను రక్షించాలనే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చట్టాన్ని రూపొందించాలని సీఎం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం గిరిజనుల్లో భయాందోళన, అభద్రతాభావాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు. తరతరాలుగా అడవులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులను అక్రమణదారులుగా, స్మగ్లర్లుగా చిత్రీకరించే ప్రయత్నంలో భాగమేనని తెలిపారు. సాగుచేస్తున్న భూములు నుంచి వెళ్లగొట్టాలని కుట్ర చేస్తోందని తెలిపారు. రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన 1/70చట్టం, పెసాచట్టం, అటవీహక్కుల చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని పేర్కొన్నారు. అడవుల్లో గిరిజనులు తమ జీవనాధారం కోసం అడవులు, అటవీభూములు, అటవీఉత్పత్తులు, పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారని గుర్తు చేశారు. వారి హక్కులకు లోబడే కొత్తచట్టం ఉండాలే తప్ప హక్కులకు భంగం కలిగే విధంగా ఉంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనుల సాగులో ఉన్న అటవీ భూములకు హక్కు పత్రాలు ఇస్తామని వాగ్దానం చేసిందని పేర్కొన్నారు. వీటి అమలు కోసం తక్షణం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సర్వీసు రూల్స్‌పై పోరాటం కొనసాగుతుంది : పీఆర్టీయూటీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్: ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు కోసం పోరాటం కొనసాగుతుందని పీఆర్టీయూటీఎస్ ప్రకటించింది. ఈ మేరకు పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పి సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1975లో రూపొందించిన రాష్ట్రపతి ఉత్తర్వులు తెలంగాణకు వర్తించబోవని తెలిపారు.

మాజీ మంత్రి కేవీ కేశవులు మరణంపట్ల సీఎం సంతాపం


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ మంత్రి కేవీ కేశవులు (97) బుధవారం హైదరాబాద్‌లోని బాగ్ అమీర్‌పేటలో కన్నుమూశారు. ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర సంతాపాన్ని తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. బీసీ కమిషన్ ఛైర్మెన్ బీఎస్ రాములు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి తదితరులు కేశవులు మరణంపట్ల సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రియలు గురువారం ధర్మపురిలో జరగనున్నాయి.

ప్రమాదంలో రాజ్యాంగం

మోడీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

- విశ్వాసాలను విద్వేషాలుగా మారుస్తున్న సంఘ్ పరివార్
- ఆధిపత్యాలకు వ్యతిరేకంగా పోరాడాలి: ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపు
- బీజేపీని ఓడిస్తేనే లౌకికవాదానికి మనుగడ : సురవరం



మాట్లాడుతున్న హరగోపాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ప్రొఫెసర్ హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే దేశానికి, ప్రజలకు మేలు కలుగుతుందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 'లౌకికవాదాన్ని రక్షించుకుందాం, రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం'అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్యవక్తగా హాజరైన హరగోపాల్ మాట్లాడుతూ గాంధీని హత్యచేసిన జనవరి 30 ఈ దేశానికి విషాద దినమని అన్నారు. గాంధీ చెప్పిన అహింసా మార్గం, శాంతియుత ఉద్యమానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. సొంత మతాన్ని విశ్వసిస్తూనే ఇతర మతాలను గౌరవించాలని గాంధీ భావజాలంలో కనిపిస్తుందని చెప్పారు. కానీ హిందుత్వ వాదులు, సంఘ్‌పరివార్ శక్తులు విశ్వాసాలను విద్వేషాలుగా మారుస్తున్నారని అన్నారు. మతసామరస్యం ఉండాల్సింది మతోన్మాదం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీ నుంచి గౌరీలంకేష్ హత్య వరకు సంఘ్‌పరివార్ శక్తులు దాడులు చేసి, విధ్వంసం సృష్టించాయని విమర్శించారు. అసమానతలు పోవాలనీ, స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి, ప్రజల ఆకాంక్షల మేరకు అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. నూతన ఆర్థిక విధానాలు అమలు కావడం, మతోన్మాదం వల్ల ప్రజల్లో అసమానతలు పెరిగిపోయాయని చెప్పారు. సామ్రాజ్యవాదులు, మతోన్మాదులు ఈ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఉండాలని కోరుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చే అవకాశముందని చెప్పారు. సీబీఐ, ఆర్బీఐ, ఈడీ, విశ్వవిద్యాలయాలు ఇలా రాజ్యాంగ వ్యవస్థలను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన నాయకుడు గాంధీ అని అన్నారు. గాంధీ భావజాలంతో అభిప్రాయభేదాలున్నా ఎన్నడూ శత్రువుగా చూడలేదన్నారు. గాంధీని చంపిన గాడ్సేకు విగ్రహాలు, దేవాలయాలు కట్టాలని బీజేపీ నేత సాక్షి మహరాజ్ ప్రకటించినా మోడీ ప్రభుత్వం చర్య తీసుకోలేదని విమర్శించారు. ఇంకోవైపు అసహనం పెరిగిపోయి దళితులు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. శాస్త్రీయ అవగాహన ఉన్న మేధావులపైనా, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నేతలపైనా దాడులు చేయడమే కాకుండా దేశద్రోహం కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలను ప్రశ్నించిన వారిని అర్బన్ నక్సల్స్‌గా ప్రకటిస్తున్నారని చెప్పారు. ఎర్రజెండా పట్టుకున్నా, కమ్యూనిస్టు అని తెలిసినా సాధారణ పోలీసులే కాకుండా డీజీపీ స్థాయి ఉన్నతాధికారులు నక్సలైట్లుగా పరిగణిస్తున్నారని విమర్శించారు. లౌకికవాదాన్ని, ప్రజాతంత్ర హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం భారత్ గొప్పతనమని అన్నారు. మోడీ హయాంలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలు నిర్వీర్యమయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు డి సుధాకర్, ఈటి నర్సింహ, ఐలయ్య, బోస్, ఉజ్జిని రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఎంవీఐ

- 5 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ హోంగార్డు, ఏజెంట్

నవతెలంగాణ-సంగారెడ్డిటౌన్

ఏసీబీకి మరో అవినీతి అధికారి పట్టుబడ్డాడు. రూ.5వేలు లంచం తీసుకుంటూ ట్రాన్స్‌పోర్టు హోంగార్డు, ఏజెంట్ బుధవారం ఏసీబీకి చిక్కారు. సూత్రధారి సంగారెడ్డి ఎంవీఐ తోపాటు, మిగతా ఇద్దరిపై అధికారులు కేసు నమోదు చేశారు. ఏసీబీ డీఎస్పీ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకుడు సందీప్ ట్రాక్టర్ ట్రాలీలు తయారు చేస్తుంటాడు. దానికి సంబంధించిన లైసెన్స్ గడువు ముగియడంతో రెన్యూవల్ కోసం ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో ఇదివరకే దరఖాస్తు చేసుకున్నాడు. ఆ ట్రాలీల తయారీని తనిఖీ చేయాలని ఉన్నతాధికారులు ఎంవీఐ అనిల్‌కుమార్ చౌహాన్‌ను ఆదేశించారు. తనకు రూ.5 వేలు లంచం ఇస్తేనే అనుమలిస్తానని ఎంవీఐ నిర్వాహకుడిని డిమాండ్ చేశారు. దానికి అంగీకరించిన ఆయన, అనంతరం ఏసీబీ అధికారులకు సమాచారమందించాడు. రూ.5 వేలను వాహనాల రిజిస్ట్రేషన్ ఏజెంట్‌కు ఇవ్వాలని హోంగార్డు సాయికుమార్ ద్వారా ఎంవీఐ సందీప్‌కు తెలియజేశారు. బాధితుడు ఏజెంట్‌కు బడబ్బులంజేస్తుండగా ఏసీబీ అధికారులు పథకం ప్రకారం పట్టుకున్నారు. ఎంవీఐ, హోంగార్డు, ఏజెంట్ ముగ్గురిపై ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేశారు.

శంకరాచార్యులకు జ్ఞానోదయం కలిగించిన ధీశాలి ఆచార్య చండాల

డా॥గూటం స్వామి

ఒక జాతి సంస్కృతికి మూలధనం ఆ జాతి ప్రజ్ఞాపాటవాల్లో ఉంటుందనేది నగ్నసత్యం. ఏ మట్టిలో సంస్కృతి వికసిస్తుందో, ఆ సంస్కృతిలో ఆ మట్టి పరిమళాలు వ్యాపించి ఉంటాయి. ఇది అన్ని జాతుల్లో కనిపించే అంశం. ప్రాచీన దళితజాతుల చరిత్ర ఎంతో విస్తృతమైంది. అందులో అనేక చారిత్రక సత్యాలు దాగుంటాయి. మరుగునపడిన దళితజాతుల చరిత్రను వెలికితీసి దానిని ముందుతరాలకు అందించాల్సిన బాధ్యత రచయితలపై తప్పక ఉంటుంది.

> **శంకరాచార్యులు ఒకరోజు గంగానదిలో స్నానంచేసి వస్తుంటే ఒక చండాలుడు నాలుగు కుక్కలను వెంటబెట్టుకొని ఆయనకు ఎదురుపడ్డాడు. దాంతో శంకరుడు చండాలుడిని చీదరించుకుని అడ్డు తొలగమన్నాడు. ఈ ఉదంతంతో శంకరుని మేధో పరిపక్వాన్ని అంచనా వేశాడు చండాలుడు. "నన్ను తొలగమంటావా? నాలో ఉన్న జీవుడ్ని తొలగమంటావా?" అని ఆచార్య చండాల ప్రశ్నించాడు. చండాల ప్రశ్న వినగానే శంకరాచార్యులు సిగ్గుపడిపోయాడు. చండాలుని కాళ్లపై పడ్డాడు.**

అలాంటి తాత్విక ఆలోచనలతో కూడిన గ్రంథమే "ఆదిగురువు ఆచార్య చండాల". రచయిత బొనిగల రామారావు పరిశోధనాత్మక రచనలు చేయడంలో అందెవేసిన చెయ్యి. భరతభూమి నడిబొడ్డున జరిగిన ఒక యథార్థ చారిత్రక సంఘటనను, సాంఘీక ప్రతిఘటనను గ్రంథస్థం చేసి ముందుతరాలకు అందించిన ప్రతిభాశాలి. శంకరాచార్యులకు జ్ఞానోదయాన్ని కలిగించిన ధీశాలి, మహామేధావి ఆచార్య చండాల గురించి రచయిత ఈ గ్రంథంలో సవివరంగా విశ్లేషించారు. శంకరాచార్యులు రచించిన "మనిషి పంచకం"లో తన గురువు ఆచార్య చండాల అని చెప్పుకున్న విషయం చాలా మందికి తెలియదు. చరిత్ర విస్మరించిన నగ్నసత్యాన్ని రచయిత అందరికి బహిర్గతం చేసి కుహనాచరిత్రకారుల దుమ్ము దులిపే ప్రయత్నం చేశారు. రాజకీయ, చారిత్రక, భౌతిక, తాత్త్విక, మేధోరంగాల్లో ప్రసిద్ధి చెందిన నగరం కాశీ. శంకరాచార్యులు ఒకరోజు గంగానదిలో స్నానంచేసి వస్తుంటే ఒక చండాలుడు నాలుగు కుక్కలను వెంటబెట్టుకొని ఆయనకు ఎదురుపడ్డాడు. దాంతో శంకరుడు చండాలుడిని చీదరించుకుని అడ్డు తొలగమన్నాడు. ఈ ఉదంతంతో శంకరుని మేధో పరిపక్వాన్ని అంచనా వేశాడు చండాలుడు. అంతకుముందు శంకరుని గురించి "అద్వైత్వాన్ని చాటిచెబుతున్న వేదాంతి" అని విన్నాడు. కానీ, శంకరునికి జ్ఞానోదయం కలిగించాలని ఆచార్య చండాల నిశ్చయించుకొని దారి తొలగమన్న శంక రునితో వాగ్వాదానికి దిగాడు. "నన్ను తొలగమంటావా? నాలో ఉన్న జీవుడ్ని తొలగమంటావా?" అని ఆచార్య చండాల ప్రశ్నించాడు. 'జీవుడు, దేవుడూ ఒక్కటే' అని అద్వైత సిద్ధాంతం బోధిస్తుంది. మరి అద్వైతాన్ని ప్రచారం చేస్తున్న శంకరుడికి 'అసలు అద్వైతం తెలుసా' అనే మీమాంస కలిగేలా చేశాడు. చండాల ప్రశ్న వినగానే శంకరాచార్యులు సిగ్గుపడిపోయాడు. చండాలుని కాళ్లపై పడ్డాడు. మన్నించమని అర్థించాడు. చండాలుని శిష్యునిగా చేరి ఆయన దగ్గర అనేక తాత్త్విక విషయాలు నేర్చుకున్నాడు (పుట 1-4). రచయిత బొనిగల రామారావు ఈ గ్రంథంలో ఈ విషయాన్ని సవివరంగా చర్చించారు. చరిత్రపుటల్లో మరుగున పడిపోయిన అనేక సత్యాలను బహిర్గతం చేశారు. 8వ శతాబ్దిలో జరిగినదని చెప్పబడుతున్న ఈ సంఘటనకు చారిత్రక ఆధారాలు రచయిత చూపించారు. శంకరున్ని చారిత్రక పురుషునిగా భావిస్తున్నప్పుడు, శంకరునికి గురువైన ఆచార్య చండాలను కూడా చారిత్రక పురుషునిగా అంగీకరించవలసిన విషయాన్ని రచయిత తన గ్రంథంలో నొక్కి పేర్కొన్నాడు.ఆదిగురువు ఆచార్య చండాల గురించి తెలుసుకునే ముందు శంకరాచార్యుల గురించి సంక్షిప్త వివరణ పొందుపర్చారు. అద్వైతి, హైంధవ మతావలంబీకులకు ఆరాధ్యుడు అయిన శంకరాచార్యులు శుద్ధభాష్యకారుడనీ, ఆయన జీవితంలో అనేక వైరుధ్యాలు ఉన్నాయనీ, రచయిత ఆధారాలతో వివరించడానికి ప్రయత్నించారు. అద్వైత సిద్ధాంతాన్ని ఆచార్య చండాల శిష్యరికంలో "శంకరుడు సానబట్టి మెరుగులు దిద్దినట్టుగా రచయిత పేర్కొన్నాడు (పుట-1). శంకరుని తల్లి, తండ్రి గురించి, అతని జన్మస్థలం, జనన సమయం, మరణస్థలం, సమాధి గురించి ఏఏ గ్రంథాల్లో ఎన్ని రకాలుగా చెప్పారో ఆధారాలతో సహా వివరించారు. చండాల శబ్దాన్ని ఈ గ్రంథంలో సవివరంగా చర్చించారు. "చండాల అనగా గొప్పశక్తి గలవారని మాత్రమే అర్థం. ఇంకా ఎలాంటి కుత్రపూరిత అర్థాలు హైంధవ మేధావులు తగిలించినా, అవన్నీ చిత్తశుద్ధితో నిర్వహించే పరీక్షలను తట్టుకుని నిలబడలేవు" (పుట-14) అని ఢంకా బజాయించి మరీ చెప్పారు రచయిత. అంతేకాదు చండాల అనగా భారతదేశంలో ఒక గొప్ప మేధావి, ఒక గొప్ప జ్ఞానతరంగం, మేధో తరంగం గురించి ఈ గ్రంథం రాస్తున్నానని ప్రకటించడం రచయితలోని ఆత్మవిశ్వాసానికి, మరుగున పడిపోయిన దళిత జాతి మేధావులపట్ల గౌరవానికి నిదర్శనంగా నిలుస్తుంది.తాత్వికరంగంలో పంచములు, చండాలురు ఒక్కరే. వీరు ఈ దేశ ఆది భారతీయులు. వీరు జ్ఞానశక్తికి అధిప తులని నిరూపించడానికి రచయిత ప్రయత్నించి సఫలీకృతు లయ్యారు. "భారతదేశంలో చలామణిలో ఉన్న హైంధవ సాహిత్యాన్ని, బ్రాహ్మణులు ఉన్మాదంతో రాసి పడేసిన సాహిత్యాన్ని నిశితంగా పరిశీలిస్తే తత్త్వశాస్త్ర రంగాన్ని ఆది భారతీయులు పండించారని, ప్రజల్ని భౌతికవాదం వైపు మరల్చారని అర్థమౌతుందంటాడు రచయిత" (పుట-15). సాంఖ్యతత్వం, చార్వాకతత్వాన్ని పరిశీలించినప్పుడు పంచభూతాలకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని రచయిత సమగ్రంగా విశ్లేషించాడు. పంచముడిని హైందవీకరించే క్రమాన్ని రచయిత వివరించిన తీరు ఆలోచింపజేసేదిగా ఉంది. పంచశక్తుల జననం, పంచకులాల నిర్ణయం, పంచబ్రహ్మల గోత్రాలు, సూత్రాలు, పంచబ్రహ్మల వాహనాలు, పంచబ్రహ్మల ఆసనాలు, పంచబ్రహ్మల హోమగుండాలు, పంచబ్రహ్మల యోగదండాలు, పంచబ్రహ్మల జంధ్యము, పంచబ్రహ్మల వివాహంబుల గురించి ఉన్నత ప్రాబల్యంతో వెలుగొందిన పంచమ, చండాల, పదాలు నేడు ఎంతగా దిగజార్చి ప్రయోగిస్తున్నారో రచయిత పరిశీలించమన్నాడు. ఆది భారతీయులే చండాలురని, వైదిక సాహిత్యం వీరిని ఎంత హీనంగా చిత్రించినా, ప్రాచీన కాలంలో చండాలుర అసలు విషయాన్ని విశ్లేషిస్తే వారి ప్రాముఖ్యత, పూర్వ వైభవం అర్థమౌతుందంటాడు రచయిత (పుట-20).

చండాలవారి జన్మవృత్తాంతాన్ని రచయిత వివిధ కోణాల్లో విశ్లేషించారు. క్రీ.శ.763లో ఆచార్య చండాల జన్మించినట్టు, ఆయన అసలు శక్తి నాగ అని, 18 సంవత్సరాల వయస్సుకే యోగం, సిద్ధం చార్వాక, లోకాయతులతోపాటు బౌద్ధ, జైన, సిద్ధాంతాలను ఔపోసన పట్టి నాగ విశ్వవిద్యాలయాల బహుముఖ ప్రజ్ఞాశాలురకు ప్రధానం చేసే 'చండాల' బిరుదునందుకుని 'ఆచార్య చండాల'గా ప్రసిద్ధి చెందినట్టు ఆధారాలతో సహా రచయిత వివరించడం రచయిత చారిత్రక పరిశోధనా శక్తికి నిదర్శనం. ఆచార్య చండాల దగ్గర శంకరాచార్యులు తాత్త్విక అంశాలు నేర్చుకున్న ఘట్టాన్ని సంభాషణా పూర్వకంగా వివరించిన తీరు చదవరులను ఆకట్టుకునే అంశం. ఐదు అధ్యాయాలుగా విభజించి రచించిన ఈ గ్రంథంలో శంకరాచార్యులు, చండాలుని ఉద్దేశించి రాసిన 'మనీషా పంచకం'లోని శ్లోకాలు ఎన్నదగిన అంశం. బొనిగల రామారావు అసాధారణ చారిత్రక పరిశోధనలో 'ఆదిగురువు ఆచార్య చండాల' వారి విషయాలు వెలుగులోకి రావడం ముదావహం. గతంలో ఆయన రాసిన "పల్నాటి చరిత్ర వీరుడు-మాల కన్నమనీడు", మాల-మాదిగల ప్రాచీన చరిత్ర, అంటరాని జాతుల చరిత్రకంటే భిన్నంగా ఈ గ్రంథ రచన సాగిందని చెప్పక తప్పదు. ■

ఐక్య పోరాటాలే మార్గం



గోపీనాథ్

లక్షలాది మంది ఆదివాసీల జీవితాలను ఫణంగా పెట్టి నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఇవాళ అత్యంత ప్రతిష్టాత్మకమైనది. వేల కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు బలితీసుకున్న జీవితాలెన్నో... బలితీసుకోనున్న జీవితాలింకెన్నో? కోస్తా కారిడార్‌లోని బహుళజాతి కంపెనీలకు నీళ్లిచ్చేందుకు చేపట్టిన ఈ ప్రాజెక్టు కింద లక్షలాది ఎకరాల అటవీ, వ్యవసాయ భూములు ముంపుకు గురవుతున్నాయి. ఊళ్లకు ఊళ్లు మునిగిపోతున్నాయి. లక్షలాది మంది నిర్వాసితులవుతున్నారు. ఈ విధ్వంసాన్ని ఇవాళ ప్రశ్నించేదెవరు? ప్రశ్నించే గొంతుల్ని నొక్కివేసేందుకు గత ప్రభుత్వాలు ప్రయోగించిన అణచివేత విధానాల్నే ప్రస్తుత ప్రభుత్వాలు ప్రయోగిస్తున్నాయి.

అమరుల త్యాగాలను మరిచి పాలకులు తన స్వార్థ ప్రయోజనాల కోసం ఎనిమిది మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టుపెట్టిన ఘనత తెలంగాణ సర్కారుది. లక్షలాది మంది జీవితాలను బలిపెట్టి ప్రాజెక్టు నిర్మిస్తున్న ఘనత ఆంధ్రా సర్కారుది. ప్రజా కంఠక పాలకులంతా ఒకటే అని నిరూపిస్తున్న వైనం కళ్లారా చూస్తున్నాం ఇవాళ. తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం 2014లో అధికారం చేపట్టిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పౌర, ప్రజాస్వామిక హక్కులను కాలరాసింది. రైతులకు అండగా ఉంటుందని చెప్పిన మాటలు నేడు రైతుల చేతులకు బేడీలు వేసిన ఘనత కేసీఆర్‌ది.

విద్యార్థులకు ఉచిత విద్య ఊసే లేకుండా పోయింది. తెలంగాణ వస్తే కొలువులు వస్తాయని కొట్లాడిన వారు ఇప్పుడు కొలువుల కోసం కొట్లాట చేయక తప్పడం లేదు. సభ పెట్టుకునే హక్కు లేకుండా చేస్తున్న ప్రభుత్వం, ధర్నా చౌక్‌లు ఎత్తివేసిన టీఆర్ఎస్ ప్రభుత్వం, కనీసం రాజ్యాంగ హక్కులు కూడా లేకుండా చేస్తున్నది. తెలంగాణలో ఎన్‌కౌంటర్లు ఉండవని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ అడవి అంతా రక్తం ఏరులై పారిస్తున్నాడు. ఏజెన్సీ ప్రాంతంలో పారా మిలిటరీ బలగాలను మోహరించి జంగల్‌ను జల్లడబట్టి, ఆదివాసులపై దాడులు చేసే చర్యలు చేపట్టారు. భూపాలపల్లి జిల్లాలోని గుత్తి కొయ్యలను చెట్టుకు కట్టేసి, ఆదివాసుల హక్కులను కాలరాస్తున్నారు. ప్రజాస్వామిక గొంతులు, ప్రజాస్వామిక హక్కులపై మాట్లాడే వరవరరావు లాంటి వారిపై అక్రమ కేసులు మోపి, జైల్లో నిర్బంధించారు. పోలవరం ప్రాజెక్టుకు, ప్రజలను తాకట్టు పెట్టి తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడమంటే తెలంగాణ అమరుల ఆశయాలను వమ్ముచేయడమే. ఇలాంటి వంచన పాలనలో మనమున్నాం. అమరుల ఆశయాలు నిజం కావాలంటే... పోరాటమే మనముందున్న మార్గం. ప్రజాస్వామిక తెలంగాణలోనే ప్రజల నిజమైన ఆకాంక్షలు నెరవేరుతాయి. అ దిశలో ఐక్య ఉద్యమాలు నిర్వహించి, ప్రజాస్వామిక తెలంగాణ సాధన కోసం పోరాటం చేయాలనేది మనముందున్న కర్తవ్యం.

సెల్ : 9666800045

ఎన్నికలు పల్లెలను ప్రగతి వైపు నడిపేనా...?



రాఘళ్ల ఉపేందర్

"తెలంగాణలోని గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడిగా నడుస్తున్నది. ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు రాజకీయ పార్టీలు కాలంతో పోటి పడి పనిచేస్తూ తమ సర్వశక్తుల్ని ఒడ్డాయి. దశాబ్దాల తరబడి పేరుకుపోయిన సమస్యలకు పరిష్కారాలు చూపే "గ్రామ స్వపరిపాలన" కోసం పల్లెలన్నీ ఆశగా ఎదురుచూస్తున్నాయి. తెలంగాణలో గడిచిన నాలుగున్నర ఏండ్ల తన పాలనలో విస్మరించిన హామీలను, ప్రజల ఆకాంక్షలను మరల సాధించుకునేందుకు రెండవసారి అత్యధిక మెజార్టీతో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వంపై గంపెడు ఆశలు, కోర్కెలతో వేచిఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో వచ్చిన ఈ స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. మన రాష్ట్రంలో 12,732 గ్రామ పంచాయతీల్లో 1,13,170 వార్డులకు, 1,49,52,058 మంది ఓటర్లతో ఎన్నికలు జరిగాయి. సమస్యలతో సతమతమౌతున్న పల్లెల్లో పార్టీల ప్రచార హోరు అధికార పీఠం కోసం అభ్యర్థుల పోరుతో రసవత్తరంగా మారింది. ఈ ఎన్నికలు అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిన పల్లెలను ప్రగతి వైపుకు నడిపేనా..? ఈ సారైన పరిపాలన పరమైన ఫలాలు ప్రజలకు పారదర్శకంగా అందేలా చూసేనా..? దశాబ్దాల తరబడి నెలకొన్న అనేక సమస్యలకు ఒక పరిష్కారాన్ని చూపెట్టేనా..?అనేది వేచిచూడాలి. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీల వైఖరి, డబ్బు, మద్యంతోపాటుగా అనేక ప్రలోభాలకు ప్రభావితమైన ప్రజలు ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాలను అభివృద్ధిపరిచే నిస్వార్థమైన, సమర్థవంతమైన నాయకత్వం కోసం ఎదురుచూసింది. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకోబడే మన ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్టీల జెండాలే తప్ప ప్రజా ఎజెండాలు ముందుకెళ్లే పరిస్థితులు కనబడటం లేదు. ఈ ఆధునిక పోటి ప్రపంచంలో అభివృద్ధిని కాంక్షించాల్సిన వ్యక్తులే నేడు అందలమెక్కి అందినకాడికి దోచుకుతినే వ్యూహరచనలో నిమగ్నమయ్యారు. రాజకీయ పార్టీలు వారి వ్యూహ, ప్రతివ్యూహాలు, ఎత్తులు, పొత్తులు, జిత్తులు, పై ఎత్తులతో ప్రజల్ని పూర్తిగా పక్కదారి పట్టించే రాజకీయ క్రీడలకు తెరలేపారు. ప్రజలు వారి సమస్యలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలకు పోరాడాలి. అభివృద్ధిని కాంక్షించి భావితరాల భవిష్యత్తును చూసి వేగంగా అడుగులు వేయాలి. కానీ నేడా పరిస్థితులు కనబడటం లేదు. మార్పుకోసం ప్రయత్నించాల్సిన పల్లెలన్నీ మనీ వేటలో మందుబాటలో మునిగి తేలుతున్నాయి. దీర్ఘకాలిక ప్రయోజనాల గురించి ఆలోచించాల్సిన జనం తాత్కాలిక ప్రయోజనాల కోసం తంటాలు పడే పరిస్థితులు వచ్చాయి. పార్టీలు ప్రజల్ని ప్రగతి వైపుకి చూడనీయకుండ, పైసల వైపుకే పరితపించి నడిపించే దుస్థితికి తెచ్చాయి. ప్రజల నిజాయితీని పక్కదారి పట్టించి ప్రలోభాల 'రొంపి'లోకి దించాయి. "పోటికి నిలబడితే ఏం చేస్తావు? ఎలా చేస్తావు? అని అడిగే పద్ధతులు పోయి, నీ వద్ద ఎన్ని పైసలున్నాయి?, ఎంత పెడతావు?, ఎంత ఇస్తావు?" అంటూ బహిరంగంగా మాట్లాడే దౌర్భాగ్యమైన దుస్థితి వచ్చింది. పార్టీలు కూడా అభివృద్ధికి పాటుపడే వ్యక్తుల విధానపరమైన ప్రవర్తన, పనివిధానం, నీతి, నిజాయితీలను పరిగణలోనికి తీసుకోకుండా అభ్యర్థుల కుల, ధన, బలాలు, బలగాలను బేరిజువేసుకొని ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. విలువలతో బతకాల్సిన విద్యావంతులు సైతం జెండా, ఎజెండాలేమి లేక ఎవరికి పడితే వారికి 'జైకొట్టే' ఆయోమయ పరిస్థితులు వచ్చాయి.

డా॥ బి.ఆర్. అంబేద్కర్ చెప్పినట్టుగా దేశం అభివృద్ధి చెందడమంటే అద్దాల మేడలు, రంగులగోడలు కాదు, పౌరుని నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి. ఆ నైతిక అభివృద్ధికి నిలయంగా, దేశాభివృద్ధికి కేంద్రంగా ఉండేవి గ్రామాలు. పల్లెలు ఆర్థికంగా, సామాజికంగా పరిపుష్టం చెందితేనే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయి. పల్లెసీమలు సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తేనే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుంది. అలా నడిపించే స్థాయిలోనే మన రాజకీయ వ్యవస్థ ఉండాలి. ప్రజాస్వామ్యయుతంగా, విశ్వజనీయమైన, స్వేచ్ఛయుత, నిష్పక్షపాత పద్ధతిలో ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా చూడాలి. ధనం, బలంతో సంబంధం లేకుండా చట్టం ప్రకారం ఒక సామన్యుడు కూడా, సమాజం కోసం పాటుపడేలా, ప్రజలకు సేవ చేసేలా, పార్టీలు సైతం వారినే గుర్తించి నిలబెట్టేలా ఉండాలి. గతకాలపు నష్టాన్ని, వర్తమానపు పురోగతిని, భవిష్యత్తు గమ్యస్థానాన్ని పునరాలోచించుకొని, నూతన లక్ష్యాలను, సవాళ్లను నిర్దేశించుకోవాలి. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిష్కారాన్ని చూపెట్టి ప్రజలను ప్రగతివైపుకి నడిపించేలా ఉండాలి. కానీ నేడవి వాటికి పూర్తి విరుద్ధంగా నడుస్తున్నాయి. ఒక సామాన్యుడికి రాజకీయాల్లో స్థానం లేదని స్పష్టంగా కనబడుతున్నది. ఇవన్నీ చూస్తుంటే పార్టీలైనా, ప్రజలైనా నేడు చూసేది ధనమే కానీ సేవచేసే గుణం కాదని నిరూపితమతుంది. ఇలాంటి వ్యవస్థతో పేద, మధ్యతరగతి ప్రజలకు రాజకీయ ఫలాలు, రాజ్యాంగ ఫలాలు అందకుండాపోతాయి. కాబట్టి ప్రజలు త్వరితగతినంగా మేల్కొని చైతన్యవంతం కావాలి.

"ఓటు" అనేది ప్రజాస్వామ్య వ్యవస్థలో పరిపాలనను నిర్దేశించే కీలకమైన రాజ్యాంగ పరమైన హక్కు. ఈ హక్కే నాయకుడి ఎంపికలో కీలకమైన నిర్ణయాత్మక శక్తిగా పనిచేస్తుంది. "నా జాతి ప్రజలకు కత్తిని ఆయుధంగా ఇవ్వలేదు.. 'ఓటు'ను ఆయుధంగా ఇచ్చాను. పోరాడి రాజులవుతారో? లేక ఓడిపోయి (అమ్ముకొని) బానిసలవుతారో తేల్చుకోవాలని ప్రజలకు బాబాసాహెబ్ సవాల్ విసిరారు. ఓటుహక్కును సాధించిన అనంతరం ఓటు అవశ్యకతను, అవసరతను ప్రజలు ఎప్పుడైతే గ్రహిస్తారో? సక్రమమైన మార్గంలో నిజాయితీగా వినియోగించుకుంటారో? అప్పుడు మీ గోడలపై కాదు గదా గుండెల్లో రాసిపెట్టుకోండి పాలితులుగా ఉన్న ప్రజలే, పాలకులవుతారని" అన్నారు.

సెల్ : 9573635356

డ్రైవింగ్ లైసెన్సు అందక వాహనదారుల ఇక్కట్లు



రావుల లావణ్య

ప్రతి వాహనదారుడు వాహన ధృవీకరణ పత్రంతోపాటు డ్రైవింగ్ లైసెన్సును విధిగా ఉంచుకోవాలని మోటారు వాహనాల తనిఖీ అధికారులు చెబుతున్నారు. ఇది రోడ్డు భద్రతా నియమాలలో అతి ముఖ్యమైనదని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో గత 7 నెలలుగా రిజిస్ట్రేషన్ కార్డులు అందటం లేదు. 5 నెలలుగా డ్రైవింగ్ లైసెన్సుల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగుతున్నారు. తెలంగాణలోని 31 జిల్లాలో ప్రతి రోజు డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్ కార్డులు జారీ చేయడం ఆపివేశారు. ఆగస్టు నెల నుండి కొత్త డ్రైవింగ్ లైసెన్సుల జారీ నిలిపి వేశారు. ఆన్‌లైన్ కార్డులు వాహనదారులు పొందినప్పటికి వాహనాల తనిఖీ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులకు చూపెట్టడానికి ఒరిజినల్‌కార్డులు లేకపోవటంతో వారు అసహనానికి గురి అవుతున్నారు. కొందరు ఎంవీఐలు ట్రాఫిక్ అధికారులు ఆన్‌లైన్ కార్డులు చూపిస్తే వదిలివేస్తున్నారు. మరికొందరు ఒరిజినల్ కావాలని అడుగుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్న సమయంలో మొబైల్‌లో కనెక్టు కాకపోతే తమ జేబులు ఖాళీ కావటం తప్పటం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ కార్డు ఓపెన్ కాకపోతే జరిమాన కట్టవల్సి వస్తోంది. ఒక్క కరీంనగర్ జిల్లాలో 7 ఆర్టీఏ కార్యాలయాల్లో మొత్తం 46 వేల కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. కార్డుల కాంట్రాక్టు పొందిన వారు డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్ లైసెన్సులను ప్రింట్ చేయడంలో జాప్యం చేయడంతో వాహనదారులు పరేషాన్ అవుతున్నారు. ప్రతి పని కంప్యూటర్ ద్వారానే చేస్తారు. రోజూ ఎన్ని వేల కార్డులైన ప్రింట్ చేసే అవకాశం ఉంది. కాని వాహనదారులు చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తున్నారు. ఇంటర్నెట్ యుగంలో డ్రైవింగ్ లైసెన్సు జారీపట్ల ఇంత జాప్యం విచారకరం.

సెల్ : 7780185674

ముగింపును చూపని 'మహానటి' సినిమా

రంగనాయకమ్మ

- 5 -

భార్యాబిడ్డలు వున్నవాడు, తన మీద ప్రేమ మాటలు వల్లిస్తోంటే, దాన్ని ఆమె, ఆ కృతజ్ఞతతోనే నమ్మి, తన జీవితాన్ని అతనికి అర్పించిందంటే, దాన్ని 'అమాయక త్వం'గా గుర్తించవలసిందే. సినిమా సావిత్రి, చిన్న పిల్లగా వున్నప్పుడు, ఆ పిల్ల సంభాషణలు, బాల్య సంభాషణలుగా వుండవు. "మా నాన్న పొడుగ్గా వుంటాడా, పొట్టిగానా? లావుగా వుంటాడా, సన్నగానా?" - ఇటువంటివే ఇంకా. ఈ కథ, కేవలం ఎవరికీ సంబంధం లేని సినిమా కట్టుకథ అయితే, అందులో ఎక్కడ ఎలా వున్నా దాన్ని సహించగలం. కానీ, ఇది నిజం సావిత్రి కోసం తయారుచేసిన కథ! ఈ చరిత్రలో ఆమెకి ఎక్కడా అవమానం జరగనివ్వకూడదు. నిజం సావిత్రి, ఇద్దరు భార్యలు వున్న వాడిని భర్తగా ఎంచుకోవడంలో చేసిన తప్పే గాక, ఆమె చేసిన ఇంకో పెద్ద తప్పు, తాగుడు సీసాని ఆలింగనం చేసుకోవడం! పిల్లల్ని, ఒళ్లో పెట్టుకుని పెంచుకోవలిసిన తల్లి చెయ్యవలిసిన పని కాదు అది. అంత విలాసాలతో గడపాలంటే, పిల్లల్ని కనకుండా వుండాలి. సావిత్రి పిల్లలకు, ఏం దక్కింది? తల్లికి వుండే కీర్తి వాళ్లకి కూడా అందింది గానీ, తల్లి పెంపకం అందలేదు. దాదాపుగా వాళ్లకి బాల్యం లేకుండా పోయింది. సావిత్రి కూతురు, తల్లి తమతో బాగానే గడిపేదని చెప్పిన వీడియోలు వున్నాయి గానీ, పిల్లల్ని పెంచడానికి, ఆ చిట్టి పొట్టి విషయాలే చాలవు. సావిత్రి, చిన్న వయసులో పెరిగిన కుటుంబంలో, పెద్దల పెత్తనాలలోనే పెరిగింది గానీ, తన గౌరవాన్ని గుర్తించు కునే, దాన్ని నిలుపుకునే అవగాహన ఏదీ సంపాదించలేదు. ఆమె పొందిన గ్నానం అంతా డబ్బు సంపాదనా, కీర్తి సంపా దనా! వాటితోపాటు తెలివిహీనంగా చేసే దాన ధర్మాలూ నూ! దాన ధర్మాలు తప్పు అని కాదు. అవి కూడా వివేకంతో జరగాలి. అలా జరగని ఆ దాన ధర్మాలు, ఆమె రక్షణకి చివరి కాలంలో, ఏ నాడూ పనికిరాలేదు.'దేవదాసు' కథలో, పార్వ తిగా అభినయించిన సావిత్రి, ఆ పార్వతి పాత్రలో వున్న ఆత్మ గౌరవాన్ని తెలుసుకోలేదు.'కన్యాశుల్కం' కథలో మధురవా ణిగా అభినయించినా, ఆ పాత్రకి వున్న సంస్కారం సావిత్రి నేర్చుకోలేక పోయింది.పదహారేళ్ల వయసు నించీ, 'డబ్బు ప్రపంచం'లో, 'కీర్తి ప్రపంచం'లో, 'విలాసాల ప్రపంచం'లో, పడిపోయింది. సంస్కారవంతమైన జీవితాల్ని చూడలేదు. నిజం సావిత్రి, నిజమైన అమాయకురాలు. ఎంత సున్నిత హృదయురాలైనా అగ్నానంలోనే పడిపోయింది. 'మహానటి' సినిమా కోసం తయారుచేసిన కథలో, సావిత్రి భర్త, మహా ఉత్తమ భర్త! అతనిలో ఎక్కడా కపట నటనని చూపించ లేదు. ఆ భర్తకి 'బల హీనతే' గానీ ఇంకేమీ కాదన్నట్టు, చివరి దాకా అతణ్ణి ఉత్తముడిగానే చూపించారు. అతని రెండో భార్య అయిన పుష్పవల్లినీ, ఆమె కుమార్తెనీ, ఒక్క సందర్భంలో ఫొటోలుగా కూడా చూపించక, ఆ నిజాల్ని దాపరికం చేశారు. ఈ 'మహానటి' సినిమాతో సంబంధం లేని ఒక బైటి విషయం: గణేషన్ కూతురు ఒకామె, ఒక వీడియోలో ఏం చెప్పిందంటే, తమ తండ్రి చాలా అందగాడనీ (హేండ్‌సమ్), అతడు అంత అందగాడు అవడం వల్ల ఎందరో ఆడవాళ్లు అతని మీద ఆకర్షణలో పడేవారనీ, ఆ విషయంలో తమ తం డ్రి తప్పేమీ లేదనీ, విచిత్రాతి విషయం చెప్పుకొచ్చి, ఆడవాళ్ల పరువంతా తీసింది!బుద్ధి లేని ఆడవాళ్లు వెంట పడితే మాత్రం, తన తండ్రి సంస్కారవంతుడిగా ప్రవర్తించలేడా? తన తల్లిని మోసం చెయ్యకుండా వుండలేడా? - ఇలా మాత్రం ఆ కుమార్తె ఆలోచించలేదు. తన భర్త అందగాడో కాదో ఆమె తేల్చలేదు. మొగవాళ్లు అందగాళ్లయితే, వాళ్ల వెంట ఆడవాళ్లు పడతా రనీ, ఆడవాళ్లే అందగత్తెలైతే, వా ళ్ల వెంట మొగవాళ్లు పడతారనీ, వెంటపడ్డ వాళ్లు వుంటే, వాళ్ల వెంట తిరిగేవాళ్ల తప్పేమీ వుండదనీ, ఆ కుమార్తె, తండ్రిగారి విధేయురాలిగా మాట్లాడింది గానీ, తల్లి వేపు కన్నెత్తి చూడలేదు! ఇదంతా ఇక అనవసరం.

సావిత్రి సినిమాలో వున్న ఆ జర్నలిస్టూ, ఆ ఫొటోగ్రాఫరూ కథ ఏమైంది? ఆ ఫొటోగ్రాఫరు కూడా ఒక సారి, రోడ్డులో ఒక బస్సో ఏదో ఎక్కి, గణేషన్ ప్రకటించినట్టే, తన ప్రేమని అరుస్తూ ప్రకటించాడు. జర్నలిస్టు అమ్మాయి సావిత్రి కథ అంతా వినేసి, తమ ఇంటికి తిరిగి వచ్చాక, ఆమెకి గత పెళ్లిచూపుల అబ్బాయితో పెళ్లి జరగాలనే మాటల తతంగం మళ్లీ జరిగింది. కానీ ఈమె, ఫొటోగ్రాఫర్ మీద దృష్టితో వుంది కాబట్టి, పాత పెళ్లిచూపుల అతన్ని తిరస్కరించినట్టు ప్రకటించింది. దానికి ఆమె తండ్రిగారి కేకలూ! ఆమెకి ఫొటోగ్రాఫర్ ఇంటి నించీ ఒక శుభలేఖ వచ్చింది. అది, అతని చెల్లెలి పెళ్లి శుభలేఖ. దాన్ని, ఈ జర్నలిస్టు పిల్ల, చదవనే చదవదు. ఆ శుభలేఖని, ఫొటోగ్రాఫర్ పెళ్లిగానే సందేహించేసింది. ఆ శుభలేఖలో అతని పేరు వుందో లేదో అయినా చూడదు. గంట కింద దాకా ప్రేమించేసిన వాడి మీద పెద్ద అనుమానం! అతన్ని అడగాలనో ఏమో, ఆ పెళ్లి జరిగే చర్చికి వెళ్తుంది. అక్కడ తెలుస్తుంది, ఆ పెళ్లి, ఫొటోగ్రాఫర్ చెల్లెలిది - అని! ఇక, తర్వాత సంబరం! చేతికి అందిన శుభలేఖలో పేర్లు కూడా చూడకుండా అనుమానాల్లో పడిపోయిన ఈ జర్నలిస్టు పిల్ల, నిజం సావిత్రి జీవిత చరిత్రని చక్కగా రాస్తుందట! అందులో ఎన్ని కల్పనలు చేరతాయో కదా?ఈ జర్నలిస్టు పిల్ల ప్రేమ కథని, సావిత్రి విషాద గాథతో జత పరచడమా? అసలు సావిత్రి చరిత్రలో, జర్నలిస్టు పాత్ర ఎందుకు? పూర్తిగా అనవసరం! దండగ! సావిత్రి జబ్బు మీద వుండవలిసిన దృష్టి, జర్నలిస్టు పెళ్లి మీదకి పోవడమా? సావిత్రి సినిమాలో, ఆమె చరిత్ర చివరికి ఆమె కోమాలో వుండడంతో మాత్రమే ముగిసింది. కానీ, ఏ మనిషి చరిత్రకి ముగింపు అయినా, ఆ మనిషి మరణంతోనే! సావిత్రిని, కోమాలో వుండగానే వదిలేస్తే, అది ముగింపు అవదు. కోమాలో పడిన రోగుల్లో కొందరు తిరిగి లేచి సుఖంగా జీవించిన వార్తలు విన్నాం.కోమాయే సావిత్రికి ముగింపు - అని ఎలా నమ్మాలి? అందుకే, అసలు ముగింపుని కూడా చూపించాలి. 'అంత్యక్రియలే' చివరి ఘట్టం కావాలి. అగ్ని జ్వాలలతో సావిత్రి దేహం లీనమైపోవడం కనపడాలి! అదీ, సావిత్రి చరిత్రకి అంతం! సినిమాల్లో, ఆ ముగింపు దృష్టి లేదు. జర్నలిస్టు పిల్ల పెళ్లిచూపుల ముచ్చట్ల దృష్టి తప్ప! చివరికి ప్రేక్షకులు, సావిత్రిని వదిలేసి, ఆ జర్నలిస్టు ప్రేమ గెలుపుని తల్చుకుంటూ ఇళ్లకు వెళ్లాలి! ఇదీ 'మహానటి' సినిమా, నిజం సావిత్రికి చేసిన సన్మానం! 'మహానటి'లో, సినిమా సావిత్రిని మాత్రమే చూడగలం! నిజం సావిత్రిని కాదు.

(అయిపోయింది)

ఆకలి కేకలతో అల్లాడుతున్న భారత్



సిహెచ్ కనకదుర్గ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పోటీపడుతూ పురోగమనం వైపు మళ్లుతున్నా మన దేశంలో చాలామందికి ఆహారం అందక అనారోగ్యంతో మరణిస్తున్నారన్నది అత్యంత ఆందోళన కలిగించే విషయం. ఇండియాస్టేట్ హంగర్ ఇండెక్స్ పరిశోధనలో ప్రకటించినట్టుగా సుమారుగా 40 కోట్ల మందికి తిండి దొరక్క ఆకలి మంటలతో అలమటించడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం. దేశంలో పారిశ్రామికీకరణ జరిగి ఆర్థికాభివృద్ధి జరుగుతున్నా, అధిక ఆహార ధాన్యాల ఉత్పత్తి కొనసాగుతున్నా, కొన్ని కోట్ల మందికి పట్టెడన్నం దొరకకపోవడం చాలా బాధాకరమైన విషయం. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటినా ప్రజల కనీస అవసరాలైన కూడు, గూడు, బట్టలు ప్రతి పౌరుడికీ అందాలని రాజ్యాంగం గుర్తించినా ఆహార భద్రతను కల్పిస్తున్నామని ప్రభుత్వాలు డాంబికాలు పలుకుతున్నా, ఆకలిచావులు తగ్గకపోవడం ఈ వ్యవస్థ వైఫల్యానికి మచ్చుతునక. ఒకవైపు పేదరికం, రెక్కాడితేనే గాని డొక్కాడని దుస్థితి, దానికితోడు నిత్యావసర ధరలు ఆకాశానికి పాకడంతో మన దేశ జనాభాలో దాదాపు 12 కోట్ల మందికి రోజూ భోజనం లభించడం మగ్యమైపోతోంది. ఈ ఆహార సమస్యను అధిగమించదానికి, కనీసం 40 కోట్ల మంది కడుపు నింపదానికి, 2013లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆహార భద్రతా చట్టం ఆశించిన ఫలితాలను అందించడంలో విఫలమైంది. ఈ చట్టం కింద పేదలకు నిత్యావసరాలైన బియ్యం, గోధుమలు వంటి రాయితీ సరుకులను అందించడానికి ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ప్రజా పంపిణీ వ్యవస్థపై ఖర్చు చేస్తున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ లొసుగులమయమై రాయితీ సరుకులు నల్ల బజారుకు తరలిపోవడంతో పేదల కడుపులు మలమలా మాడిపోతున్నాయి. 12 లక్షల ప్రభుత్వ పాఠశాలలలో 15 కోట్ల మంది పేద ప్రజల ఆకలి తీర్చడానికి వారిలో పౌష్టికాహార లోపం నివారించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. బాలింతలకు, గర్భిణులకు 6 సంవత్సరాలలోపు చిన్న పిల్లలకు ఉచిత వైద్య, పౌష్టికాహార సదుపాయాలు కల్పించడానికి 1975లో ప్రారంభించిన సమగ్ర శిశు సేవా పథకాన్ని (ఐసీడీఎస్) కింద 13.56 లక్షల అంగన్‌కేంద్రాలను ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. కాని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే ఆహారంలో నాణ్యత కొరవడటం, పర్యవేక్షణా లోపంతో ఆశయం గొప్పదైనా ఫలితాలు శూన్యంగా వుంటున్నాయి. మనదేశాన్ని పట్టి పీడిస్తున్న జఠిలమైన సమస్యలు పౌష్టికాహార లోపం, రక్త హీనతలను ఎదుర్కోవడంలో దశాబ్దాల తరబడి పాలకుల ఘోర వైఫల్యం కండ్లారా కనిపిస్తోంది. ప్రజా పంపిణీ ద్వారా బియ్యం మాత్రమే లభ్యం కావడంతో, కూరగాయలు, నూనెలు, ఇతర నిత్యావసర సరుకుల ఆకాశయానం చేస్తుండటంతో కూలికి వెళ్లిన పేదలు పని దొరక్క, దొరికిన పనికి కనీస వేతనాలు అందక, ఎక్కువ మంది జనాభా రోగాలపాలవుతున్నారు. మన దేశ జనాభాలో 14.5 శాతం పౌష్టికాహారలోపం, 51.4 శాతం రక్తహీనత, 38 శాతం పిల్లలలో బరువు ఎక్కువ లేక తక్కువ వంటి లోపాలతో బాధపడుతున్నారని జాతీయ సమగ్ర పౌష్టికాహార సంస్థ వెలువరించిన నివేధిక భయాందోళనలకు గురి చేస్తోంది. మన దేశంలో మరొక పెద్ద సమస్య ఆహార నష్టం. గోదాములలో నిల్వ వుంచిన బియ్యం, గోధుములు పండ్లు, కూరగాయలు పాడైపోయి, పురుగులు పట్టి వృథా అయిపోతున్నాయి. విందులు, వినోదాలలో లక్షల రూపాయల విలువైన ఆహార పదార్థాలు ఏమీ కాకుండా చెత్త కుండీలలో పారబోయడం అత్యంత బాధాకరమైన విషయం. ఈ సమస్య మరింత తీవ్రతరం కాక ముందే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సామాజిక వేత్తలు, కార్పొరేట్ సామాజిక సంస్థలు ముఖ్యంగా ప్రజానీకం కలిసికట్టుగా, సమైక్యంగా వీటి నివారణకు కృషి చేయాలి.

సెల్ : 7674887456

ఆర్థిక వ్యవస్థకు పల్లెలే ప్రాణాధారం



శ్రీనివాస్ చిరిపోతుల

భారతదేశం వ్యవసాయ అనుబంధ రంగాలతో ముడివడిన వృత్తులు, సేవలు క్రమంగా బలహీనపడుతున్నాయి. పల్లె ఆర్థికం పట్టు తప్పడానికి కారణాలు అనేకం. నగర ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల అభివృద్ధిపైనే మోడీ ప్రభుత్వం పూర్తిగా దృష్టి కేంద్రీకరించింది. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రూపకల్పనలో కొన్ని మౌలిక లోపాలతోపాటు, క్షేత్రస్థాయిలో దాని అమలు అస్తవ్యస్తంగా ఉండడంతో గ్రామీణ వస్తు పంపిణీ వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆరో దశకం నుంచీ పల్లెల ద్వారా దేశ ఆర్థికానికి నికరంగా దాఖలు పడుతున్న మొత్తం తగ్గుతున్నప్పటికీ, వ్యవసాయ ఆధారిత రంగాల ప్రభావం మాత్రం క్రమంగా పెరుగుతోంది. జాతీయ నమూనా సర్వే సంస్థ అంచనాల ప్రకారం భారతదేశంలో 57 శాతం గ్రామీణ కుటుంబాలు వ్యవసాయ, సంబంధిత రంగాల్లో పనిచేస్తున్నారు. వ్యవసాయేతర కార్యకలాపాలవైపు అనేకుల దృష్టి మళ్లుతున్న మాట నిజమే. అయితే ఈ కార్యకలాపాలు విజయవంతంగా అమలు కావాలంటే గ్రామాల్లో సేద్యం బాగుండాలి. వ్యవసాయం నుంచి చక్కటి ఆదాయం పొందుతూ వస్తు, సేవలకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయగల వాతావరణం ఏర్పడాలి. జీఎస్టీ లోపాల కారణంగా సంఘటిత రంగం సమస్యల పాలైంది. లావాదేవీల ఖర్చు ఉన్నపళంగా పెరిగిపోయింది. చిన్న కంపెనీలకు సంబంధించినంత వరకూ వ్యాపార, వాణిజ్యాల నిర్వహణ వ్యయమూ ఇనుమడించింది. జీఎస్టీ అమలు గ్రామీణ కుటుంబాల జీవికను ఒడిదుడుకులపాలు చేసింది. మరోపక్క అసంఘటిత రంగానికి తలెత్తిన సమస్యల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. జీఎస్టీ పెంచడం వల్ల టెలిఫోన్ బిల్లులు, బీమా చెల్లింపులు, డీటీహెచ్ రీచార్జీలు, టికెట్ల కొనుగోళ్లు వంటి వందలాది నిత్యావసర సేవలు భారమయ్యాయి. రైతాంగం ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు తగిన ధర రాక రైతన్న పూర్తిగా డీలాపడిపోయిన సమయాల్లో తీరిగ్గా రంగంలోకి దిగిన ప్రభుత్వ సంస్థలు కంటితుడుపు మద్దతు ధరలు ప్రకటించి వారిని ఆదుకునేందుకు చేసిన ప్రయత్నాలు కొరగానివిగా మిగిలిపోయాయి. ఉత్పత్తి వ్యయాలు ఏ మాత్రం తగ్గడం లేదు. దేశంలో వ్యవసాయ ట్రాక్టర్లలో సమస్యలు తలెత్తితే వాటిని బాగుచేసే దుకాణాలు, ట్రాక్టర్లకు సంబంధించిన విడి భాగాలను విక్రయించే వ్యవస్థలు కొంతకాలంగా మూతపడుతున్నాయి. వ్యవసాయ వస్తు ఉత్పత్తుల ధరలు దారుణంగా పడిపోవడంతో రైతులు దాదాపుగా అన్ని రకాల అదనపు కొనుగోళ్లు నిలిపివేశారు. స్వాతంత్ర్యానంతరం కాలం గడిచేకొద్దీ భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సమీకరణల్లో ఆసక్తికర మార్పులు చోటు చేసుకున్నాయి. ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమై పల్లెలు తల్లడిల్లుతుంటే వాటిని ఆదుకునేందుకు, రైతులకు స్వాంతన చేకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి క్రియాశీల చర్యలూ చేపట్టలేదు. ఎంతసేపు నగరాల్లో మౌలిక సౌకర్యాలు వృద్ధి చేయడం మీదనే కేంద్ర సర్కారు దృష్టి పెడుతోంది. ఇప్పటికైనా తక్షణ దిద్దుబాటు చర్యలపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టకపోతే దేశ ఆర్థిక వ్యవస్థ మరిన్ని సమస్యల్లో కూరుకుపోయే ప్రమాదమూ లేకపోలేదు. దీన్ని ఆయా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలి.

సెల్ : 9603471199

రచయితలకు సూచనలు

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. ప్రత్యేక సందర్భానికి సంబంధించిన వ్యాసమైతే దానిని గురించి కవరింగ్ లెటర్ రాయండి. వ్యాసం మొదటి పేజీ మీద పంపిస్తున్న తేదీ వేయండి.

వ్యాస రచయితలు తమ వ్యాసంతోపాటు పూర్తి పోస్టల్ చిరునామా కూడా పంపించాలని కోరుతున్నాం. ఇప్పటికే వ్యాసాలు పంపినవారు కూడా తమ అడ్రెస్‌లు పోస్టల్ ద్వారా గానీ, మెయిల్ ద్వారా గానీ పంపించాలని మనవి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020. Ph:27665420,27673787,9490099077/78. Fax:040-27652228



ఉదయ్‌కుమార్, ఈశ్వర్, అచ్చిరెడ్డి, నరేష్, ఎస్వీకృష్ణారెడ్డి, టువ, అంకిత, భీమ్స్, రఘురాజ్ తదితరులు

వైభవంగా 4 లెటర్స్ ఆడియో ఆవిష్కరణ

ఈశ్వర్‌ని కథానాయకుడిగా పరిచయం చేస్తూ శ్రీ చక్ర క్రియేషన్స్ పతాకంపై దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మించిన చిత్రం '4 లెటర్స్'. కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే.. అనేది ఉపశీర్షిక. అంకిత, టువ హీరోయిన్లుగా నటించారు. ఆర్.రఘురాజ్ దర్శకత్వం వహించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్ర ఆడియో ఆవిష్కరణ బుధవారం హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగింది.

నిర్మాత జెమిని కిరణ్ సంస్థ లోగోను ఆవిష్కరించగా, దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి సినిమాకి సంబంధించి కొత్త ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. నిర్మాత అచ్చిరెడ్డి, ఎస్వీకృష్ణారెడ్డి ఆడియో బిగ్ సీడీని సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ,'అమెరికాలో సైటిలైన ఫ్యామిలీ మాది. 21 ఏండ్లుగా అక్కడే ఉంటున్నాం. మా అబ్బాయిని డాక్టర్ చేయాలనుకున్నాం. అయితే తను యాక్టర్ అవుతానని చెప్పడంతో సత్యానంద్‌గారి దగ్గరికి పంపాను. సినిమాలపై ఉన్న ప్రేమతో ఈ చిత్రాన్ని తీశాం. ఇంజనీరింగ్ నేపథ్యంలో తీసిన ఈ సినిమాని ఫిబ్రవరి 8న విడుదల చేయాలనుకుంటున్నాం. ట్రైలర్స్, సాంగ్స్ చూసి అందరూ మా అబ్బాయి బాగా చేశాడని అంటుంటే ఎంతో సంతోషంగా ఉంది. ఈ సంస్థలో మరిన్ని సినిమాలు, కొత్తవారితో సినిమాలు తీయాలనుకుంటున్నాం' అని చెప్పారు.

'నేను అమెరికాలో చదువుకున్నాను. సినిమాలంటే ఎంతో ఇష్టం. ఆ ఇష్టంతోనే ఈ రంగంలోకి వచ్చాను. అయితే ఇక్కడికి వచ్చినప్పుడు కొంచెం నెర్వస్‌గా ఉండేది. దర్శకుడు రఘురాజ్‌గారితో మాట్లాడితే షూటింగ్ స్టార్ట్ అయ్యే రెండు నెలల ముందు వర్క్‌షాప్ చేద్దామన్నారు. మా దర్శకుడు నాకు బాడీ లాంగ్వేజ్, వర్క్ డిసిప్లేన్ అన్ని నేర్పించారు. నేను సత్యానంద్‌గారి దగ్గర నటనలో శిక్షణ తీసుకున్నాను. మా ఫ్యామిలీలో అందరూ నన్ను సపోర్ట్ చేశారు' అని కథానాయకుడు ఈశ్వర్ అన్నారు. 'సినిమా షూటింగ్‌ని 75 రోజుల్లో పూర్తి చేయటానికి కారణం మా టీమ్. మంచి మేసేజ్‌తో తీసిన సినిమా ఇది. ఇంజనీరింగ్ నేపథ్యంలో రూపొందిన ఈచిత్రాన్ని ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌కి అంకితం ఇస్తున్నాం. సినిమా సెకండాఫ్‌లో డిఫరెంట్ పాయింట్‌ని టచ్ చేశాం. 'లవ్ ఎట్ సెవెన్ లుక్స్' కాన్సెప్ట్‌తో ఈ సినిమా చేశాను. నిర్మాతలు బాగా సపోర్ట్ చేశారు. నేను అడిగిన ఆర్టిస్టులను ఇచ్చారు. ప్రేక్షకులకు ఈ సినిమా కచ్చితంగా నచ్చుతుంది' అని దర్శకుడు ఆర్.రఘురాజ్ తెలిపారు. ఈ వేడుకలో శివాజీరాజా, ఎస్వీకృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, చంద్రబోస్, సంగీత దర్శకుడు భీమ్స్, సీనియర్ నటుడు నరేష్, కొరియోగ్రాఫర్ గణేష్, నిర్మాత బెక్కం వేణుగోపాల్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.



మేఘ్లాముక్తా, తనిష్క్‌రెడ్డి, అలెక్సా

అన్ని వర్గాలనూ అలరించే సినిమా

తనిష్క్‌రెడ్డి, మేఘ్లాముక్తా హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'సకల కళా వల్లభుడు'. బీరం సుధాకర్ రెడ్డి సమర్పణలో సింహా ఫిలిమ్స్, దీపాల ఆర్ట్స్ పతాకాలపై శివగణేష్ దర్శకత్వంలో ఈచిత్రం రూపొందింది. ఫిబ్రవరి 1న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చిత్ర నిర్మాతలు అనిల్, శ్రీకాంత్ మాట్లాడుతూ,'యాక్షన్, కామెడీలతోపాటు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈచిత్రం ఫిబ్రవరి 1వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రానికి హీరో నటన, కథ, కథనాలు హైలైట్‌గా నిలువనున్నాయి. సినిమాలో నటించిన ఏ ఒక్కరూ కొత్తవాళ్ళలా అనిపించరు. అంత అద్భుతంగా నటించారు. హీరో తనిష్క్‌రెడ్డి అయితే ఆయనలో ఉన్న ప్రతి టాలెంట్‌ను టైటిల్‌కి తగ్గట్టు బెస్ట్ పెర్ఫామెన్స్ ఇచ్చారు. భవిష్యత్‌లో ఆయన పెద్ద స్టార్ అవుతాడు. అతనితో మరిన్ని సినిమాలు చేయాలనుకుంటున్నాం' అని చెప్పారు. 'సినిమా చాలా బాగా వచ్చింది. నిర్మాతల సపోర్ట్ లేకపోతే ఇంత బాగా వచ్చేది కాదు. ఈ ఏడాదిలో తప్పకుండా హిట్ సినిమా అవుతుంది' అని దర్శకుడు అన్నారు. 'సినిమా కథలో కంటెంట్ ఉంటే ఆదరించి సపోర్ట్ చేసే సినిమా ప్రముఖులు చాలా మందే ఉన్నారు. అలా మా సినిమాకి సపోర్ట్ చేయడానికి వచ్చిన వ్యక్తే బీరం సుధాకర్‌రెడ్డిగారు. ఆయనకు మా నిర్మాతలు తోడై ఖర్చుకు వెనుకాడకుండా సినిమాని చాలా రిచ్‌గా నిర్మించారు. దర్శకుడు శివ ఈచిత్రాన్ని అత్యద్భుతంగా తెరకెక్కించారు. వంద థియేటర్లలో సినిమా విడుదల కానుంది. ప్రేక్షకులు మా సినిమాని ఆదరించాలని కోరుకుంటున్నాను' అని కథానాయకుడు తనిష్క్‌రెడ్డి చెప్పారు.



బండి సరోజ్ కుమార్

పోలీస్, గ్యాంగ్‌స్టర్‌ల యుద్ధం

బండి సరోజ్ కుమార్ అన్నీ తానై రూపొందించిన చిత్రం 'సూర్యాస్తమయం'. ఓజ్ మీడియా పతాకంపై రఘు పిల్లుట్ల, రవికుమార్ సుదర్శి సంయుక్తంగా సినిమాని నిర్మిస్తున్నారు. 'ఉరిమే మేఘం స్నేహం, కురిసే వర్షం స్నేహం..' అనే పాటకి మంచి స్పందన లభించింది. ఇదొక నేచురల్ యాక్షన్ ఎంటర్‌టైనర్. ఒక పోలీస్‌కి, గ్యాంగ్‌స్టర్‌కి మధ్య జరిగే అంతర్యుద్ధం చిత్ర ప్రధాన కథాంశం. పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో నేను, గ్యాంగ్‌స్టర్‌గా త్రిశూల్ రుద్ర నటించాం. డేనియల్ బాలాజీ కీలక పాత్ర పోషిస్తున్నారు. హైదరాబాద్, వికారాబాద్, నల్గొండ, రామోజీ ఫిల్మ్ సిటీ, కడప, కర్నాటకలో చిత్రీకరించాం. ఫిబ్రవరి ద్వితీయార్థంలో సినిమాని రిలీజ్ చేస్తాం' అని సరోజ్‌కుమార్ చెప్పారు.

నవచిత్రం

జయంత్ సినిమాలో ది గ్రేట్ ఖలీ



రెజ్లర్ ఖలీ

ఇండియన్ వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్ రెజ్లర్ ది గ్రేట్ ఖలీ టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. దర్శకుడు జయంత్ సి.పరాన్జీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నరేంద్ర' చిత్రంలోని ఓ కీలక పాత్రలో ఆయన నటించబోతున్నారు. ఈ ఏడడుగుల రెజ్లర్ ఇప్పటికే పలు హాలీవుడ్ సినిమాల్లో, అమెరికన్ టీవీ షోల్లో మెరిశారు. అలాగే 'బిగ్ బాస్' సీజన్ 4లో కూడా కనిపించి ప్రేక్షకులను అలరించారు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో నీలేష్ ఎటి, ఇజబెల్లా జంటగా నటిస్తున్నారు. ఇండియా, పాకిస్తాన్ నేపథ్యంతో సినిమా రూపొందనుండటంతో ఇస్లామిక్ దేశంలో చిత్రీకరణ జరిపేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తయ్యింది. ఈ సినిమాతో బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ రామ్ సంపత్ తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. ఇషాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈచిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : హరీష్ కోయలగుండ్ల, కెమెరా : వీరేన్ తంబిదొరై, సంగీతం: రామ్ సంపత్, ఎడిటింగ్ : మార్తాండ్.కె.వెంకటేష్, డైలాగ్స్ : హరీష్ కోయలగుండ్ల, ఫైట్స్: వెంకట్.



ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రం



వి.వి.వినాయక్, అనురాగ్ కొణిదెన

అనురాగ్ కొణిదెన హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'మళ్ళీ మళ్ళీ చూశా'. క్రిషి క్రియేషన్స్ పతాకంపై సాయి దేవ రామన్ దర్శకత్వంలో కొణిదెన కోటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్వేత అవస్తి, కైరవి తక్కర్ హీరోయిన్‌లుగా నటిస్తున్న ఈ చిత్రానికి శ్రవణ్ భరద్వాజ్ సంగీతం అందించారు. ఈ చిత్రంలోని 'చినుకే నాకే చూపే' అనే పల్లవిగల పాటను ఆదిత్య మ్యూజిక్ ద్వారా ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ఈ చిత్రంలోని పాట వినసొంపుగా ఉంది. ట్రైలర్ సైతం అందంగా అందరికీ మరింత దగ్గరయ్యేలా ఉంది. హీరో అనురాగ్ స్క్రీన్ ప్రెజెన్స్, లుక్స్ చాలా బాగున్నాయి. టీమ్ అందరికీ ఆల్ ద బెస్ట్' అని చెప్పారు. 'ప్రేమకు ప్రకృతి తోడైతే ఎంతో అందంగా ఉంటుందనే కాన్సెప్ట్‌తో తీసిన సినిమా ఇది. శ్రవణ్ సంగీతం, సతీష్ ముత్యాల సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి ఎసెట్స్. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి' అని దర్శకుడు సాయి దేవ రామన్ తెలిపారు. 'మా చిత్రంలోని తొలి పాటను సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ రిలీజ్ చేయటం ఎంతో ఆనందంగా ఉంది. మనసుకు హత్తుకునే ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రమిది' అని నిర్మాత కొణిదెన కోటేశ్వరరావు అన్నారు. 'వి.వి.వినాయక్‌గారు మా చిత్రంలోని తొలి పాటను విడుదల చేయటం చాలా సంతోషంగా ఉంది. తెలుగులో చాలా రోజుల తర్వాత వస్తున్న ఫీల్‌గుడ్ లవ్ స్టోరీ ఇది. కథే ఈచిత్రానికి ప్రధాన బలం. ప్రేక్షకులు మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే ప్రేమకథా చిత్రమిది' అని కథానాయకుడు అనురాగ్ చెప్పారు. 'బిజీగా ఉన్నప్పటికీ అడగ్గానే మా చిత్రంలోని పాటను లాంచ్ చేసిన ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్‌గారికి ధన్యవాదాలు. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే రీతిలో ఈ చిత్రం ఉంటుంది' అని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సాయిసతీష్ పాలకుర్తి అన్నారు. ఈటీవీ ప్రభాకర్, టి.ఎన్.ఆర్, మిర్చి కిరణ్, అప్పాజీ, బ్యాంక్ శ్రీను, మధుమణి, పావని, ప్రభావతి, జయలక్ష్మి, రీతూచౌదరి తదితరులు నటించిన ఈచిత్రానికి సంగీతం: శ్రవణ్ భరద్వాజ్, కెమెరా : సతీష్ ముత్యాల, మాటలు : హేమంత్ కార్తీక్, ఎడిటింగ్ : సత్య గిడుతూరి, పాటలు : తిరుపతి జావాన, ఆర్ట్ : సుమిత్ పటేల్.

డిఫరెంట్ హర్రర్ కామెడీ ఎంటర్‌టైనర్



లక్ష్మీరాయ్

లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'వేర్ ఈజ్ వెంకటలక్ష్మి'. రామ్‌కార్తీక్, పూజిత పొన్నాడ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం గురించి చిత్ర బృందం తెలియజేస్తూ, 'హర్రర్ కామెడీగా తెరకెక్కుతున్న చిత్రమిది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల విడదలైన 'పాపా నీకేదంటే ఇష్టం..' పాటకు మంచి స్పందన లభించింది. మాస్ హంగులు జోడించి ఈ పాటను చిత్రీకరించారు. ఇప్పటికే రిలీజైన ఫస్ట్‌లుక్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే టీజర్‌ని విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి ప్రవీణ్, మధునందన్‌ల కామెడీ హైలైట్‌గా నిలుస్తుంది. హరి గౌర అందిస్తున్న సంగీతం, వెంకట్ ఆర్.శాఖమూరి కెమెరా పనితనం ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయి. ఏబీటీ క్రియేషన్స్ పతాకంపై గురునాథ్‌రెడ్డి సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఎం.శ్రీధర్‌రెడ్డి, హెచ్.ఆనందరెడ్డి, ఆర్కే రెడ్డి నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి మార్చిలో సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు' అని తెలిపింది. రాయ్‌లక్ష్మీ, ప్రవీణ్, మధునందన్, రామ్‌కార్తీక్, పూజిత పొన్నాడ, బ్రహ్మాజీ, పంకజ్ కేసరి, అన్నపూర్ణమ్మ, జబర్దస్త్ మహేష్, జెమినీ సురేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ,కథనం,మాటలు: తాటపర్తి కిరణ్, ఎడిటింగ్ : ఎస్.ఆర్.శేఖర్, ఆర్ట్ : బ్రహ్మకడలి, ఫైట్స్ : రామ్ సుంకర, డాన్స్ :శేఖర్.

ఓషో శిష్యురాలు మా ఆనంద్ షీలాగా..!

'రెగ్యులర్‌గా చేసే సినిమాలు కాకుండా ఇకపై డిఫరెంట్ కథ, కథనాలతో ఉండే చిత్రాల్లో నటించాలని డిసైడ్ అయ్యాను. అంతేకాకుండా బయోపిక్స్‌లోనూ నటించేందుకు ప్రిపేర్ అవుతున్నాను. ఇందులో భాగంగా ప్రస్తుతం ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఓషో శిష్యురాలు మా ఆనంద్ షీలా జీవితం ఆధారంగా రూపొందబోయే హాలీవుడ్ చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాను' అని చెబుతోంది ప్రియాంక చోప్రా. ప్రియుడు నిక్ జోనాస్‌తో పెళ్ళి తర్వాత ప్రియాంక పచ్చ జెండా ఊపిన తొలి హాలీవుడ్ ప్రాజెక్ట్ ఇది. ఈ ప్రాజెక్ట్ గురించి ప్రియాంక మాటల్లోనే, 'చాలా రోజుల తర్వాత నా సినిమాకి సంబంధించి వార్తలు రావడం ఆనందంగా ఉంది. ప్రముఖ అమెరికన్ దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత బ్యారీ లెవిసన్ దర్శకత్వంలో ఈ సినిమా చేస్తున్నాను. ఆయన ప్రతిభ మీద నాకెంతో నమ్మకం ఉంది. పైగా ఆయన నెంబర్ వన్ ఐకానిక్ అమెరికన్ దర్శకుడు కూడా. చాలా రోజుల నుంచి ఈ ప్రాజెక్ట్ గురించి చర్చించి స్క్రిప్ట్‌లో పలు మార్పులు చేశాం. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేస్తాను' అని చెప్పింది.

అనసూయ కథనం ప్రకారం..



అనసూయ భరద్వాజ్ మెయిల్ లీడ్‌గా నటిస్తున్న చిత్రం 'కథనం'. ది మంత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్, ది గాయత్రి ఫిల్మ్స్ పతాకాలపై బి.నరేంద్రరెడ్డి, శర్మ చుక్కా సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. రెండు పాటలు మినహా టాకీపార్ట్ మొత్తం పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది.

ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అనసూయ మాట్లాడుతూ, 'కథనం అంటే కథని నడిపే విధానం. మా ఫస్ట్ లుక్ విడుదలైన తర్వాత చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇందులో నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా నటిస్తున్నాను. చాలా మంచి కాస్ట్ అండ్ క్రూతో ఈ చిత్రం వస్తోంది. పెళ్ళి ఫేమ్ పృథ్వీగారు చాలా బాగా చేశారు' అని చెప్పారు. నరేంద్రరెడ్డి మాట్లాడుతూ,'నేను మెగాస్టార్ చిరంజీవికి పెద్ద అభిమానిని. ఆయన సినిమాలతోనే నేను డిస్ట్రిబ్యూటర్‌గా స్టార్ట్ అయ్యాను. పార్ట్ టైమ్ ప్రొడ్యూసర్‌గా 'మంగళ' చిత్రం చేశాను. ఈ సినిమాకి ఫుల్ టైమ్ ప్రొడ్యూసర్‌గా చేస్తున్నాను. కథ నచ్చి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాను. ఇందులో అనసూయ ఫుల్‌లెంగ్త్ రోల్ చేసింది. ఆమె నటించిన 'రంగస్థలం' చిత్రాన్ని నెల్లూరులో నేనే డిస్ట్రిబ్యూషన్ చేశాను. ఆమె ఏ సినిమా చేస్తే అది హిట్టే. అలాగే ఈ సినిమా కూడా హిట్ అవుతుంది. ధనరాజ్ ఆర్టిస్ట్‌గా కాకుండా తన సినిమాగా ఫీలై ఎంతో హెల్ప్ చేశారు. ఈ చిత్రకథను దర్శకుడు చాలా బాగా తెరకెక్కించారు. ఇప్పటివరకు జరిపిన షూటింగ్‌తో టాకీపార్ట్ పూర్తయ్యింది. రెండు పాటలు మాత్రమే బ్యాలెన్స్ ఉన్నాయి. వాటిని కూడా త్వరలోనే చిత్రీకరించి సమ్మర్ స్పెషల్‌గా ఈచిత్రాన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

'ఈ కథకు అనసూయ పర్‌ఫెక్ట్ యాప్ట్. ఆమె ఇందులో నటించేందుకు అంగీకరించడం నా అదృష్టం. ధన్‌రాజ్ ఎంతో సహాయం చేశారు. ఈ సినిమా ఇంత వరకు వచ్చిందంటే ఆయనే కారణం. నరేంద్రరెడ్డిగారు ఏ సినిమా చేసినా అది హిట్ అవుతుంది. ఆయనది లక్కీ హ్యాండ్. క్రైమ్ థ్రిల్లర్స్‌లోనే ఇదొక డిఫరెంట్ సినిమా' అని దర్శకుడు రాజేష్ నాదెండ్ల చెప్పారు.

ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే అక్కడొకడుంటాడు



'అక్కడొకడుంటాడు' చిత్ర ప్రీ రిలీజ్ వేడుక దృశ్యం

శివ కంఠంనేని టైటిల్ పాత్రలో తెరకెక్కిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. శ్రీపాద విశ్వక్ దర్శకత్వంలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కె.శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. రామ్‌కార్తీక్, శివహరీష్, అలేఖ్య, రసజ్ఞ దీపిక నాయకానాయికలుగా నటించిన ఈచిత్ర ప్రీ రిలీజ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు అతిథిగా విచ్చేసిన నటుడు, దర్శకుడు వల్లభనేని జనార్ధన్ ఆడియో సీడీలను ఆవిష్కరించి తొలి సీడీని ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సి.కళ్యాణ్ మాట్లాడుతూ,'ప్రతివారం పది చిన్న సినిమాలు, ఒక పెద్ద సినిమా విడుదలవుతుంటాయి. అయితే ఆ పది చిన్న చిత్రాల్లో ఒకటిగా కాకుండా ఓ ప్రత్యేక సినిమాగా ఇది ప్రేక్షకులను అలరింపజేస్తుందనే నమ్మకం ఉంది. మందు బాబులు అర్ధరాత్రి సమయంలో కార్లు నడుపుతూ చేసే ఆగడాల వల్ల జరిగే అనర్థాలను ఇందులో చూపించారు. సందేశాత్మక అంశాన్ని మిళితం చేసి సినిమా చూస్తున్నంత సేపు తర్వాత ఏం జరుగుతుందన్న థ్రిల్‌ను ప్రేక్షకులకు కలిగించే చిత్రమిది. తల్లిదండ్రులు తమ పిల్లలను వెంట పెట్టుకుని థియేటర్లకు తీసుకెళ్ళి మరీ ఈ చిత్రాన్ని చూపిస్తారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పలువురు పెద్ద డిస్ట్రిబ్యూటర్లు ఈ సినిమాని విడుదల చేయబోతున్నారు' అని తెలిపారు. 'అక్కడొక డుంటాడు.. ఎక్కడుంటాడు?, ఎందుకుంటాడు? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే' అని శివ కంఠంనేని చెప్పారు.

'ఇదొక కాన్సెప్ట్ ప్రధాన చిత్రం. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఆద్యంతం ప్రేక్షకుల్ని అలరిస్తుంది' అని దర్శకుడు శ్రీపాద విశ్వక్ అన్నారు. 'పైరసీ జోలికి వెళ్ళకుండా ప్రేక్షకులు కేవలం థియేటర్లలో చూస్తేనే ఈ చిత్రం సాంకేతికంగా ఎంత గొప్పగా ఉంటుందో అర్థమవుతుంది' అని నిర్మాతల్లో ఒకరైన రావుల వెంకటేశ్వరరావు చెప్పారు.

సీత స్పెషల్ సాంగ్‌లో..!



'ఆర్ ఎక్స్ 100' చిత్రం సాధించిన ఘన విజయంతో ఆ చిత్ర కథానాయిక పాయల్ రాజ్‌పుత్ ఫేటే మారిపోయింది. క్రేజీ కథానాయికగా టాలీవుడ్‌లో మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. అలాగే వరుస అవకాశాలనూ దక్కించుకుంటోంది. ఇటీవల రవితేజ సరసన 'డిస్కోరాజా' చిత్రంలో నటించే బంపర్ ఆఫర్ అందుకున్న పాయల్‌ను తాజాగా మరో లక్కీ ఆఫర్ వరించింది. తేజ దర్శకత్వంలో రూపొందుతున్న 'సీత' చిత్రంలోని స్పెషల్ సాంగ్ కోసం ఎంపికైంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సరసన మెరవబోయే స్పెషల్ సాంగ్‌కి సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అదిరిపోయే మాస్ నెంబర్‌ని అందించాడట. దీంతో సిల్వర్ స్క్రీన్‌పై సాయిశ్రీనివాస్, పాయల్ జోడీ చేసే మ్యాజిక్ ప్రేక్షకుల్ని కచ్చితంగా అలరిస్తుందని 'సీత' చిత్రబృందం భావిస్తోందట.

రియల్ గిరాకీ..



(మొదటిపేజీ తరువాయి)

సాతంరాయి, శంషాబాద్, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో భూముల ధరలు చుక్కలను తాకాయి. ప్రస్తుతం గృహ సముదాయాలు, ఆపార్ట్‌మెంట్లు, విల్లాల కొనుగోళ్లు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించినా, ప్రస్తుతం పాత ఒరవడి కొనసాగుతున్నది. నగదు తరలింపుపై ఆంక్షలు విధించడం, మార్కెట్‌లో నగదు లభ్యత కొరత ఏర్పడటంతో అక్టోబరు, డిసెంబరు మాసాల్లో భూములు, స్థలాల రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గింది. తాజాగా పంచాయతీ ఎన్నికల ప్రభావం కూడా కాస్తో, కూస్తో ఉన్నప్పటికీ, వారం, పది రోజుల్లో పుంజుకునే అవకాశం కనిపిస్తున్నది. 2017, 2018 సంవత్సరాలకు సంబంధించి లెక్కలను పరిశీలిస్తే ఈసంగతి అర్థమవుతున్నది. ఈవ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయులుగా సాగుతున్నది. 12 రిజిస్ట్రేషన్ జిల్లాల్లో 2017 సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 8,19,507 దస్తావేజులను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నమోదు చేసింది. తద్వారా రూ. 3291.93 కోట్ల ఆదాయం సాధించింది. అలాగే 2018 సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు 10,92,289 దస్తావేజులు కాగా, రూ. 4247.52 కోట్ల మేర ఆదాయం సమకూరింది. దస్తావేజుల్లో దాదాపు 33.29 శాతం మేర వృద్ధి కనిపించగా, అంటే 2,72,782 డాక్యుమెంట్లు రిజిష్టర్ అయినట్టు అధికారిక సమాచారం. అలాగే అదాయం సైతం 29.03 శాతం పెరిగింది. దాదాపు 2017లో కంటే 2018లో రూ.955.56 కోట్లు ఎక్కువగా వచ్చింది.

కారణాలివే..

రియల్ వ్యాపారం బాగా పెరగడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నోట్ల రద్దు చర్య కూడా కారణమేనని ఇటు అధికారులు, అటు వ్యాపారులు అంటున్నారు. అలాగే నగదుపై ఆంక్షలు విధించిన తరుణంలో రియల్‌ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గుచూపారనే అంటున్నవారూ లేకపోలేదు.

అలాగే ఇండ్లు, ఇండ్లస్థలాల రేట్లు రోజు రోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో ముందుగా కొనేసుకోవాలనే ఆలోచన కూడా రిజిస్ట్రేషన్లకుశాఖకు ఆదాయాన్ని తెచ్చిపట్టినట్టు రంగారెడ్డి జిల్లాలోని రియల్ వ్యాపారులు అంటున్నారు. అలాగే రాజకీయంగా కూడా కొంతస్థిరత్వం రావడం కూడా కారణమేనని చెబుతున్నారు.

సంవత్సరం	డాక్యుమెంట్లు	ఆదాయం(రూ. కోట్లల్లో)
2017	8,19,507	3291.93
(ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు)		
2018	10,92,289	4247.52
(ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు)		

రంగారెడ్డిలో 1.70 లక్షల దస్తావేజులు

రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారిక సమాచారం ప్రకారం 2017 ఆర్థిక సంవత్సరంలో రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్(డిఆర్) పరిధిలో అత్యధికంగా డాక్యుమెంట్లు రిజిష్టర్ అయ్యాయి. జిల్లాలో 1,70,462 డాక్యుమెంట్లు దస్తావేజులుగా నమోదయ్యాయి. తద్వారా 1226.80 కోట్ల ఆదాయం వచ్చింది. 2018లో 2,54,457 దస్తావేజులకుగాను 1513.99 కోట్లు ఆదాయం సమకూరింది. ఇలా హైదరాబాద్ దక్షిణ జిల్లా, మేడ్చల్- మల్కాజ్‌గిరి, నల్లగొండ వరంగల్ తదితర జిల్లాల్లోనూ డాక్యుమెంట్లు ఎక్కువగా దస్తావేజు చేశారు.

కారుదే పైచేయి అయినా..

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వగా 788 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. 3,342 గ్రామాల్లో పోలింగ్ జరిగింది. మూడో విడతలో 4,116 గ్రామాలకు నోటిఫికేషన్ ఇవ్వగా 577 గ్రామా లు ఏకగ్రీవం కాగా, 3,506 గ్రామాల్లో ఎన్నికలు జరిగాయి. మూడు విడతల్లోనూ కలిపి దాదాపు 6వేలకు పైగా గ్రామా ల్లో టీఆర్ఎస్ మద్దతు దారులు విజయం సాధించారు.

88.03 శాతం పోలింగ్

మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో 88.03 శాతం పోలింగ్ జరిగింది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.99 శాతం,అత్యల్పంగా జనగామ జిల్లాలో 77.70 శాతం పోలింగ్ నమోదైంది. బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటతో ముగిసింది. ఉదయం వేళలో చలి తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల చాల చోట్ల పోలింగ్ మంద కోడిగా సాగింది. 9 గంటల వరకు 30 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట లోపు 50 శాతం పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభమైంది. మూడో విడతలో ఏకగ్రీవాలతో కలిపి టీఆర్ఎస్ 2377, కాంగ్రెస్ 901, సీపీఐ(ఎం) 20, సీపీఐ 19, టీడీపీ 12, బీజేపీ 56, ఇతరులు 472 స్థానాల్లో విజయం సాధించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గ్రామ పాలనకు అపాయింటెడ్ డే
ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. దీంతో కొత్త పాలక మండళ్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం "అపాయింటెడ్ డే"ను ఖరారు చేసింది. ఈ మేరకు బుధవారం పంచాయతీ రాజ్ శాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఫిబ్రవరి 2న అపాయింటెడ్ డేగా నిర్ణయిస్తూ పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ నీతూ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు ఫిబ్రవరి 2న బాధ్యతలు స్వీకరించి పాలకమండలి తొలి సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొంది.

ఓటింగ్ కేంద్రాల వద్ద ఇద్దరు మృతి

- **విధుల్లో ఉన్న వీఆర్ఓ గుండెపోటుతో..**
- **ఓటేసిన కొద్దిసేపటికే వృద్ధురాలు..**

నవతెలంగాణ-కోస్గి/పరిగిరూరల్

ఓటింగ్ కేంద్రాల వేర్వేరు జిల్లాల్లో బుధవారం ఇద్దరు మృతిచెందారు. విధుల్లో ఉన్న వీఆర్ఓ గుండెపోటుతో మృతిచెందగా.. ఓటేసిన కాసేపటికే ఓ వృద్ధురాలు మరణించారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన బి. నర్సప్ప (51) మహబూబ్ నగర్ జిల్లా కోస్గి మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆరేండ్లుగా క్లస్టర్ వీఆర్ఓగా పని చేస్తున్నారు. మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బోలోనుపల్లి గ్రామ ఇన్‌చార్జిగా ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన ఆహారాన్ని తీసుకొచ్చేందుకు గ్రామ వీఆర్ఏ మొగులయ్యతో కలిసి కోస్గికి తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. ఈ క్రమంలో ముస్రిఫా వాగు వద్ద గుండెనొప్పి రావడంతో బైక్‌ను పక్కకు ఆపి కుప్పకూలాడు. వెంటనే స్పందించిన మొగులయ్య మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే నర్సప్ప గుండె పోటుతో మృతి చెందారని నిర్ధారించారు. విషయం తెలుసుకున్న నారాయణపేట ఆర్డీఓ శ్రీనివాసులు ఆస్పత్రికి వచ్చి వైద్యులను వివరాలడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని మిట్టకోడూరు గ్రామానికి చెందిన కోరె వెంకటమ్మ (65) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. పంచాయతీ మూడో విడత ఎన్నికల్లో పోలింగ్ కేంద్రంలో ఓటేసి వచ్చిన కాసేపటికే తీవ్ర అస్వస్థతకు గురై మతిచెందింది. మతురాలి కొడుకు ఆరోవార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్నాడు. మతురాలి ఓటు నాలుగో వార్డులోఉంది. తనఓటును వినియోగించుకుని మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నాంపల్లి ఎగ్జిబిషన్‌లో భారీ అగ్ని ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

కూడా పేలి పోయాయని, మూడు సార్లు పెద్ద ఎత్తున శబ్దం వచ్చిందని స్థానికులు చెబుతున్నారు.

400 దుకాణాలు దగ్ధం

నుమాయిష్‌లో మొత్తం 3000కు పైగా స్టాల్స్ ఉన్నాయి. ప్రతి స్టాల్ ఓ ప్రత్యేకతతో ఏర్పాటు చేస్తారు. వీటిని చూసేందుకు దేశ విదేశాల నుంచి ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. బుధవారం సాయంత్రం కూడా 20 వేల మందికి పైగా సందర్శకులు పిల్లా పాపలతో ఇక్కడికి వచ్చారు. రాత్రి 8:40 గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 400కు పైగా దుకాణాలు కాలి బూడిదయ్యాయి. ఇందులో ప్రధానంగా బట్టలు, ప్లాస్టిక్ వస్తువులు, పుస్తకాల షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో రూ. కోట్లలో ఆస్తి నష్టం జరిగిఉంటుందని, మంటలు ఆరిన తర్వాత అది పూర్తి స్థాయిలో తెలుస్తుందని అధికారులు తెలిపారు.

తొక్కిసలాటలో పలువురికి గాయాలు

నుమాయిష్‌లో అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న సందర్శకులు, నిర్వాహకులు వెంటనే అక్కడి నుంచి బయటికి రావాలని పరుగులు తీశారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగింది. పరుగులు తీసే సమయంలో పలువురు కింద పడి గాయపడ్డారు.



భారీగా పొగలు వ్యాపించడంతో పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అధికారులు వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మంటలార్పుతున్న క్రమంలో ముగ్గురు అగ్ని మాపక సిబ్బందికి గాయాలయ్యాయి.

బ్యాంకులో విదుద్ఘాతమే కారణమా ?

నుమాయిష్‌లో ఏర్పాటు చేసిన మహేశ్ కో ఆపరేటివ్ బ్యాంకులో జరిగిన చిన్నపాటి విద్యుద్ఘాతమే మంటలు చెలరేగడానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. మొదట అందులో చెలరేగిన మంటలు పక్కన ఉన్న ఇతర షాపులకు విస్తరించాయని, ఇలా ఒక్కొక్కటిగా సుమారు 400కు పైగా షాపులకు అంటుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరి కొందరు అగరబత్తి షాపు ద్వారా మంటలు చెలరేగాయని చెబుతున్నారు.

ప్రమాదం విషయం తెలుసుకున్న నగర మేయర్ బొంతు రాంమోహన్, జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిషోర్, సీపీ అంజనీకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద నివారణా చర్యలు చేపట్టారు. జీహెచ్ఎంసీ డిజాస్టార్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందిని రంగంలోకి దించారు. జలమండలి నుంచి అదనంగా10 వాటర్ ట్యాంకులు తెప్పించారు. అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు.

కేంద్రం మోకాలడ్డు

(మొదటిపేజీ తరువాయి)

నివేదికను బహిరంగపరచకుండా కేంద్రం తమవిధులకు అడ్డుపడిందనీ, సంస్థ అధికారాన్ని దెబ్బతీసి 'నీతి ఆయోగ్' ఏకపక్షంగా గత జీడీపీ గణాంకాల్ని సవరించిందనీ వారు కేంద్రంపై తీవ్ర ఆరోపణలు చేశారు. సంస్థ తీసుకునే కీలక నిర్ణయాల్లో తమను పరిగణనలోకితీసుకోనందునే తాము రాజీనామా చేసినట్టు ఆ ఇద్దరు సభ్యులు పేర్కొన్నారు. వీరు తమ రాజీనామాలను సంబంధిత మంత్రిత్వ శాఖకు సోమవారం అందజేశారు. "నేను ఎన్ఎస్‌సీకి రాజీనామా చేశాను. ఇటీవలి కాలంలో సంస్థ సమర్థవంతంగా పనిచేయడంలేదని మేము భావిస్తున్నాం" అని మోహనన్ అన్నారు. "పెద్ద నోట్ల రద్దు అనంతరం దేశంలో 2017-18 మధ్య ఉద్యోగం, నిరుద్యోగంపై నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్(ఎన్ఎస్ఎస్ఓ) తన నివేదికను కమిషన్‌కు సమర్పించింది. దానిని మేము డిసెంబరు మొదట్లోనే ఆమోదించాం. అయితే ఆ నివేదికను కొన్ని రోజుల తర్వాత బహిర్గతం చేయాల్సి ఉన్నప్పటికీ రెండు నెలలు గడిచినా అది జరగలేదు. కేంద్రం ఎన్ఎస్‌సీని సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మా విధులు సక్రమంగా నిర్వర్తించలేమని భావించా"మని మోహనన్ తమ రాజీనామాకు దారి తీసిన పరిస్థితులను తెలిపారు.

ఎన్ఎస్‌సీ సభ్యులుగా మోహనన్, మీనాక్షీలు2017 జూన్‌లో చేరారు. వారి పదవికాలం జూన్ 2020 వరకు ఉన్నది. తమ పదవీకాలం ఇంకో ఏడాది ఉండగానే ఆ ఇద్దరు రాజీనామా చేయడం గమనార్హం. ఏడుగురు సభ్యులు ఉండాల్సిన ఎన్ఎస్‌సీలో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు ఈ ఇద్దరి రాజీనామాతో ఆ సంఖ్య రెండుకు చేరుకున్నది. ఆ ఇద్దరిలో చీఫ్ స్టాటిస్టిషియన్ ప్రవీణ్ శ్రీవాస్తవ, నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్‌లు మాత్రమే ఉన్నారు.

వారి స్థానంలో నేనున్నా రాజీనామా చేసేవాణ్నే
ప్రణబ్ సేన్, ఎన్ఎస్‌సీ మాజీ చైర్మెన్



జాతీయ గణాంక సంఘంపై పెద్ద ఎత్తున ఒత్తిడి తీసుకొచ్చారు. గణాంక సంఘాన్ని సంప్రదించ కుండానే గత జీడీపీ లెక్కల్ని కేంద్రం ఏకపక్షంగా సవరించింది. కనీసం వారితో(మోహనన్, మీనాక్షి) సంప్రదించకుండానే సవరించిన జీడీపీ డాటాను విడుదల చేసింది. ఎన్ఎస్‌సీ అధికారాన్ని పూర్తిగా చేతుల్లోకి తీసుకొని 'నీతి ఆయోగ' ఇదంతా చేస్తూ వస్తోంది. ఎన్ఎస్‌సీలో వారి(మోహనన్, మీనాక్షి) స్థానంలో నేనున్నా రాజీనామా చేసేవాణ్నే. జాతీయ గణాంక సంఘంలాంటి సంస్థను అధికార రాజకీయ పార్టీ ఈవిధంగా దెబ్బతీస్తుందనీ ప్రజలు ఊహించలేదు. 'నేషనల్ శాంపిల్ సర్వే' ఏ నివేదిక తయారుచేసినా దానికి తుది ఆమోదం తెలిపే అధికారం జాతీయ గణాంక సంఘానిదే. నోట్లరద్దు తర్వాత ఉద్యోగం, ఉపాధి అంశాలపై 'నేషనల్ శాంపిల్ సర్వే' రూపొందించిన నివేదికకు గణాంక సంఘం ఆమోదం తెలిపింది. గతేడాది డిసెంబరుకల్లా నివేదిక బయటకు రావాల్సింది. దీనిని మోడీసర్కార్ కావాలనే అడ్డుకుంది. నోట్లరద్దు పర్యావసనాలు బయటకువ స్తాయని భావించి గణాంక సంఘాన్నిదెబ్బతీసే ప్రయత్నాలు మొదలుపెట్టింది.

ఉద్యోగాలు, ఉపాధిపై గణాంకాల్ని బయటపెట్టాలి
రాధికా పాండే, ఆర్థిక విశ్లేషకులు



సవరించిన జీడీపీ వివరాల్ని ఏకపక్షంగా నీతి ఆయోగ్ విడుదల చేసినప్పుడే గణాంక సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వివాదంలో నీతి ఆయోగ్ పాత్ర వివాదాస్పద మైంది. గణాంక సంఘంలోని సభ్యులు విడుదల చేసే నివేదిక దేశానికి మంచే చేస్తుంది తప్ప, చెడు చేయదు. వాస్తవ గణాంకాలు బయటకొస్తేనే దేశ ఆర్థిక పరిస్థితిపై మేధావుల చర్చ, పరిశోధన జరుగుతుంది. తద్వారా సరైన విధానపరమైన ప్రాధాన్యతలను మనం ఎంచుకోగలం. అలాగే ఉద్యోగ, ఉపాధిపై ఎన్ఎస్ఎస్ఓ గణాంకాలు కూడా విడుదల చేయల్సింది. కానీ కేంద్రం దీనిని అడ్డుకుంది. ఈ పరిణామాలే గణాంక సంఘం సభ్యుల రాజీనామాకు దారితీసింది.

పలుచోట్ల ఘర్షణలు, పోలీసులు లాఠీచార్జి

ఓట్ల గల్లంతుపై ప్రజల ఆందోళన

నవతెలంగాణ-యంత్రాంగం

గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో విడత బుధవారంతో ముగిసింది. చెదురుమదురు ఘటనలు మినహా జిల్లాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పలుచోట్ల స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నప్పటికీ పోలీసుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. సూర్యాపేట జిల్లా పాలకవీడులో ఉద్రిక్తత చోటుచేసుకోగా పోలీసులు లాఠీచార్జి చేయడంతో 15 మందికి గాయాలయ్యాయి. మరికొన్ని చోట్ల ఓట్ల గల్లంతుపై ప్రజలు ఆందోళనకు దిగారు.

సూర్యాపేట జిల్లా పాలకవీడులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. గ్రామంలో కాంగ్రెస్, కాంగ్రెస్ రెబల్, టీఆర్ఎస్, టీఆర్ఎస్ రెబల్, ఒక స్వతంత్ర్య అభ్యర్థి పోటీ చేశారు. కౌంటింగ్ అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి రూపావత్ గౌరి 132 ఓట్లతో గెలుపొందారని అధికారులు ప్రకటించారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మాజీ జడ్పీటీసీశంకర్‌నాయక్‌తో పాటు మరికొందరు పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లి గౌరి కుమారుడు ఆదిలాబాద్ ఎక్సైజ్ ఎస్పీ కావడంతో ఇక్కడ పనిచేసిన పోలీసు సిబ్బందిని ప్రలోభాలకు గురిచేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే దొంగ ఓట్లు వేశారనీ, ఒక బాక్సులో ఓట్లు లెక్క పెట్టకుండా అభ్యర్థిని ప్రకటించారనీ ఆరోపిస్తూ గొడవకు దిగారు. పోలింగ్ కేంద్రంపై దాడి చేయగా పోలీసులు లాఠీచార్జి చేశారు. దీంతో సుమారు 15మందికి గాయాలయ్యాయి.

కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలం పెద్దజైసింగ్ తండాలో టీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందడంతో సంబరాలు చేసుకుంటుండగా టీఆర్ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో తోపులాట జరగడంతో పోలీసులు చెదరగొట్టారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం కుమ్మరిగూడ గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద గుంపులు గుంపులుగా ఉన్న జనాన్ని పోలీసులు లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. ఈ ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

ఓట్ల గల్లంతుపై ఆందోళన

నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం గన్నారం గ్రామంలో ఓట్లు గల్లంతైయ్యాయని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేశామనీ, పంచాయతీ ఎన్నికల్లో కావాలనే కుట్ర చేసి తొలగించారనీ ఆరోపించారు. సమాచారం అందుకున్న అధికారులు, పోలీస్ యంత్రాంగం వచ్చి వారికి సర్దిచెప్పారు. నిజామాబాద్ ఆర్డీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఆంజనేయులు, పోలీస్ జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బందితో అక్కడకు చేరుకుని గత లిస్టులను పరిశీలించారు. అనంతరం ఆర్డీవోనే ఓటర్ స్లిప్పులపై సంతకాలు పెట్టడంతో వారందరూ తిరిగి ఓట్లు వేశారు.

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం సాల్విడ్ గ్రామంలో అధికారుల నిర్లక్ష్యంతో 68మంది ఓట్లు గల్లంతయ్యాయి. ఓటు వేసేందుకు వెళ్లిన వారి పేర్లు జాబితాలో లేకపోవడంతో వారు ఆందోళనకు దిగారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న తమకు పంచాయతీ ఎన్నికల్లో ఓటు లేకపోవడం ఏంటని వారు ప్రశ్నించారు. ఓటరు జాబితాలో ఉన్న గందరగోళాన్ని స్థానిక పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓకు సమాచారం అందించినా వారు పట్టించుకోలేదన్నారు.

డబ్బులు పంచుతుండగా...

జగిత్యాల మండలం మోతె గ్రామ పంచాయతీలో తోడేటి స్వప్న అభ్యర్థి తరపున ఏలేటి సురేందర్‌రెడ్డి హోటల్‌లో డబ్బులు పంచుతుండగా రూరల్ ఎస్ఐ సతీశ్ 14వేల నగదును పట్టుకున్నారు. తోడెటి స్వప్న అభ్యర్థి పేరుతో ఉన్న నమూనా బ్యాలెట్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈసీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



ఒక్క ఓటు తేడాతో గెలుపు

కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలం పోచారం గ్రామంలో ఒక్క ఓటు తేడాతో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి మనెవ్వ గెలుపొందారు. కాంగ్రెస్ బలపర్చిన లక్ష్మిబాయికి 163 ఓట్లు రాగా, మనెవ్వకు 164 ఓట్లు రావడంతో ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు. నసురుల్లాబాద్ మండలంలోని బస్వాయిపల్లి గ్రామంలో పాతిమ బేగం (టీఆర్ఎస్) ఒక్క ఓటుతో గెలుపొందారు. గ్రామంలో 353 ఓట్లు ఉన్నాయి. పాతిమాబేగం (టీఆర్ఎస్), సుల్తానా బేగం (కాంగ్రెస్) పోటీ పడ్డారు. మొత్తం 351 ఓట్లు పోల్ అవ్వగా, ఫాతిమాబేగమ్‌కు 176, సుల్తానాకు 175 ఓట్లు వచ్చాయి. దీంతో ఒక్క ఓటుతో గెలుపొందినట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. రాజన్న సిరిసిల్ల తంగళ్లపల్లి మండలంలోని పద్మనగర్ గ్రామపంచాయతీలో ఒక్కఓటు తేడాతో పోషయ్య గెలిచాడు.

గ్రామంలో 743 ఓట్లు ఉండగా ముగ్గురు అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. పోషయ్యకు 175, మోర నిర్మలకు 174, మరో అభ్యర్థికి 160 ఓట్లు పోలయ్యాయి. కాగా మోర నిర్మలపై ఒక్క ఓటు తేడాగో పోషయ్య విజయం సాధించినట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని దేవుల్ నాయక్‌తండా గ్రామంలో ఒక్క ఓటుతేడాతో రాథోడ్‌భీంబాయి గెలిచారు. గ్రామంలో మొత్తం 238 ఓట్లు పోలయ్యాయి. వాటిలో నోటాకు 5 ఓట్లు పడ్డాయి. మిగతా 233 ఓట్లలో రాథోడ్ భీంబాయికి 117 ఓట్లు రాగా, రెండో స్థానంలో రాందాస్‌కు 116 ఓట్లు వచ్చాయి.

ఇక ఎక్కడైనా నర్సుల సేవలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ఇక నుంచి నర్సులు దేశంలో ఎక్కడైనా స్వేచ్ఛగా పని చేసుకోవచ్చు. ఎలాంటి ఆటంకాలు, అవరోధాలు ఉండబోవు. ఏదైనా ఒక రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే చాలు. ఈ వెసులుబాటుకు అర్హులు.' అంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నెల 22న దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేయగా, బుధవారం ఉత్తర్వుల కాపీ రాష్ట్ర ప్రభుత్వానికి చేరింది. దీంతో ఇతర రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో పనిచేయాలకునే నర్సులకు రిజిస్ట్రేషన్ల బాధ తప్పినట్టయింది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం ఏ రాష్ట్రంలో నర్సింగ్ విద్యనభ్యసించిన అభ్యర్థులు అదే రాష్ట్రంలోని ఆస్పత్రుల్లో మాత్రమే పనిచేయాల్సి ఉంటుంది. రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ జారీ చేసిన సర్టిఫికేట్ అదే రాష్ట్రానికే పరిమితం. ఇతర రాష్ట్రాల్లో పనిచేసేందుకు పనికిరాదు. ఒక వేళ ఇతర రాష్ట్రాల్లో విధులు నిర్వర్తించాలకుంటే ఆ రాష్ట్ర నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. దీంతో మళ్లీ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి వచ్చేది. ఒక వేళ రిజిస్ట్రేషన్ మార్చాల్సి వస్తే ఆ రాష్ట్ర నిబంధనలు ఏమిటి? ఎక్కడ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఏవిధంగా, ఎవరిని సంప్రదించాలి ? ఫీజు తదితర ఎన్నో వ్యయప్రయాసాలకు అభ్యర్థులు గురయ్యేవారు. అంతకుముందు సొంత రాష్ట్రం నర్సింగ్ కౌన్సిల్ నుంచి నిరభ్యంతర ధృవీకరణ పత్రం (ఎన్ఓసీ) తీసుకున్న తరువాతే వేరే రాష్ట్రం రిజిస్ట్రేషన్ గురించి ప్రయత్నించాలి. ఇదంతా జరగాలంటే రెండు మూడు నెలల సమయం పడుతుందని నర్సులు చెబుతున్నారు. దీంతో చేసేదిలేక సొంత రాష్ట్రంలోనే బతుకుదెరువు పోరాటం చేయాల్సి వస్తున్నదని అంటున్నారు. ఏది ఏమైనా సుప్రీంకోర్టు సడలించిన నిబంధనలతో ఆ బాధ నుంచి నర్సులు విముక్తి పొందారు. సుప్రీంకోర్టు తీర్పుపై తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ రుడావత్ హర్షం వ్యక్తం చేశారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ గణాంకాల ప్రకారం దేశంలో 14 లక్షల మంది, రాష్ట్రంలో 80 వేల మంది గుర్తింపు పొందిన నర్సులు ఉన్నట్టు అంచనా.

జీహెచ్ఎంసీలో భారీ స్కామ్!

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీలో భారీ స్కామ్ బట్టబయలైంది. పారిశుధ్య విభాగంలో బోగస్ వేలిముద్రలతో కార్మికుల హాజరువేస్తూ అవకతవకలకు పాల్పడుతున్న వ్యవహారం సంచలనం రేపింది. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు అందడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. స్పందించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరు బృందాలుగా నగరంలోని 12 చోట్ల ఏక కాలంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో శానిటేషన్ కార్మికుల హాజరులో అక్రమాలు జరిగాయానే విషయాలు వెలుగులోకి వచ్చాయి.

జీహెచ్ఎంసీలో కార్మికుల హాజరు శాతం కోసం బయోమెట్రిక్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. అయితే అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొందరు శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు బయోమెట్రిక్ విధానంలో అక్రమాలకు తెరలేపారు. ఏకంగా బయోమెట్రిక్ మిషన్‌నే క్లోనింగ్ చేసి సింథటిక్ ఫింగర్ ప్రింట్స్ ఉపయోగిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు విధులకు హాజరు కాకపోయినా హాజరైనట్టు వారే నకిలీ ఫింగర్ ప్రింట్స్ వేసేస్తున్నారు. ఇలా ప్రతినెలా రూ.లక్షల్లో అక్రమంగా సంపాదిస్తున్నారు. ఎస్ఎఫ్ఏలు అక్రమాలకు పాల్పడుతున్నట్టు రెండు వారాల నుంచి అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ విషయంపై విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం ఆరు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఒక్కో బృందం రెండు ఏరియాల చొప్పున 12 ప్రాంతాల్లో ఏక కాలంలో తనిఖీలు చేపట్టారు. చార్మినార్, కూకట్‌పల్లి, మూసాపేట్, మలక్‌పేట్, ఎల్బీనరగ్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో సానిటరీ ఫిల్డ్ అసిస్టెంట్లు బయోమెట్రిక్‌లో సింథటిక్ ఫింగర్ ప్రింట్స్ ఉపయోగిస్తున్నట్టు గుర్తించారు. సింథటిక్ ఫింగర్ ప్రింట్స్‌తో అక్రమాలకు పాల్పడుతున్న 17 మంది ఎస్ఎఫ్ఏలను రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నామని జీహెచ్ఎంసీ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విశ్వజిత్ కంపాటి తెలిపారు. 9 మంది వద్ద 84 ఫింగర్ ప్రింట్స్‌ని గుర్తించామన్నారు. వారి వద్ద ఉన్న బయోమెట్రిక్ మిషన్లను సీజ్ చేశామన్నారు. యూట్యూబ్‌లో చూసి సింథటిక్ ఫింగర్ ప్రింట్స్ తయారు చేసినట్టు వారు విచారణలో ఒప్పుకున్నారని వివరించారు. ఇంకెంత మంది వీటిని ఉపయోగిస్తున్నారో ఆరా తీస్తున్నామన్నారు. ఈ వ్యవహారం వెనుక ఎవరి హస్తముందో త్వరలో తేలుస్తామని చెప్పారు. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన ఈ వ్యవస్థను కేవలం రూ.5, రూ.10తో ఇలా మార్చేశారని అన్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి పూర్తి నివేదికను జీహెచ్ఎంసీ కమిషనర్‌కు సమర్పించినట్టు ఆయన తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎవర్నీ వదలం : బొంతు రాంమోహన్, మేయర్

నకిలీ వేలి ముద్రలతో పారిశుధ్య కార్మికుల బోగస్ హాజరును నమోదు చేస్తున్న 9మంది సానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే విధుల్లోంచి తొలగించాలని, వారిపై కేసులు నమోదు చేయాలని నగర మేయర్ బొంతు రాంమోహన్ ఆదేశించారు. నిందితులపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని కమిషనర్ దానకిషోర్‌ను కోరారు. నకిలీ వేలిముద్రల అంశంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆదేశించారు. ఈ ఉదంతంలో ప్రమేయమున్న అధికారులు, సిబ్బందిని గుర్తించాలని కోరారు.

ముగిసిన పంచాయతీ పోరు

- **మూడు దశల్లో 87.33 శాతం పోలింగ్**

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎపుడెప్పుడా అని ఎదురు చూసిన పంచాయతీలకు కోర్టు జోక్యంతో నిర్వహించిన పంచాయతీ ఎన్నికలు పరిసమాప్తమయ్యాయి. పంచాయతీల కాలపరిమితి ముగిసిన మూడేండ్ల తర్వాత ఎన్నికలు జరుగుతుండటంతో పంచాయతీల్లో పెద్ద ఎత్తున పోటీ నెలకొన్నది. టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, తమ మద్దతుదారులను గెలిపించుకోవడం కోసం భారీ ఎత్తున డబ్బులు ఖర్చు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో అయినా పెద్ద సంఖ్యలో సర్పంచ్ పదవులను గెలుపొంది పరువు నిలబెట్టుకోవాలని ఆశపడ్డా, ఆశాభంగమే ఎదురైంది. పంచాయతీల్లోనూ టీఆర్ఎస్ జైత్రయాత్ర కొనసాగింది.

10,549 పంచాయతీలకు ఎన్నికలు

రాష్ట్రంలో మొత్తం 12,751 పంచాయతీలు ఉండగా, 10,549 పంచాయతీలకే ఎన్నికలు జరిగాయి. రెండింటిపై కోర్టులో పిటీషన్లు కొనసాగుతున్నాయి. మరో 17 పంచాయతీలకు ఇంకా ఏడాది పదవీ కాలం ఉంది. ఇవిపోను 12,732 పంచాయతీలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. మూడు విడతలుగా వీటికి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. తొలి విడతలో 4,479, రెండో విడతలో 4,135, మూడో విడతలో 4,116 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. అయితే తొలి విడతలో 9 పంచాయతీలకు, రెండో విడతలో ఐదింటికి, మూడో విడతలో పదింటికి నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతోపాటు తొలి విడతలో 769, రెండో విడతలో 788, మూడో విడతలో 573 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అలాగే భూపాలపల్లి జిల్లాలో మరో 24 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకుండా కోర్టు స్టే ఇచ్చింది. ఇవన్నీ పోను మూడు విడతల్లో కలిపి మొత్తం 10,549 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఈ నెల 21 న జరిగిన మొదటి విడత పంచాయతీల్లో 48,46,403 మంది ఓటర్లు ఉండగా, 41,56,414 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 85.76శాతం పోలింగ్ నమోదైంది. రెండో విడతలో 42,79,277 మంది ఓటర్లకు గాను 37,76,277 మంది ఓటు వేయకపోవడంతో 88.26శాతం పోలింగ్ నమోదైంది. మూడో విడతలో 45,23,669 మంది ఓటర్లగాను 39,82,043 మంది ఓటు వేయడంతో 88.03 శాతం పోలింగ్ జరిగింది. మూడు విడతలో జరిగిన ఎన్నికల్లో మహిళలే అత్యధిక శాతం ఓటింగ్‌లో పాల్గొనడం విశేషం.

ప్రశాంతంగా పోలింగ్

రాష్ట్రంలో మొత్తంగా పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. షెడ్యూల్ వెలువడిన మరసటి రోజే రాజకీయ పార్టీల అగ్రనేతలు రంగంలోకి దిగారు. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలోని గ్రామాల్లో పంచాయతీ పోరు అసెంబ్లీ ఎన్నికలను తలపించింది. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుండటంతో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఓటుకు రూ.5వేల నుంచి రూ.10 వేలతో పాటు మద్యంతో పాటు చికెన్, మటన్ సరఫరా చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సర్పంచ్ పదవి కోసం ఒక్కో గ్రామం నుంచి 4 నుంచి 10 మంది వరకు పోటీ పడటం గమన్హాం.

ఎన్నికల సంఘం నిర్లక్ష్యం

పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పలు గ్రామాల్లో అభ్యర్థుల గుర్తులు గల్లంతు కావడం ఒక అభ్యర్థి గుర్తు మరో అభ్యర్థికి కేటాయించడం మూలంగా పలు చోట్ల తిరిగి ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది.

సెన్సెక్స్ ▼ 01 35,591

నిఫ్టీ ▼ 01 10,651

సమాజ హితానికి కృషి: పీఎన్‌బీ



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) 125వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఆ బ్యాంక్ తెలంగాణ సర్కిల్‌లో ఘనంగా జరిగాయి. బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాజ హితం కోరుతూ పీఎన్‌బీ అపోలో ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. పీఎన్‌బీ స్థానిక సైఫాబాద్ శాఖలో ఏర్పాటు చేసిన మొదటి వైద్య శిబిరాన్ని సర్కిల్ హెడ్ రాధిక బటవాడేకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం ప్రాధాన్యతను గురించి వివరించారు. పీఎన్‌బీ కేవలం వ్యాపార దృక్పథంతోనే కాకుండా సమాజహితం కోరుతూ తెలంగాణలో పలు కార్యక్రమాలను చేపడుతోందని వివరించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలను చేపట్టినట్టుగా ఆమె వివరించారు. సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ వరంగల్ జిల్లా మేడిపల్లి గ్రామాన్ని దత్తతు తీసుకుందని. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్టుగా వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్కిల్ హెడ్ డి.ఎన్.అంబేద్కర్, సైఫాబాద్ శాఖ చీఫ్ మేనేజర్ టి.శిరీషతో పాలు బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చందా కొచ్చర్ దోషే!

- విచారణలో తేల్చిన శ్రీకృష్ణ కమిటీ..
- నిబంధనల్ని ఉల్లంఘించారని వెల్లడి
- ఐసీఐసీఐ నుంచి పూర్తిగా బయటకు
- చర్యలు తీసుకుంటాం: ఐసీఐసీఐ



న్యూఢిల్లీ: వీడియోకాన్ సంస్థకు ఐసీఐసీఐ బ్యాంక్ భారీగా రుణాలను మంజూరు చేయడంలో అక్రమాలకు పాల్పడ్డారన్న కేసులో ఆ బ్యాంక్ మాజీ సీఎండీ చందా కొచర్‌కు (56) గట్టి ఎదురు దెబ్బ తగిలింది. వీడియోకాన్ రుణం కేసులో చందా కొచ్చర్ దోషేనని ఐసీఐసీఐ ఏర్పాటు చేసిన స్వతంత్ర విచారణలో తేలింది. ఈ స్కామ్‌పై విచారణకు నియమించిన జస్టిస్ శ్రీకృష్ణ స్వతంత్ర కమిటీ.. తన రిపోర్టును బుధవారం సంస్థకు అందించింది. నివేదికలలో బ్యాంకునకు సంబంధించిన అంతర్గత నిబంధనలను కొచ్చర్ ఉల్లఘించారని కమిటీ తేల్చింది. ఐసీఐసీఐ బ్యాంక్ మంజూరు చేసిన రూ.3,250 కోట్ల రుణం వెనుక అప్పటి సీఈవో చందాకొచ్చర్ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో వాస్తవాలను వెలికి తీసేందుకు గాను బ్యాంక్ బోర్డు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి బి.ఎన్.శ్రీకృష్ణ నేతృత్వంలో ఒక విచారణ కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని వివిధ కోణాల్లో విచారణ జరిపిన కమిటీ, ఫోరెన్సిక్ ఆడిట్ రూపంలో వాస్తవాలను వెలికి తీసింది. వీటిని ఆధారంగా చేసుకొనే ఐసీఐసీఐ బ్యాంక్ బ్యాంక్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి కొచ్చర్ స్వీయ ప్రయోజనం కలిగేలా వ్యవహరించినట్టు జస్టిస్ శ్రీకృష్ణ ప్యానెల్ తేల్చింది. ఈ మేరకు ఆమెను దోషిగా నిర్ధారిస్తూ బ్యాంకు బుధవారం అధికారికంగా ఒక ప్రకటనను విడుదల చేసింది. అలాగే ఈ ఆరోపణలతోనే బ్యాంకు నుంచి ఆమెను తొలగిస్తున్నట్టు బోర్డు ప్రకటించడం విశేషం. దీనికి తోడు ఆమెకు సంబంధించి భవిష్యత్తులో చెల్లించాల్సిన సొమ్ములను, ప్రస్తుతం బకాయి ఉన్న చెల్లింపులు అన్నింటిని నిలిపివేస్తున్నట్టు తెలిపింది. క్విడ్‌ప్రోకో ఆరోపణలు నిజమని తేలిన నేపథ్యంలో దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. ఏప్రిల్, 2009 నుంచి నుంచి 2018 మార్చివరకు ఆమెకు చెల్లించిన బోనస్, ఇంక్రిమెంట్లు, షేర్లు, ఆరోగ్య బీమాతో సహా ఇతర చెల్లింపులను బ్యాంకునకు వెనక్కి తీసుకోనున్నట్టుగా బ్యాంక్ వెల్లడించింది.

అక్టోబరులోనే రాజీనామా..


వీడియోకాన్‌కు భారతీయ స్టేట్ బ్యాంక్ నేతృత్వంలోని 20 బ్యాంకుల బృందం దాదాపు రూ.40,000కోట్ల రుణాలను మంజూరు చేసింది. అందులో రూ.3,250 కోట్ల రుణాన్ని ఐసీఐసీఐ బ్యాంక్ చెల్లించింది. ఇందుకు నజరానాగా 2008 నుంచి 2013 మధ్య వీడియోకాన్ గ్రూప్ అధినేత వేణుగోపాల్ ధూత్ కంపెనీలు, చందా కొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్ కంపెనీల మధ్య పలు ఆర్థిక లావాదేవీలు, యాజమాన్య బదలాయింపులు జరిగాయి. మార్చి 2018లో ఇవి వెలుగులోకి వచ్చాయి. దీంతో ఐసీఐసీఐ బ్యాంక్ ఎండీ, సీఈవోగా ఉన్న చందా కొచ్చర్ పాత్రపై అప్పట్లో పలు సందేహాలు తలెత్తాయి. కొచ్చర్ అక్టోబర్‌లో తన పదవికి రాజీనామా చేశారు. రుణ మంజూరీకి గాను మార్చి 2012 వరకు రూ.1,730 కోట్ల మేర బ్యాంకుకు మోసం చేశారని ఆరోపిస్తూ చందా కొచ్చర్, దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ ధూత్, న్యూపవర్ రెన్యువబుల్స్, వీడియోకాన్ ఇండస్ట్రీస్ సంస్థలపై సీబీఐ ఇటీవలే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసింది.

'శక్తివంతమైన మహిళ'గా గుర్తింపు



చందా కొచ్చర్ రాజస్థాన్ లోని జోధ్‌పూర్లో 1961లో జన్మించారు. 1982లో సీఏ పూర్తి చేశాక తర్వాత జమునాలాల్ బజాజ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ నుండి మేనేజ్‌మెంట్ విద్యను పూర్తి చేశారు. బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో తన క్లాస్‌మెట్ అయిన దీపక్ కొచ్చర్‌ను చందా వివాహం చేసుకున్నారు. 1984 లో చందా కొచ్చర్ ఐసీఐసీఐలో మేనేజ్‌మెంట్ ట్రెనీగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1993లో ఐసీఐసీఐ కొత్తగా బ్యాంకింగ్ సేవలను ప్రారంభించినపుడు సంస్థ యాజమాన్యం ఈమెను సంస్థ బ్యాంకింగ్ కోర్ కమిటీకి బదిలీ చేసింది. 1994 లో అసిస్టెంట్ మేనేజర్ గానూ మరియు 1996 లో డిప్యూటీ మేనేజర్‌గానూ పదోన్నతి సాధించింది. 1998లో సంస్థ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి సాధించింది. 1999 లో సంస్థ యొక్క ఈ-కామర్స్ విభాగాన్ని కూడా నిర్వహించింది. ఈమె నాయకత్వంలోనే ఐసీఐసీఐ బ్యాంక్ రిటైల్ బ్యాంకింగ్‌లో ప్రవేశించి, మనదేశంలోని ప్రైవేటు బ్యాంకులలో అగ్రగామిగా నిలిచింది. 2001 లో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. బ్యాంకింగ్ సేవలను సామాన్యులకు ఐటీ ద్వారా చేరువ చేయడంలో తనదైన శైలితో రాణించిన చందా కొచ్చర్‌కు 2005 నుండి ఫోర్బ్స్ పత్రిక 'అత్యంత శక్తివంతమైన మహిళా వ్యాపారవేత్త'గా అభివృద్ధిస్తూ తన జాబితాలో స్థానం కల్పించింది. 2009, 2010 లో ఫోర్బ్స్ పత్రిక ప్రపంచ అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో స్థానం కల్పించింది. బ్యాంకింగ్ రంగంలో ఈమె సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2010లో చందా కొచ్చర్‌కు పద్మభూషణ్ అవార్డును ఇచ్చి సత్కరించింది. కానీ ఇప్పుడు అనూహ్యంగా ఆమె కెరీర్‌కు శుభంకార్డు పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

జీబ్రోనిక్స్ నుంచి కొత్తగా 'జెబ్‌జర్నీ' ఇయర్ ఫోన్స్



హైదరాబాద్: ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీ సంస్థ జెబ్రోనిక్స్ తమ కొత్త వాయిస్ అసిస్టెంట్ ఎనెబుల్ చేసిన ఇయర్‌ఫోన్స్ 'జెబ్ జర్నీ'ని ప్రారంభించింది. జాగింగ్ చేసేప్పుడు అదనపు సౌకర్యాన్ని ప్రోత్సహించే విధంగా మెడ బ్యాండ్ రూపంలో డిజైన్ చేశారు. దీన్ని నీటిలో పడినా పాడవకుండా ప్రత్యేకంగా తమారు చేశారు. వీటిలో ఇంటర్నల్ రిచార్జబుల్ బ్యాటరీతో పాటు, కాల్స్ కోసం ఒక వాల్యూమ్స్ నియంత్రణలు, వైబ్రేషన్ హెచ్చరిక ఉంటుందని సంస్థ యాజమాన్యం తెలిపింది. వీటిలో ఇంటర్నల్ రిచార్జబుల్ బ్యాటరీతో పాటు, కాల్స్ కోసం ఒక వాల్యూమ్స్ నియంత్రణలు, వైబ్రేషన్ హెచ్చరిక ఉంటుందని వెల్లడించింది. ఈ సందర్భంగా. జీబ్రోనిక్స్ డైరెక్టర్ బీ.ప్రదీప్ దోషి మాట్లాడుతూ... వీటిని సంగీత ప్రియుల కోసం ప్రత్యేకంగా రూపొందించామని తెలిపారు. ఈ వైర్‌లెస్ యుగంలో ఈ ఇయర్‌ఫోన్లు చాలా ఉపయోగపడుతాయని ఆయన తెలిపారు. దీనితో 13గంటల పాటు నాన్‌స్టాప్ సంగీతం వినడంతో పాటు వాయిస్ అసిస్టెన్స్‌ను పొందవచ్చని వెల్లడించారు.

తెలంగాణ ఫలితాలపై అనుమానాలు?

- మీడియాతో మాజీ ఎంపీ లగడపాటి



నవతెలంగాణ - న్యూఢిల్లీబ్యూరో

తెలంగాణలో వెలువడిన ఎన్నికల ఫలితాలపై అనేక అనుమానాలు ఉన్నాయని మాజీ ఎంపీ, ప్రముఖ ఎన్నికల విశ్లేషకులు లగడపాటి రాజగోపాల్ వ్యాఖ్యానించారు. గతంలో ఎప్పుడూ లేనట్టుగా ఎన్నికల్లో డబ్బు ప్రభావం అధికంగా ఉన్నదని అన్నారు. బుధవారం ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. వీవీప్యాట్‌లో నమోదైన ఓట్లను లెక్కించలేదని అన్నారు. ఐదు గంటల తర్వాత ఓటింగ్ శాతం పెరిగిందంటూ చెప్తున్న సంఘం గంట గంటకు ఎంత ఓటింగ్ జరిగిందో బహిర్గత పరచాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పంచాయతీ ఎన్నికల్లో ప్రతిపక్ష బలం గణనీయంగా పెరిగిందని అభిప్రాయపడ్డారు. అనుమానాలను నివత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘునీదేనని చెప్పారు. తమకు వచ్చిన అనుమానాలు పోవాలంటే వీవీప్యాట్లను లెక్కించాలన్నారు.

ఎలక్ట్రానిక్ యుగంలో ఓట్ల శాతం చెప్పడానికి అంత సమయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. ఎవరికో లాభం చేయాలనో తాను ఫలితాలు వెల్లడించలేదన్నారు. ఒక మాటకు కట్టుబడి ఉన్నటువంటి వ్యక్తినని చెప్పారు. రోజురోజూకు మార్పులు జరిగాయని అన్నారు. అందుకే తాను విడుదల చేసిన ఫలితాల్లో తేడాలు వచ్చాయన్నారు. తెలంగాణ ఎన్నికల ఫలితాలపై మరోసారి మాట్లాడుతానన్నారు. తాను ఎవరి ఒత్తిడికి లొంగే వ్యక్తిని కాదని స్పష్ట చేశారు. కేటీఆర్ స్వయంగా అడిగితేనే 37 సెగ్మెంట్లకు సర్వే చేసి ఇచ్చామన్నారు. ఇండిపెండెంట్‌ల ఓటమికి తనకు కారణం తెలుసు అని వెల్లడించారు. సిద్ధాంతాలకు కట్టుబడే తాను రాజకీయాలకు దూరంగా ఉన్నానని, ఏదైన పార్టీలో చేరితే అందరికీ తెలియజేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో తాను ముందస్తు సర్వేలు ప్రకటించనని అన్నారు. ఆసక్తి ఉంటే... టీఆర్ఎస్ ఎన్నికల్లో కూడా పోటీ చేయవచ్చని సలహానిచ్చారు.

ఎన్నికల సిబ్బందికి గౌరవమైన పారితోషికమివ్వాలి

- సీఎస్‌కు యూఎస్‌పీసీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో పనిచేసిన సిబ్బందికి గౌరవప్రదమైన పారితోషికం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషిని యూఎస్‌పీసీ ప్రతినిధులు సిహెచ్ రాములు, చావ రవి, మైస శ్రీనివాసులు కలిసి వినతిపత్రం సమర్పించారు. మూడు విడతల్లో నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు చెల్లించిన రెమ్యూనరేషన్ (పారితోషికం) తక్కువగా ఉందనీ, అవమానకరంగా ఉందనీ తెలిపారు. అదీ అన్ని జిల్లాల్లోనూ ఒకే విధంగా చెల్లించడం లేదని పేర్కొన్నారు. సిబ్బందికి రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకంగా గౌరవప్రదమైన పారితోషికం చెల్లించాలని కోరారు. నల్లగొండ జిల్లాలో రోజుకు రూ.450/రూ.350 చొప్పున చెల్లిస్తే, కొన్ని జిల్లాల్లో రూ.200 కంటే తక్కువగా చెల్లించారని తెలిపారు. పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి విడుదల చేసిన ఉత్తర్వుల్లో గతంలో ఉన్న దాని కంటే అతి తక్కువ పారితోషికం నిర్ణయించారని పేర్కొన్నారు. ఈ అంశంపై సీఎస్ సానుకూలంగా స్పందించారనీ, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శితో సంప్రదించి ఉత్తర్వులను పున:సమీక్ష చేస్తామని హామీ ఇచ్చారనీ తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో గల అన్ని భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా ఉన్నతీకరించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని తెలిపారు. కేజీబీవీ సిబ్బందికి 12 నెలల వేతనం చెల్లించాలని కోరారు. రూ.398 వేతనంతో పనిచేసిన స్పెషల్ టీచర్ల సర్వీసుకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ టీచర్ల సర్వీసు రూల్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. విద్యాశాఖ అధికారులతో చర్చించి సంబంధిత ఫైళ్లను ముఖ్యమంత్రికి పంపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

రాష్ట్రపతి ప్రసంగంతో ఉభయ సభలు ప్రారంభం

రేపు బడ్జెట్ పెట్టనున్న పియూష్ గోయల్

- సహకరించాలని అఖిలపక్షాలకు స్పీకర్ విజ్ఞప్తి

నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఫిబ్రవరి 13 వరకు ఈ సమావేశాలు కొనసాగుతాయి. తొలిరోజున రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఉభయ సభల ఉమ్మడి సమావేశం నిర్వహిస్తారు.

ఈ సందర్భంగా దేశంలోని పరిస్థితులను, పాలన వ్యవహారాలపై ప్రసంగిస్తారు. ఉభయ సభల ఉమ్మడి సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగంతో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభిస్తారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వైద్య చికిత్స నిమిత్తం అమెరికా వెళ్లడంతో గత వారం ఆర్థిక మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టిన పియూష్ గోయల్ ఫిబ్రవరి 1న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెడతారు. సాధారణంగా ఎన్నికల ఏడాది మధ్యంతర బడ్జెట్ లేదా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టడం ఆనవాయితీ. ఎన్నికల అనంతరం కొలువుతీరే ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. ఎన్నికలకు ముందు పరిమిత కాలానికి ప్రభుత్వ వ్యయానికి సంబంధించి అనుమతి అవసరం కావడంతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం కొద్ది నెలల కాలానికి ప్రవేశపెడుతుంది.

ఆ ప్రకారం పరిమిత కాలానికి అవసరమైన ఖర్చులకు అనుమతి తప్పనిసరి. సంప్రదాయం ప్రకారం, ప్రభుత్వం కొత్త సర్వీసులను కానీ, ఫైనాన్స్ బిల్లును తేవడం కానీ ఉండదు. ప్రస్తుతం బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి సార్వత్రిక ఎన్నికల ముందు ఇదే చివరి బడ్జెట్ అవుతుంది. అంతేకాక ఇవే చివరి సమావేశాలు అవుతాయి.

కాగా, 2014లో అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరం తాత్కాలిక బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఎన్నికల అనంతరం బీజేపీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆర్థిక మంత్రిగా పగ్గాలు చేపట్టిన అరుణ్ జైట్లీ 2014 జూలైలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.



తాత్కాలిక బడ్జెటే: పియూష్ గోయల్, కేంద్ర ఆర్థిక మంత్రి

ఎన్నికల ఏడాది ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు బదులు నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుందనే వార్తలను వచ్చాయి. అయితే ఆ వార్తాలను ప్రభుత్వం తోసిపుచ్చింది. ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. 2019-20 ఏడాదికి మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడతామని ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ బుధవారం జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

సజావుగా సభ నిర్వహిద్దాం.. సహకరించండి: సుమిత్రా మహాజన్, స్పీకర్

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అన్ని పార్టీల నేతలను కోరారు. బుధవారం పార్లమెంట్ లైబ్రరీ భవనంలో స్పీకర్ సుమిత్రా మహాజన్ నేతృత్వంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభా నిర్వహణకు సహకరించాలని అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలను కోరారు. వివిధ పార్టీల నేతలు తమ అభిప్రాయాలను చెప్పారు. దేశంలో నెలకొన్న సమస్యలపై చర్చించాలని కోరారు. రాజ్యాంగ సంస్థలపై దాడిపై ఈ సమావేశాల్లో చర్చించాలని ప్రతిపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, సహాయ మంత్రులు విజయ్ గోయల్, అర్జున్ రామ్ మేఘ్వాల్, కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, వేణుగోపాల్ (అన్నాడీఎంకే), సుదీప్ బందోపాధ్యాయ (టీఎంసీ), భర్తృహరి మెహతాబ్ (బీజేడీ), కరుణాకరన్ (సీపీఐ(ఎం)), తోట నరసింహం (టీడీపీ), జయప్రకాశ్ యాదవ్ (ఆర్జేడీ), సుప్రియా తసులే (ఎన్సీపి), ప్రేమ్ సింగ్(శిరోమణి అకాలీదళ్), కున్హాలీ కుట్టీ (ఐయుఎంఎల్), లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలత శ్రీవాత్సవ్‌లు పాల్గొన్నారు.

మహిళ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి: కరుణాకరన్, ఎంపీ, సీపీఐ(ఎం)

బడ్జెట్ సమావేశాల్లోనే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని సీపీఐ(ఎం) లోక్‌సభ పక్షనేత పీ కరుణాకరన్ డిమాండ్ చేశారు. బుధవారం లోక్‌సభ స్పీకర్ నేతృత్వంలో జరిగిన అఖిల పక్ష సమావేశానికి హాజరైన కరుణాకరన్ వివిధ అంశాలను లేవనెత్తారు. దేశంలో రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలోని నిరుద్యోగం విలయతాండవం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగాన్ని రూపుమాపే చర్యలు తీసుకోవడంలో కేంద్ర సర్కార్ విఫలం అయ్యిందని విమర్శించారు. దేశంలోని యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే దేశంలో ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. అవినీతిని అరికట్టే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నాలుగున్నరేండ్లలో మోడీ సర్కార్ అవినీతిని అరికట్టే చర్యలు తీసుకోలేదని అన్నారు. సీబీఐ, సీవీసీ, కాగ్ వంటి రాజ్యాంగ సంస్థలపై దాడి పెరిగిందని తెలిపారు. ఈ సమస్యలపై బడ్జెట్ సమావేశాల్లో చర్చించాల్సిందేనని పట్టుపట్టారు.

నేడు రాజ్యసభ ఛైర్మెన్ వెంకయ్య అఖిల పక్ష సమావేశం

ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మెన్ ఎం వెంకయ్య నాయుడు నేడు అఖిల పక్ష సమావేశం నిర్వహించనున్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సజావుగా నిర్వహించేందుకు అన్ని పార్టీల నేతలను కోరనున్నారు. అంతేకాకుండా ఆయా పార్టీల అభిప్రాయాలు తీసుకోనున్నారు.

పార్లమెంట్ ముందుకు రాఫెల్‌పై కాగ్ రిపోర్టు..!

ఈ సమావేశాల్లో పార్లమెంట్ ముందుకు రాఫెల్ ఒప్పందంపై కాగ్ రిపోర్టు రానున్నది. గత యూపీఏ ప్రభుత్వం హయాంలో జరిగిన ఒప్పందంలో 126 ఎయిర్ క్రాఫ్ట్ ఉన్నాయి. కానీ మోడీ సర్కార్ ఆ ఒప్పందాన్ని రద్దు చేసి కొత్త ఒప్పందం చేశారు. అందులో కేవలం 36 ఎయిర్ క్రాఫ్ట్ మాత్రమే ఉన్నాయి. అలాగే ఒక్కో ఎయిర్ క్రాఫ్ట్ ధర కూడా పెరిగింది. దీంతో పాటు నాటి ఒప్పందంలో హెచ్ఏఎల్‌కు అవకాశం కల్పిస్తే, దాన్ని తొలగించి అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇచ్చారు. ఇలాంటి ముఖ్యమైన అంశాలపై కాగ్ ఏ విధంగా నివేదిక ఇస్తోందో చూడాల్సి ఉన్నది.

'నామినేటేడ్' జీతాలు

టీఆర్ఎస్ నాయకులే గ్రంథాలయాల ఛైర్మెన్లు

ఏడాదికి రూ. 3 కోట్ల పైమాటే..

- వసూలైన సెస్ మొత్తం వారి జీతాలకే..
- కోట్లల్లో పెండింగ్ సెస్
- అస్తవ్యస్తంగా గ్రంథాలయాల నిర్వహణ

నవతెలంగాణ- సంగారెడ్డి ప్రతినిధి

రాజు మన వాడైతే బతుకుదెరువుకు కొదవా అన్నట్టుంది తెలంగాణలో ప్రభుత్వం పని తీరు. టీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులైతే చాలు నామినేటెడ్ పోస్టులు ఖాయం. పైసా పని లేకుండా.. జీతాలు మాత్రం క్రమం తప్పకుండా జేబులో పడుతున్నాయి. అలాంటిదే.. గ్రంథాలయ ఛైర్మెన్ల నియామకం. గ్రంథాలయాల అభివృద్ధి.. పన్నుల వసూలు చేయకున్నా, లగ్జరీ కార్లలో తిరుగుతూ పార్టీ కార్యకలాపాలు చక్కబెడితే చాలు.. నెలనాడు జీతం జేబులో పడుతోంది. దీని కోసం ఏడాదికి రూ.3.12 కోట్ల గ్రంథాలయ నిధులను వినియోగిస్తుండటంతో ఆ వ్యవస్థ కుదేలవుతోంది.

టీఆర్ఎస్ నాయకులకే పెద్దపీట

టీఆర్ఎస్ పార్టీకి విధేయులుగా ఉంటూ ఆయా ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయడంలో కీలకంగా వ్యవహరించిన నాయకులను గ్రంథాలయ ఛైర్మెన్లుగా నియమిస్తూ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసింది. జిల్లాల విభజన జరగకముందు ఒక్కో ఛైర్మెన్‌కు వేతనం రూ.2500 మాత్రమే ఉండేది. కొత్తగా ఏర్పడిన జిల్లాలకు 2017 అక్టోబర్ నుంచి ప్రభుత్వం ఛైర్మెన్ల నియామకం చేస్తూ వచ్చింది. వారి వేతనాలకు సంబంధించి జీఓను గతేడాది విడుదల చేసింది. అయితే, నియామకమైన నాటి నుంచే వేతనాలు వర్తిస్తాయని అందులో పేర్కొన్నారు. గ్రంథాలయ ఛైర్మెన్ పదవి లాభాపేక్షలేనిదని పేర్కొన్న ప్రభుత్వం.. గౌరవ పారితోషకంగా నెలకు రూ.51వేలు, రవాణా కోసం వాహనం అద్దె రూ.33వేలు చెల్లించేందుకు నిర్ణయం తీసుకుంది.



జిల్లా కేంద్ర గ్రంథాలయం, సంగారెడ్డి

నిర్వాహణ కంటే వేతనాలకే ఎక్కువ..

ప్రస్తుతం రాష్ట్రంలోని 31 జిల్లాల ఛైర్మెన్లకు నెల గౌరవ వేతనంగా రూ.15లక్షల 81వేలు, వాహనాల అద్దె కింద రూ.10.23 లక్షల చొప్పున అవుతుంది. ఈ ప్రకారం ఏడాది వేతనాల కోసం రూ.కోటి 89లక్షల 72వేలు, వాహనాల అద్దె కోసం రూ.కోటి 22లక్షల 76వేలు గ్రంథాలయ సంస్థ నిధుల నుంచి కేటాయించాల్సి వస్తోంది. మొత్తం మూడు కోట్ల 12 లక్షల 48వేల రూపాయలను గ్రంథాలయ నిధుల నుంచి అందించాల్సి వస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ముగ్గురు ఛైర్మెన్లకు కలిపి ఏడాదికి రూ.32.40 లక్షలు వేతనాల రూపంలో అందుతున్నాయి. సాధారణంగా గ్రంథాలయాలకు పంచాయతీలు, మున్సిపాలిటీల్లో వసూలైన పన్నుల్లో 8శాతం లైబ్రరీ సెస్ వస్తుంటుంది. వీటితో ఆయా జిల్లాల్లో గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి. కానీ ప్రస్తుతం ఛైర్మెన్ల జీతాలకు మెజారిటీ వాటా పోతుండటంతో మూడేండ్లుగా గ్రంథాలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

కొత్త గ్రంథాలయాల ఏర్పాటు శూన్యం

గ్రంథాలయ ఛైర్మెన్లు పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి సెస్ డబ్బులు వసూలు చేసి బ్యాంకుల్లో జమ చేయాలి. దీంతో పాటు కొత్తగా గ్రంథాలయాలకు స్థలాలు సేకరించి నిర్మించాలి. ఈ పనుల కోసమే గౌరవ వేతనంతోపాటు వాహనం అద్దె చెల్లిస్తున్నారు. కానీ వీరిని నియమించి రెండేండ్లు దాటినా కొత్తగా ఒక్క గ్రంథాలయాన్నీ ఏర్పాటు చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా 676 గ్రంథాలయాలు నిర్వహిస్తున్నారు. ఈ లెక్కన రాష్ట్రవ్యాప్తంగా జీహెచ్ఎంసీతో కలుపుకుంటే రూ.వందల కోట్ల పన్ను ఆదాయాన్ని గ్రంథాలయ ఖాతాలో జమ చేయాల్సి ఉంది. కానీ ఛైర్మెన్లు వసూలు చేయడం లేదు.. వసూలైందీ వారి జీతాలకే సరిపోవడం లేదు. దీంతో పైసా ఆదాయం మిగలడం లేదు. గత నెలలోనే ఒక్కో ఛైర్మెన్‌కు రూ.6లక్షల చొప్పున రూ.1.86కోట్లను వేతనంగా అందించారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో..

ఉమ్మడి మెదక్ జిల్లాలో 46 మండలాలు ఉండేవి. మండలానికో శాఖా గ్రంథాలయం, 5 గ్రామ గ్రంథాలయాలు ఉండేవి. వీటిల్లో 31 మాత్రమే సొంత భవనాల్లో ఉన్నాయి. రెండు అద్దె భవనాల్లో, 13 ప్రభుత్వ కార్యాలయ భవనాల్లో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 64 మండలాలు, 1,615 గ్రామాలు ఉన్నాయి. కానీ పాత గ్రంథాలయాలు తప్ప కొత్తవి ఎక్కడా ఏర్పడలేదు. అద్దె భవనాల్లో ఉన్న వాటికీ సొంత భవనాలు నిర్మించలేదు. 2016లో జిల్లాలు విభజన జరిగే నాటికి సుమారు రూ.4.50కోట్ల గ్రంథాలయ సెస్ వసూలు చేయాల్సి ఉంది. ప్రస్తుతం రూ.7కోట్లు దాటి ఉంటుందని అంచనా.

కిసాన్
నవతెలంగాణ



అనుకూల పంట మినుము

మన రాష్ట్రంలో మినుము 10.6 లక్షల ఎకరాల్లో సాగు చేయబడుతూ దాదాపు 2.5లక్షల టన్నుల ఉత్పత్తిని, ఎకరానికి 233 కిలోల దిగుబడినిస్తుంది. తెలంగాణలో మినుమును తొలకరిలోనూ, రబీలో, వేసవిలో వరి కోతల తర్వాత పండిస్తారు. మినుము వేసవి పంటగా ఫిబ్రవరి, మార్చి నెలలో అనుకూలం. మరి ఈ పంటకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

యాజమాన్య పద్ధతులు: మెట్ట ప్రాంతాల్లో తేమను నిలుపుకోగలిగి, మురుగు నీరు పోయే వసతి గల భూములు అనువైనవి. భూమిని బాగా దుక్కిదున్ని విత్తడానికి ముందు ఎకరానికి 8 కిలోల నత్రజని, 20కిలోల భాస్వరం వేసి గొర్రుతో కలియదున్నాలి. వరి మాగాణుల్లో మినుము సాగు చేసేటప్పుడు ఎరువులు వాడనవసరం లేదు.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 30 గ్రాముల కార్బోసల్ఫాన్ మందును వాడి విత్తన శుద్ధి చేయాలి. కిలో విత్తనానికి 5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ లేక 5 గ్రా థయోమిథాక్సామ్ కలిపి విత్తనశుద్ధి చేసినట్టయితే సుమారు 15 నుండి 20 రోజుల వరకు రసం పీల్చే పురుగుల బారి నుండి రక్షించుకోవచ్చు. ఈ పంటను కొత్తగా పండించేటప్పుడు రైజోబియం కల్చరును విత్తనంతో కలిపి విత్తితే అధిక దిగుబడి పొందవచ్చు.

నీటి యాజమాన్యం: వర్షాభావ పరిస్థితి ఏర్పడినప్పుడు ఒకటి రెండు నీటి తడులు ఇవ్వవలసి వస్తుంది. వరి మాగాణుల్లో నీటి తడి ఇవ్వొచ్చు. ఒకటి రెండు తేలిక తడులు, 30 రోజులలోపు, 55 రోజుల తర్వాత ఇస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

కలుపు నివారణ, అంతర కృషి: పెండి మిథాలిన్ 30 శాతం ద్రావకం ఎకరానికి 1.0 నుండి 1.5 లీటర్లు లేదా అలాక్లోర్ 50శాతం ఎకరానికి లీటరు చొప్పున విత్తిన వెంటనే గానీ, మరుసటి రోజున గానీ పిచికారి చేయాలి. విత్తిన 20 నుంచి 25 రోజులప్పుడు గొర్రుతో అంతరకృషి చేయాలి. వరి మాగాణుల్లో విత్తనం చల్లిన 21 నుంచి 28 రోజుల మధ్య పెనాక్షిప్రాస్ ఇథైల్ 250 మి.లీ ఎకరానికి (ఊద నివారణకు), క్విజాల్‌ఫాస్ ఇథైల్ 400 మి.లీ ఎకరానికి (ఊద, చిప్పెర, గరక నివారణకు) ఇమిజితాఫిర్ 250 మి.లీ ఎకరానికి (వెడల్పాకు కలుపు, ఇంగారు తీగె నివారణకు) పై మందులను ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



సస్యరక్షణ పురుగులు

కాండపు ఈగ: పిల్ల పురుగులు భూమికి దగ్గరగా ఉన్న కాండం మొదలు లోపలికి వెళ్లి లోపల కణజాలాన్ని తిని డొల్లలా మారుస్తాయి. పురుగు ప్రవేశించిన ప్రాంతం ఉబ్బి మొక్క పక్కకు వాలిపోతుంది. ఎక్కువగా తొలకరి పైరుపై ఆశిస్తుంది. నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్ 1.0 గ్రా లేక డైమిథోయేట్ 1.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

మరుకా మచ్చల పురుగు: ఈ పురుగు మొగ్గ, పూత, పిందె దశల్లో ఆశించి ఎక్కువ నష్టం కలుగజేస్తుంది. పూత దశలో పూలను గూడుగా చేసి లోపలి పదార్థాలను తింటుంది. కాయలు తయారయ్యేటప్పుడు కాయలను దగ్గరకు చేర్చి గూడుగా కట్టి, కాయలకు రంధ్రం చేసి లోపలి గింజలను తినడం వల్ల పంటకు ఎక్కువ నష్టం కలుగుతుంది.

నివారణకు: పైరు పూత దశకు రాకముందు నుండే జాగ్రత్తలు చేపట్టాలి. పూత దశలో తప్పనిసరిగా పైరుపై 5శాతం వేప గింజల కషాయం లేదా వేపనూనె 5.0 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసినట్టయితే రెక్కల పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. వేప సంబంధిత మందులు వికర్షకాలుగా పని చేయడం వల్ల రెక్కల పురుగులు గుడ్లు పెట్టడానికి ఇష్టపడవు. అంతేకాక అప్పటికే పంట మొక్కలపై ఉన్న గుడ్లు కూడా పగిలి చనిపోతాయి. తక్కువ కాల పరిమితి గల పైర్లలో ఇది అత్యంత ఉపయోగకరం. మొగ్గ పూత దశలో అక్కడక్కడా కొన్ని పూల మొగ్గలను సేకరించి వాటిని తెరిచి పిల్ల పురుగులు ఉన్నాయా అని పరిశీలించాలి. పిల్ల పురుగులు కనిపించినట్టయితే వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లేక థయోడికార్బ్ 1.0 గ్రా. లేక ఎసిఫేట్ 1.0 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పంట గూళ్లు గమనించినట్టయితే నివారణకు ఎసిఫేటు 1.0 గ్రా లేక క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ లేక క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లేక నొవాల్యురాన్ 1.0 మి.లీ లోఏదో ఒక మందుతో పాటుగా తప్పనిసరిగా ఊదర స్వభావం కలిగిన డైక్లోరివాస్ మందును 1.0 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మళ్లీ అవసరమైతే మందులను మార్చిమార్చి రెండు మూడు సార్లు పూత దశలో, కాయ దశలో పిచికారి చేయాలి. పురుగు ఉధృతి అధికంగా గమనించినప్పుడు స్పైనోశాడ్ 0.3 మి.లీ లేక ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4గ్రా. లేక ఫ్లుబెండిఎమైడ్ 0.2 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారి చేసినట్టయితే మంచి ఫలితం ఉంటుంది.

తెగుళ్లు

కొరొనోస్పొర ఆకుమచ్చ తెగులు: ఈ తెగులు సోకిన ఆకులపై చిన్నని గోధుమ రంగు మచ్చలు ఏర్పడి అనుకూల వాతావరణ పరిస్థితుల్లో పెద్ద మచ్చలు వలయాకారంగా ఏర్పడి ఆకులు ఎండి రాలిపోతాయి. నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా 3గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌లను లేదా 2.0 మి.లీ హెక్సాకోనాజోల్ 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. ఎల్‌బిజి 648 రకం ఈ తెగులుకు తట్టుకుంటుంది. గట్ల మీద ఉన్న పైరుకు వెంటనే మందును పిచికారీ చేయాలి.



ఎండు తెగులు (విల్ట్): ఈ తెగులు ఆశించిన మొక్కలు వడలి, ఎండిపోతాయి. పంటకు అధిక నష్టం కలుగుతుంది. ఈ తెగులు, భూమిలో ఉన్న శిలీంధ్రం ద్వారా వ్యాపిస్తుంది. కనుక పైరుపై మందులను వాడి నివారించుట లాభసాటి కాదు. బుట్ట మినుము, ఎల్‌బిజి 402, ఎల్‌బిజి611 ఎల్‌బిజి22, ఎల్‌బిజి648, 685, 709,752 రకాలకు ఈ తెగులును తట్టుకునే శక్తి ఉంది. ఒకే పైరు సంవత్సరాల తరబడి వేయరాదు. పొలంలో నీరు నిల్వకుండా చూడాలి.

పక్షికన్ను తెగులు (ఆంత్రాక్నోస్)

ఈ తెగులు సోకిన ఆకులపై లేత పసుపు రంగు అంచులతో కూడిన చిన్న చిన్న గోధుమ రంగు మచ్చలు కనిపిస్తాయి ఈ తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా హెక్సాకొనాజోల్ 2.0 మి.లీ కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి 3 గ్రా. చొప్పున 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

పల్లాకు తెగులు యాజమాన్యం: పల్లాకు తెగులును తట్టుకొనే రకాలను ఎంపిక చేసుకొని సాగు చేసుకోవాలి. ఎల్‌బిజి 752, పియు-31, టి-9 రకాలను సాగు చేసుకోవాలి.

- ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ లేదా థయోమిథాక్సిమ్ 5గ్రా.కెజి విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసినట్టయితే పైరును తొలి దశలో వైరస్ తెగులును వ్యాపింపచేయు రసం పీల్చే తెల్లదోమ పురుగుల నుండి కాపాడవచ్చు. పైరు చుట్టూ నాలుగు వరుసలు మొక్కజొన్న గానీ లేక జొన్న విత్తుకున్నట్టయితే వైరస్ తెగుళ్లను వ్యాపింపచేయు తెల్లదోమ, తామర పురుగులు, పేనుబంక వంటి రసం పీల్చే పురుగులను నివారించవచ్చు. పొలం గట్లమీద, రోడ్ల పక్కన వైరస్ ఆశించిన కలుపు మొక్కలను పీకి నాశనం చేయాలి. తెగులు సోకిన మొక్కలను తొలిదశలోనే పీకి నాశనం చేయాలి. పొలంలో అక్కడక్కడ జిగురు పూసిన పసుపు పళ్లాలను ఉంచినట్టయితే తెల్లదోమ ఉనికిని, ఉధృతిని అంచనా వేసుకోవచ్చు. కానీ పల్లాకు తెగులు వ్యాప్తికి ఒకటి లేక రెండు తెల్లదోమలు ఉన్నా సరిపోతుంది. కనుక విత్తనశుద్ధి విధిగా పాటించడం, తెల్లదోమ కనిపించిన వెంటనే పురుగు మందులు పిచికారి చేసినట్టయితే పల్లాకు తెగులు బారి నుండి పంటను రక్షించుకోవచ్చు.
- విత్తిన 15 లేక 20 రోజులకు ఒకసారి వేపనూనె 5 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి లేక 5శాతం వేప గింజల కషాయం కాని పిచికారి చేసినట్టయితే పంటను తెల్లదోమ ఆశించకుండా కాపాడుకోవచ్చు. అంతేకాక అప్పటికే పంటలో ఉన్న తెల్లదోమ గుడ్లను, తెల్ల పురుగులను కూడా నాశనం చేసినట్టవుతుంది.
- తెల్లదోమ నివారణకు ట్రైజోఫాస్ 1.25 మి.లీ లేక మోనోక్రోటోఫాస్ 2.0 మి.లీ లేక ఎసిఫేట్ 1.0 గ్రా లేక మెటాసిస్టాక్స్ 2.0 మి.లీ లేక ఎసిటమిప్రిడ్ 0.2 గ్రా.లలో ఏదైనా ఒకదానిని ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అవసరాన్ని బట్టి మందును మార్చి పది రోజుల వ్యవధిలో మరోసారి పిచికారి చేయాలి.

- డాక్టర్. అమరపల్లి గీత, శాస్త్రవేత్త ప్లాంట్
పిజియాలజీ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం
పాలెం. నాగర్ కర్నూల్ జిల్లా

ప్రత్యామ్నాయంగా నువ్వులు

తెలంగాణలో నువ్వుల పంట సుమారు 60వేల ఎకరాల విస్తీర్ణంలో సాగువుతుంది. ఖరీఫ్‌లో వర్షాలు ఆలస్యంగా కురిసినప్పుడు, కేవలం ఒక పంట మాత్రమే సాగు చేసుకునే పరిస్థితులలో నువ్వులు ఒక ముఖ్యమైన ప్రత్యామ్నాయ పంటగా మంచి దిగుబడులు పొందవచ్చు. ఖరీఫ్, రబీలో వర్షాధారంగా పండించిన దానికంటే రబీ లేదా వేసవిలో ఆరుతడి పంటగా వేసినప్పుడు చీడపీడల బెడద తక్కువగా ఉండి విత్తన నాణ్యత పెరిగి అధిక దిగుబడులు పొందవచ్చు. తెలంగాణలో ఖరీఫ్ మొక్కజొన్న, పసుపు తర్వాత వరి మాగాణుల్లో నిల్వ ఉన్న తేమ కింద వేసవిలో నువ్వు ఒక లాభదాయక పంటగా సాగు చేసుకోవచ్చు.

నేలలు: మురుగు నీరు నిల్వని, తేమ నిలిచే తేలికైన నేలలు శ్రేష్టం. నీరు నిలిచే ఆమ్ల, క్షార గుణాలు గల నేలలు పనికిరావు.

నేల తయారీ: నేలను 2 నుంచి 4సార్లు మెత్తగా దున్ని రెండుసార్లు గుంటక తోలి చదును చేయాలి.



విత్తనం, విత్తే పద్ధతి: ఎకరానికి 2.5కిలోల విత్తనం సరిపోతుంది. విత్తనానికి మూడింతల ఇసుక కలిపి గొర్రుతో వరుసల్లో విత్తుకోవాలి.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 3 గ్రాముల థైరం/ కాప్టాన్/ మాంకోజెట్‌తో విత్తనశుద్ధి చేయాలి. పంట తొలి దశలో రసంపీల్చే పురుగుల బారినుండి కాపాడడానికి ఇమిడాక్లోప్రిడ్ 2.0మి.లీ కిలో విత్తనానికి కలిపి శుద్ధి చేయాలి.

విత్తే దూరం: వరుసల మధ్య 30 సెం.మీ(12 అంగుళాలు) మొక్కల మధ్య 15 సెం.మీ(6 అంగుళాలు)

ఎరువులు: ఖరీఫ్‌లో ఆఖరి దుక్కిలో ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువు, 16 కిలోల నత్రజని, 8కిలోల పొటాష్ 8కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేసుకోవాలి. అంటే ఎకరానికి 18కిలోల యూరియా, 50కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ విత్తేముందు వేసుకోవాలి. విత్తన 30 రోజుల తర్వాత మరో 18కిలోల యూరియా అందజేయాలి. రబీ లేదా వేసవిలో వీటితోపాటు 8కిలలో నత్రజనిని, 15నుంచి18కిలలో యూరియా అదనంగా పైపాటుగా వేసుకోవాలి.

నీటి యాజమాన్యం (రబీ లేదా వేసవి): విత్తిన వెంటనే మొదటి తడి ఇవ్వాలి. పూత, కాయ అభివృద్ధి, గింజకట్టు దశల్లో తడులు ఇవ్వాలి. విత్తిన తర్వాత 35నుంచి 40 రోజుల నుండి 65నుంచి 70రోజుల వరకు నీటి ఎద్దడిలేకుండ ఆచూడాలి. నువ్వుసాగు చేసే నేలలో తేమ ఎక్కువ ఉన్న పరిస్థితులలో మొక్కల శాఖీయోత్పత్తి మాత్రమే జరిగి ఆకులు, కొమ్మలు ఎక్కువగా వచ్చి పూత, కాత రాకుండా నిలిచిపోవడం జరుగుతుంది. కనుక ఈ పంట సాగు చేసేటప్పుడు ఎక్కువ మోతాదులో నీరు అందజేయకూడదు.

కలుపు నివారణ అంతరకృషి: పెండిమిథాలిన్ 30శాతం లేదా అలాక్లోర్50 శాతం ఎకరాకు లీటరు చొప్పున ఏదైనా ఒక కలుపు మందును విత్తిన వెంటనే గానీ మరుసటి రోజుగానీ పిచికారి చేయాలి. మొక్కలు మొలచిన 15 రోజులకు అదనపు మొక్కలను తీసివేయాలి. విత్తిన 20నుంచి 25రోజులప్పుడు గొర్రుతో అంతరకృషి చేయాలి.

ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పాలెం
మహబూబ్‌నగర్ జిల్లా
సెల్‌నెం: 8008404874

వ్యవసాయం - వాతావరణం

పురుగు ఆశించకుండా జాగ్రత్తలు

గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో చాలా చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసాయి. పగటి ఉష్ణోగ్రతలు 29 నుంచి 33 డిగ్రీల సెల్సీయస్, రాత్రి ఉష్ణోగ్రతలు 08 నుంచి 19 డిగ్రీల సెల్సీయస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉండవచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 25 నుంచి 30 డిగ్రీల సెల్సీయస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 00 నుండి 20 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు. గత రెండు మూడు రోజుల్లో కురిసిన వర్షాల వల్ల ఆరుతడి పంట పొలాల్లో నిలిచిన మురుగు నీటిని తీసివేయాలి. నువ్వులు, పెసర, మినుము పంటలను విత్తుకోవాలి.

వరి: తెలంగాణలో రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదైనట్టయితే వరి నారుమడిలో చలి ప్రభావం తగ్గించి నారు ఎదుగుదలకు పాలిథీన్ షీట్లతో నారుమడిని రాత్రిపూట కప్పి ఉదయం వేళల్లో తీసేయాలి. ప్రతి రోజు సాయంత్రం నారుమడికి నీరు పెట్టాలి. ఉదయం నీటిని తీసేయాలి. ఎకరం పొలానికి సరిపడే నారుమడికి 2 కిలోల యూరియా పైపాటుగా నారు విత్తిన 10 నుంచి 15 రోజుల్లో చల్లాలి. వరిలో నారుమడులలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను 200 చ.మీ నారు మడికి (5సెంట్లకు) ఒక కిలో చొప్పున నారు పీకడానికి వారం రోజుల ముందు చల్లుకోవాలి.



కంది: కందిలో మారుక మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు గమనించడమైంది. నివారణకు మారుక మచ్చల పురుగు 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్ లేదా 0.75 మి.లీ. నోవాల్యూరాన్‌తో పాటు 1.0 మి.లీ డైక్లోరోవాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. శనగపచ్చ పురుగు నివారణకు ఈ కింది యాజమాన్య పద్ధతులను పాటించాలి.

- శనగపచ్చ పురుగు లార్వాలను తినేందుకు వీలుగా ఎకరానికి 10 నుంచి 15 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి.
- పురుగుల ఉనికిని గమనించేందుకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చాలి.
- పురుగు, గుడ్లు, తొలిదశ లార్వాల నివారణకు 5 శాతం వేపగింజల కషాయాన్ని పిచికారి చేయాలి.

మొక్కజొన్న: రబీ మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించినట్టు గమనించడమైంది. నివారణకు విషపు ఎర తయారు చేసుకోవడానికి గాను 10 కిలోల వరి తవుడులో 2 కిలోల బెల్లంను కలిపి 2 నుంచి 3 లీ. నీటిని చేర్చి సుమారు 12 గంటల పాటు పులియనిచ్చి మరుసటి రోజు 100గ్రా. థైడికార్బ్‌ను కలుపుకొని ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న ఉండలుగా చేసి మొక్క సుడులలో వేసుకోవాలి. ఎమమేక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా థైమేమిథాక్సాన్ 9.5 శాతం, లాను సైహలోత్రిన్ 12 శాతం 0.5 మి.లీ లేదా క్లోరాన్‌ట్రినిలిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. పైరు మొలిచిన 10 నుండి 15 రోజుల మధ్య మొవ్వు పురుగు ఆశించే అవకాశాలున్నాయి. నివారణకు క్లోరోపైరిఫాస్ 2.0 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పైరు 25 నుంచి30 రోజుల దశలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరానికి 3 నుంచి 4 కిలోల చొప్పున మొవ్వులో వేయాలి. గత రెండు మూడు రోజుల్లో కురిసిన వర్షాలకు ప్రస్తుత మంచు వాతావరణానికి గింజ ఏర్పడే దశలో రబీ జొన్నలో గింజ బూజు తెగులు ఆశించుటకు అనుకూలం. తెగులును గమనించినట్టయితే నివారణకు 0.5 మి.లీ ప్రొపికొనజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

జొన్న: ప్రస్తుతం జొన్న గింజ ఏర్పడే దశలో ఉన్నందున గింజ బూజు తెగులు ఆశించుటకు అనుకూలం. తెగులు నివారణకు 0.5 మి.లీ ప్రోపికనజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ద్రాక్ష: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలను ఉపయోగించుకొని 90 రోజుల ఆముదం పంటకు 2 కిలోల నత్రజనిని పైపాటుగా వేసుకోవాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ద్రాక్షలో పక్షికన్ను తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 3 గ్రా. ప్రొఫినెట్ మందును లీటరు నీటిలో కలిపి కత్తిరింపుల తరువాత 20 రోజులలోపు పిచికారి చేయాలి. ద్రాక్షలో పెంకు పురుగు గమనించడమైంది. నివారణకు 2.5 మి.లీ క్లోరిపైరాపాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత పొడి వాతావరణ పరిస్థితులు ద్రాక్షలో తామర పురుగులు ఆశించుటకు అనుకూలం. ఉధృతి గమనించి 2 మి.లీ ఫిప్రోనిల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

మామిడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మామిడిలో తేనె మంచు పురుగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1 మి.లీ డైక్లోరోవాస్, 2.5 మి.లీ వేపనూనె మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

నిమ్మ జాతి పంటలు: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు నిమ్మజాతి పంటలో నల్లి ఆశించుటకు అనుకూలం. నివారణకు 3.0మి.లీ ప్రోపర్‌జైట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

జామ: జామ పండులో ఈగ ఉధృతి గమనించడమైంది. నివారణకు ఎకరానికి 4 నుంచి 5 లింగాకర్షక బుట్టలను తోటలో అమర్చాలి.

మిరప: మిరపలో తామర పురుగు, నల్లి ఉధృతి గమనించినట్టయితే నివారణకు 1.5 గ్రా. డిఫెన్‌థయూరాన్ లేదా 2 మి.లీ క్లోర్‌ఫినాపిర్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మిరపలో గుండు ఈగ ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.5 మి.లీ ట్రైజోఫోస్ లేదా 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఫ్యుజేరియం ఎండు తెగులు సోకే సూచనలున్నాయి. నివారణకు 3 గ్రా. కాపర్‌ఆక్సిక్లోరైడ్ లేదా 1 గ్రా. కర్బెండజిమ్ మందును లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ల దగ్గర నేల తడిచే విధంగా పిచికారి చేయాలి. మిరపలో వైరస్ తెగులు ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు ఈ వైరస్ వ్యాప్తి వాహకాలైన రసం పీల్చే పురుగులను అదుపు చేయాలి.

కూరగాయలు: ప్రస్తుత పొడి వాతావరణ పరిస్థితులలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ లేదా థయోమిథాక్సిమ్ 0.3 గ్రా. మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు టమాటలో ఆకుమాడు తెగులు సోకుటకు అనుకూలం. తెగులు నివారణకు 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1మి.లీ ప్రోఫికొనజోల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. ఆలస్యంగా నాటిన టమాట పైరులో శనగ పచ్చ పురుగు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.25 మి.లీ నోవాల్యూరాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. టమాటలో తామర పురుగులు కూడా ఆశించేందుకు అనుకూలం. నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

పశుపోషణ: కోళ్లలో కొక్కెర తెగులు, గొర్రెలలో చిటుకు, మశూచి వ్యాధి, ఆవులు, బర్రెలకు గొంతువాపు వ్యాధి, ఆవులు, ఆంబోతులలో జబ్బవాపు వ్యాధి సోకుటకు అనుకూలం. వీటి నివారణకు టీకాలు వేయించాలి.

ప్రత్యామ్నాయం: రాష్ట్ర వ్యాప్తంగా వేసిన పత్తి పంటను డిసెంబరు నెలాఖర వరకు తీసివేసి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పదేపదే పేర్కొంది. కానీ నీటి వసతి కింద పత్తి వేసిన రైతులు ఇంకా కొనసాగిస్తున్నారు.

సేకరణ : మోత్కూరు యాదయ్య



నీ ప్రవర్తన బాగాలేదు!

● శ్రీశాంత్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ : ఐపీఎల్ (2013) స్పాట్ ఫిక్సింగ్ కేసులో బీసీసీఐ చేత జీవిత కాల నిషేధానికి గురైన క్రికెటర్ శ్రీశాంత్‌పై సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడేందుకు బుకీలతో మాట్లాడిన సంభాషనల ఆధారంగా శ్రీశాంత్ సహా 36 మందిపై మోపిన నేరారోపణలను ఢిల్లీ హైకోర్టు 2015లో కొట్టివేసిన సంగతి తెలిసిందే. నిర్దోషిగా తేలినందున, తనపై విధించిన జీవితకాల నిషేధాన్ని తొలగించాలని శ్రీశాంత్ కేరళ హైకోర్టును ఆశ్రయించాడు. సింగిల్ జడ్జి బెంచ్ శ్రీశాంత్‌కు అనుకూలంగా తీర్పునివ్వగా, క్రమశిక్షణ చర్యలతో కోర్టుకు తీర్పునకు సంబంధం లేదని బీసీసీఐ పేర్కొనటంతో డివిజన్ బెంచ్ నిషేధాన్ని ఎత్తివేసేందుకు నిరాకరించింది. దీంతో శ్రీశాంత్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. సీనియర్ న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ వివాదస్పద క్రికెటర్ తరఫున వాదనలు వినిపించారు. 'బుకీలు మీతో సంప్రదింపులు జరిపినప్పుడు మీరు ఎందుకు వెంటనే ఈ విషయాన్ని బీసీసీఐ దృష్టికి తీసుకు రాలేదు. ఈ విషయంలో మీ ప్రవర్తన ఏమాత్రం బాగోలేదు' అని జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ కెఎం జొసెఫ్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఒక వేళ స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్టు బీసీసీఐ నిర్ధారణకు వచ్చినా, దాని ప్రకారం గరిష్టంగా ఐదేండ్ల నిషేధమే విధించాలని, అది ఎప్పుడో పూర్తయిందని ఖుర్షీద్ వాదించారు. బుకీలతో మాట్లాడిన సంభాషణల కచ్చితత్వంపై తొలుత శ్రీశాంత్ బీసీసీఐ నోటీసులకు సమాధానం ఇవ్వాలని పాలకుల కమిటీ తరఫున ప్రరాగ్ త్రిపాఠి కోరారు. శ్రీశాంత్‌ను భారత్‌లో కాకపోయినా, కనీసం విదేశాల్లో ఆడుకునేందుకైనా అనుమతించాలని అతని తరఫున న్యాయవాది కోర్టుకు విన్నవించారు. బుకీలు ముట్టజెప్పినట్టు చెబుతోన్న రూ. 10 లక్షలు శ్రీశాంత్ తీసుకోలేదని, అతడిపై జీవిత కాల నిషేధం మరీ కఠిన నిర్ణయమని ఖుర్షీద్ వాదించారు.

పాక్ టూర్‌కు విండీస్

● క్రికెట్ పునరుద్ధరణలో మరో అడుగు



కరాచీ : పాకిస్థాన్‌లో అంతర్జాతీయ క్రికెట్ పునరుద్ధరణలో మరో అడుగు ముందుకు పడింది. వెస్టిండీస్ మహిళల జట్టు మూడో మ్యాచుల టీ20 సిరీస్ కోసం బుధవారం కరాచీ చేరుకున్నది. కరాచీలోనే పాక్, విండీస్‌లు మూడు మ్యాచుల్లో తలపడనున్నాయి. గత 15 ఏండ్లలో ఆసియేతర జట్టు పాకిస్థాన్ పర్యటకు రావటం ఇదే ప్రథమం. కరాచీ విమాశ్రయంలో ప్రత్యేక వీవీఐపీ భద్రత నడుమ విండీస్ జట్టు హోటల్‌కు చేరుకున్నది. పీసీబీ సొంత బుల్లెట్ ప్రూఫ్ బస్సుల్లో క్రికెటర్లను తీసుకెళ్లగా, దారికి ఇరువైపులా 500 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. విమానాశ్రయం నుంచి హోటల్ చేరుకునే వరకూ ట్రాఫిక్‌ను సైతం నిలిపివేశారు. 'ఇక్కడ భద్రత బాగుంది. త్వరలోనే వన్డేలకు సైతం వస్తామని ఆశిస్తున్నాం. పాక్‌కు రావటం నిజంగా ఆనందంగా ఉంది, ఎందుకంటే ఇక్కడి ప్రజలు క్రికెట్‌ను అమితంగా ఇష్టపడతారు' అని విండీస్ కెప్టెన్ మెరీసా పేర్కొన్నది. 13 మంది క్రికెటర్లు, 8 మంది సహాయక సిబ్బందితో కూడిన విండీస్ బృందం పాక్‌కు వచ్చింది.


సూపర్ స్టార్ విరాట్ కోహ్లి లేని వేళ, భారత్ భవిష్య సూపర్‌స్టార్‌ను బరిలోకి దించనున్నదా? డబుల్ శతకాల నిపుణుడు రోహిత్ శర్మ కెరీర్ 200వ వన్డేలో ద్వి శతకం బాదేస్తాడా? హామిల్టన్‌లో న్యూజిలాండ్‌తో నాల్గో వన్డేకు ముందు అభిమానుల అంచనాలివి. సిరీస్ ఇప్పటికే సొంతం కావటంతో భారత్ క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. అపార ప్రతిభావంతుడు, యువ సంచలనం శుభ్‌మన్ గిల్ నేడు అరంగేట్రం చేసే అవకాశం ఉంది. న్యూజిలాండ్‌తో భారత్ నాల్గో వన్డే నేడు.

భారత్‌కు ఎదురుందా?

- కెరీర్ 200 వన్డేకు రోహిత్ శర్మ సిద్ధం
- అరంగేట్రంపై శుభ్‌మన్ తహతహ
- పుంజుకోవాలనే తపనలో కివీస్
- భారత్, కివీస్ నాల్గో వన్డే నేడు

ఉ॥ 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..





హామిల్టన్

సమవుజ్జీల సమరం కాస్త ఏకపక్షం కావటంతో న్యూజిలాండ్ దృష్టి ఇప్పుడు ఊరటపై పడింది!. భారత్‌తో సిరీస్‌కు ముందు కోహ్లిసేనకు కఠిన సవాల్ విసరగలదనే కితాబు అందుకున్న కివీలు, తొలి మూడు వన్డేల్లో తేలిపోయారు. స్వదేశంలో వరుసగా నాలుగు వన్డేల్లో ఓడని న్యూజిలాండ్ తాజాగా టీమ్ ఇండియా చేతిలో ఆ భంగపాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. హ్యాట్రిక్ విజయాలతో సిరీస్ దక్కించుకున్న టీమ్ ఇండియా అదే జోరు కొనసాగించాలని చూస్తోంది. యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ అరంగేట్రం, రోహిత్ శర్మ 200వ వన్డేపైనే అభిమానుల ఆసక్తి నెలకొన్నది.

తొలి అడుగు పడేనా? : '19 ఏండ్ల వయసులో అతడి ఆటలో కనీసం పది శాతమైనా నేను లేను' నెట్స్‌లో శుభ్‌మన్ గిల్‌ను చూసిన తర్వాత సూపర్‌స్టార్ విరాట్ కోహ్లి అన్న మాటలివి. నిరుడు న్యూజిలాండ్‌లోనే పరుగుల వరద పారించి అండర్-19 ప్రపంచకప్ విజయంలో ముఖ్య భూమిక వహించిన గిల్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో గిల్ పరుగుల వరద పారిస్తున్నాడు. దీంతో కోహ్లి తర్వాత భారత్‌కు పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో అతడే సూపర్‌స్టార్ అని విశ్లేషకులు కితాబు ఇచ్చారు!. అనూహ్య పరిణామంతో ప్రపంచకప్‌కు ముందు భారత జట్టులోకి వచ్చిన శుభ్‌మన్, పర్యటన మధ్యలో కోహ్లి విశ్రాంతి తీసుకోవటంతో అరంగేట్రానికి సిద్ధమవుతున్నాడు. మూడో వన్డేలో ధోనికి గాయంతో దినేశ్ కార్తీక్ మెప్పించాడు. ఇప్పుడు అతడిని తప్పించే సాహసం రోహిత్ చేస్తాడా? లేదా అనేది ప్రశ్నార్థకం. అంబటి రాయుడిని మూడో స్థానంలోని పంపి.. కార్తీక్, ధోనీలను ఇద్దరినీ తుది జట్టులోకి తీసుకోవాలనే ఆలోచన చేస్తే మినహా గిల్ తొలి మ్యాచ్ ఆడటం ఖాయమే. మరోవైపు ద్వి శతకాల స్పెషలిస్ట్ రోహిత్ శర్మకు ఇది ద్వి శతక వన్డే మ్యాచ్. ఈ సిరీస్‌లో ఓ సారి డబుల్ సెంచరీ చేసే అవకాశం, మరో సారి శతకబాదే అవకాశం ముందున్నా.. రోహిత్ వెనుదిరిగాడు. మైలురాయి మ్యాచ్‌లో మరో మెరుపు ఇన్నింగ్స్ ఆడేందుకు రోహిత్ ఉత్సుకత చూపిస్తున్నాడు. పాండ్య రాకతో జట్టు సమతూకం పెరిగింది. కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్‌లు స్లో స్పిన్‌తో కివీస్‌కు మళ్లీ సవాల్ విసిరేందుకు సిద్ధమయ్యారు.

కివీస్ కష్టాలు తీరేనా? : ఫేవరెట్‌గా సిరీస్‌ను మొదలెట్టిన న్యూజిలాండ్, ఇప్పుడు పరువు కోసం పాకులాడుతోంది. ఆరంభంలో పేసర్లకు, మధ్యలో స్పిన్నర్లకు దాసోహం అయిపోతున్న న్యూజిలాండ్ చివరి రెండు మ్యాచుల్లోనైనా నెగ్గాలనే కసితో కనిపిస్తోంది. కానీ బ్యాటింగ్ లైనప్ వైఫల్యాలు కివీస్‌కు గుది బండలా మారాయి. కొలిన్ మన్రో ఫామ్ అధ్వానంగా ఉంది. అసలు వన్డే ఫార్మాట్‌కు పనికొస్తాడా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సీనియర్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్ జట్టులో ఉన్నా లేనట్టే కనిపిస్తున్నాడు. కొత్త బంతితో పేస్‌ను ఎదుర్కొలేక మార్టిన్ ఆరంభంలోనే వికెట్ పారేసుకుంటున్నాడు. తిరుగులేని ఫామ్‌లో ఉన్న మిడిల్ ఆర్డర్ అనూహ్యంగా స్పిన్‌కు బలవుతోంది. కుల్దీప్, చాహల్ వేగం తగ్గించి సంధిస్తోన్న స్పిన్‌కు కివీస్ వద్ద సమాధనమే కరువైంది. తొలుత కివీస్ ఈ ప్రశ్నలకు జవాబు కనుగొనాలి. భారత స్పిన్నర్లు రాణించిన చోట, ఆతిథ్య జట్టు వికెట్ల వేటలో వెనుకంజ వేస్తున్నారు. ప్రభావం చూపగల పేసర్లు సైతం తేలిపోతున్నారు. ప్రపంచకప్ ముంగిట న్యూజిలాండ్‌కు ఇది మింగుడు పడని వ్యవహారమే. చివరి రెండు వన్డేల్లోనైనా కివీస్ పుంజుకోగలదా? చూడాలి.

పిచ్ రిపోర్టు : హామిల్టన్ పిచ్‌పై చివరగా జరిగిన మ్యాచుల్లో 260, 290 లక్ష్యాలను అలవోకగా ఛేదించారు. సహజంగా ఇక్కడ పేసర్లకు అనుకూలత ఎక్కువ. కానీ తొలి మూడు వన్డేల్లో మాదిరి స్పిన్నర్లు మరోసారి పైచేయి సాధించే అవకాశం లేకపోలేదు. టాస్ నెగ్గిన జట్టు ఛేదనకు మొగ్గుచూపే అవకాశం మెండుగా ఉంది!.

తుది జట్లు (అంచనా) : భారత్ : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, శుభ్‌మన్ గిల్/దినేశ్ కార్తీక్, అంబటి రాయుడు, కేదార్ జాదవ్, ఎం.ఎస్ ధోని, హార్దిక్ పాండ్య, కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, మహ్మద్ షమి, యుజ్వేంద్ర చాహల్.

న్యూజిలాండ్ : మార్టిన్ గప్టిల్, కొలిన్ మన్రో, కానె విలియమ్సన్, రాస్ టేలర్, టామ్ లాథమ్, హెన్రీ నికోల్స్, జేమ్స్ నీషమ్, మిచెల్ శాంట్నర్, టాడ్ అష్లె, లాకీ ఫెర్గుసన్, ట్రెంట్ బౌల్ట్.

ఫేస్ మార్పుకేనా?

గడ్కరీ వ్యాఖ్యలపై సందేహాలు

- మోడీపై ప్రజల్లో వ్యతిరేకత
- ప్రత్యామ్నాయం కోసం ఆర్‌ఎస్‌ఎస్ చూపులు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

మళ్లీ కేంద్రంలో అధికారపగ్గాలు చేజిక్కించుకునేందుకు బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తున్నది. నరేంద్రమోడీ నేతృత్వంలోనే ఎన్నికలకు వెళ్లాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ప్రకటించారు. మోడీకే ప్రజల మద్దతు ఉందనీ, ప్రతిపక్షాలు ఎవరు ఆయన దరిదాపుల్లోకి రారని ధీమా ఉన్నా లోలోపల మాత్రం ఆ పార్టీ నేతల్లో భయాందోళన నెలకొంది. ఎన్నికలకు ముందు ప్రజలను ఆకర్షించేందుకు ఎన్ని హామీలు గుప్పించినా మోడీ పట్ల అనుకున్నంత ఆదరణ పెరగడం లేదు. బీజేపీతో కలిసి నడవడానికి మిత్రులు సాహసం చేయడం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి మోడీ బొమ్మతో ఎన్నికలకు వెళ్లినా ఫలితాల అనంతరం సీట్ల ఆధారంగా మరో వ్యక్తిని తెరపైకి తీసుకురావడానికి ఆర్‌ఎస్‌ఎస్ వ్యూహాలు రచిస్తున్నట్టు తెలిసింది. 2014లో వచ్చిన సీట్లను ఈ ఎన్నికల్లో గెలచుకోవడం అసంభవమన్నది బీజేపీ నేతల అంచనా. కొన్ని పార్టీల మద్దతుతో అధికారంలో రావాలంటే 150పైగా సీట్లు గెలవాల్సి ఉంది. అలా అయితే మిత్రుల మద్దతు పొందాలన్నా ప్రధానిగా మరో వ్యక్తిని తీసుకురావాలన్నది ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచన. అందులో భాగమే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు అని తెలుస్తోంది. హామీల నెరవేర్చడంపైనా, ఎన్నికల్లో ఓటమిపైనా, పదిశాతం రిజర్వేషన్లు అమలు చేసినప్పుడు ఉపాధి అంశంపైనా పరోక్షంగా మోడీని వ్యతిరేకిస్తూ నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు చేయడం వెనుక ఆర్‌ఎస్‌ఎస్ హస్తం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. మోడీపై వ్యతిరేకతను ప్రతిపక్షాలు క్యాష్ చేసుకోకుండా గడ్కరీ చేత మాట్లాడించి ఉంటారని పలువురు సీనియర్ నేతలు అభిప్రాయపడ్డారు. ఇది ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ వ్యూహంలో భాగమేనని జాతీయ మీడియా కథనం. ఆర్‌ఎస్‌ఎస్‌కు నమ్మకస్తుడైన గడ్కరీ మోడీని విమర్శించడమంటే ఆర్‌ఎస్‌ఎస్‌ను తప్పుబట్టే. ఐదేండ్లు మంత్రిగా ఉంటూ ఏనాడూ పల్లెత్తు మాటనని వ్యక్తి ఎన్నికల సమయంలో స్పందించడమేంటన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎన్నికల అనంతరం మిత్రులను సంపాదించాలంటే గడ్కరీకి సాధ్యమన్న అభిప్రాయంతోనే ఆయనను తెరపైకి తెచ్చిందన్న ప్రచారం జరుగుతున్నది. మోడీకి వ్యతిరేకంగా విమర్శలు చేస్తున్నా గడ్కరీని తప్పుపట్టలేదంటే, అదంతా వ్యూహంలో భాగమేనంటున్నారు పరిశీలకులు.

అధికారంలో ఉన్నన్ని రోజులు దేశాభివృద్ధి విషయంలోనూ, సామాన్యప్రజలకు లబ్ధి చేకూర్చే ఏ ఒక్క పనిని మోడీ చేయలేదన్న విమర్శలున్నాయి. ఎన్నికల సమయంలో ఆయా వర్గాల ప్రజలను ఆకట్టుకునేందుకు కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నా అవి ఏ మేరకు ఓట్ల రూపంలో పడతాయన్నది ఆ పార్టీ నేతల్లో ఇప్పటికీ అనుమానంగానే ఉంది. మరోవైపు అయోధ్య పేరుతో హిందువుల ఓట్లకు గాలం వేయడానికి ప్రయత్నిస్తున్నది. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు రాజేందుకు వ్యూహాలు సిద్ధం చేసిందనడానికి బీజేపీ నేతలు వ్యాఖ్యలే నిదర్శనమని తెలుస్తోంది. చివరికి ప్రధాని మోడీ కూడా అయోధ్య, శబరిమల అంశాలపై సుప్రీంకోర్టు తీర్పులను వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ప్రతిపక్షాల్లో బలహీనతలు ఉన్నాయంటూ ప్రచారం చేస్తూ మోడీలాంటివారు ఉండబోరని ఆకాశాకెత్తేస్తున్నా వారిలో ఎక్కడచోట భయాందోళన నెలకొంది. ఎన్‌డీఏ కూటమిలో ఉన్న మిత్రుల్లో ఇప్పటికే 17 మంది పార్టీలు దూరమయ్యాయి. మిత్రులతో సంబంధం లేకుండా 2014 ఎన్నికల్లో సొంతబలంతోనే అధికారం చేపట్టినా ఈ సారి ఆ పరిస్థితి లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మోడీ అధికారంలోకొచ్చాక మొదట్లో కొన్ని రాష్ట్రాల్లో గెలిచినా ఆ తర్వాత జరిగిన ఉపఎన్నికలు, ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చిత్తుగా ఓడిపోయింది. బీజేపీకి బాగా పట్టున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్‌ల్లో బీజేపీ ఓడింది. కర్నాటకలోనూ పరాభావం తప్పలేదు. తెలంగాణలోనూ ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఉపఎన్నికల ఫలితాల్లో ఘోరంగా దెబ్బతింది. దీనకంతంటికీ మోడీ అనుసరిస్తున్న విధానాలతో ప్రజలు విసుగెత్తడమేనని విశ్లేషకుల అభిప్రాయం.

'లోక్‌పాల్' జాప్యంపై మరోసారి నిరాహార దీక్షకు దిగిన అన్నాహజారే



ముంబయి: ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే.. తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో మరోసారి నిరాహార దీక్షకు దిగారు. లోక్‌పాల్, లోకాయుక్త నియామకాల అమలులో జాప్యంపై కేంద్రం, మహారాష్ట్ర సర్కారు తీరుకు నిరసనగా ఆయన ఈ చర్యకు పూనుకున్నారు. విద్యార్థులు,యువత, రైతులతో కలిసి దీక్షా స్థలికి చేరుకున్న ఆయన.. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించి దీక్షలో కూర్చున్నారు. ప్రభుత్వం తమ హామీలను నెరవేర్చే దాకా నిరసన కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ఆయనకు డాక్టర్లు హెల్త్ చెకప్ చేశారు. లోకాయుక్త చట్టం, లోక్‌పాల్ నియామకం, రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చారని ఆయన గుర్తు చేశారు. అవినీతిపై పోరాటంలో లోక్‌పాల్, లోకాయుక్తల ఏర్పాటులో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. ఐదేండ్ల క్రితం లోక్‌పాల్ బిల్లును మూడు రోజుల్లో చట్టం చేసిన నాయకులకు.. లోక్‌పాల్ ఏర్పాటులో మాత్రం ఐదేండ్లు కూడా సరిపోలేదన్నారు. అందుకే రాజకీయ నాయకులకు తన వేదికపై స్థానం లేదన్నారు. తన డిమాండ్లు నెరవేరని కారణంగా 30న నిరాహార దీక్షకు దిగనున్నట్టు ప్రధాని మోడీకి సోమవారం రాసిన లేఖలో అన్నా హజారే పేర్కొన్న విషయం తెలిసిందే. కేంద్రంలో లోక్‌పాల్‌ను, రాష్ట్రాలలో లోకాయుక్తలను ఏర్పాటు చేయాలంటూ ఆయన ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనల మేరకే నకిలీ ఓటర్ల తొలగింపు

● సీఈవో రజత్ కుమార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నకిలీ గుర్తింపు కార్డుల ద్వారా కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్ ఓ.పీ.రావత్ ఓటు నమోదు చేశారని.. సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రజత్ కుమార్ తెలిపారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లతో ఎన్నికల నిర్వహణపై రేడియో జాకీలకు బేగంపేటలోని హరితప్లాజాలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రజత్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ సొసైటీలో రేడియోకు చాలా ప్రాముఖ్యత ఉందని, అందులో భాగంగానే రేడియో జాకీలు ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనలు, ఇతర విషయాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగరనే ఉద్దేశంతో వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం ఓటింగ్ జరుగుతుందని, అర్బన్‌లో ఈ శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటరు పేరును, అతడి ఓటును తొలగించడం అంత సులువు కాదన్నారు. వాటిని నిబంధనల ప్రకారమే తొలగిస్తామన్నారు. ఓటరు గుర్తింపు కార్డు ఉండగానే ఓటు హక్కు ఉన్నట్టు కాదని తెలిపారు. ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 1950 హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామని, దీని ద్వారా అన్ని వివరాలూ తెలుసుకోవచ్చునని తెలిపారు.

ఎక్కడ అవసరముంటే అక్కడ జీఎస్టీ రిజిస్ట్రేషన్

కౌన్సిల్ నిర్ణయం మేరకు చట్టంలో మార్పు

● ఆర్డినెన్సు జారీచేసిన గవర్నర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నిచోట్ల వ్యాపారం విస్తరించి ఉంటే అన్నిచోట్లా జీఎస్టీ (వస్తు సేవల పన్ను) రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఇప్పటి వరకు ఒక వ్యాపారికి ఒకే రాష్ట్ర పరిధిలో పలుచోట్ల వ్యాపారం విస్తరించి ఉంటే ఒకే జీఎస్టీ రిజిస్ట్రేషన్ నెంబర్‌తో వ్యాపార లావాదేవీలను నిర్వహించుకోవాలనే నిబంధన ఉండేది. అయితే ఢిల్లీలో ఇటీవల జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్రాలు వాటివాటి అవసరాన్ని బట్టి రాష్ట్ర జీఎస్టీ చట్టంలో మార్పులు చేర్పులు చేసుకోడానికి వీలు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారంగా ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర జీఎస్టీ చట్టానికి సవరణలు చేసే ఉద్దేశంతో ఆర్డినెన్సును రూపొందించింది. ఇందులో ఎనిమిది అంశాలను ప్రభుత్వం ప్రస్తావించింది. ఈ మేరకు రాష్ట్ర వస్తు సేవల పన్ను ఆర్డినెన్స్‌ను గవర్నర్ నరసింహన్ బుధవారం జారీ చేశారు. ఈ విషయాన్ని న్యాయ శాఖ కార్యదర్శి ఆర్డినెన్స్ ఉత్తర్వులో వెల్లడించారు. తెలంగాణ వస్తు సేవల పన్ను(సవరణ) ఆర్డినెన్స్ 2019 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. అసెంబ్లీ ప్రోరోగ్ కావడంతో ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చింది. ఇటీవల జీఎస్టీ కౌన్సిల్ చేసిన మార్పులకు అనుగుణంగా సెక్షన్‌కు సవరణ చేస్తూ ఈ ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చారు. తద్వారా పన్ను ఆదాయం పెంచుకోవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో మొత్తం ఎనిమిది సవరణలు ఉన్నాయి. ముఖ్యంగా చిన్న వ్యాపారుల రిజిస్ట్రేషన్ కోసం అమలు చేసే కాంపోజిషన్ స్కీమ్ కింద ఉన్న వార్షిక టర్నోవర్ పరిమితిని రూ. ఒక కోటి నుంచి రూ. కోటిన్నరకు పెంచింది. స్పెషల్ ఎకనమిక్ జోన్ (సెజ్) యూనిట్ లేదా డెవలపర్‌కు ప్రత్యేక రిజిస్ట్రేషన్ నెంబర్‌ను కేటాయించే వెసులుబాటును కల్పించింది. మోటార్ వాహనాలకు సంబంధించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ చెల్లింపు విషయంలో నిబంధనలను విధించింది. వివిధ సందర్భాల్లో పన్ను చెల్లింపుదారులు చేసుకునే అప్పీళ్లకు కనీస డిపాజిట్, వస్తువుల స్వాధీనానికి సంబంధించి ఉన్న గడువును 7 రోజుల నుంచి 14 రోజులకు పెంచడంతోపాటు వస్తు సరఫరా వంటి అంశాల్లో మార్పులు చేశారు. రిటర్న్ దాఖలు, ఐటిసి క్లయిమ్స్ విషయంలో వ్యాపారులకు సరళీకృత విధానాన్ని అమల్లోకి తెచ్చారు.

గీతంలో ప్రమాణ సందడి షురూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రమాణ సందడి ప్రారంభమైంది. వచ్చేనెల 2వ తేదీ వరకు సాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి. ఈ మేరకు గీతం అదనపు ఉపకులపతి ఎన్ శివప్రసాద్, ఫెస్ట్ కన్వీనర్ పి త్రినాథరావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గురువారం ఉదయం శివాజీ ఆడిటోరియంలో నిర్వహించనున్న ప్రారంభోత్సవానికి సెయింట్ డీఎల్ఎం సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్ర వెలగపూడి ముఖ్యఅతిథిగా, గీతం పూర్వవిద్యార్థి లెన్స్‌ఫిట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు, సీఈవో వంశీ సీమకుర్తి ఆత్మీయ అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.